# దారి దీపం
మాసపత్రిక

DAARI DEEPAM - RNI Title Code : APTEL 16175

సంపుటి 1 - సంచిక 2 | నవంబరు 2022 | వెల : రూ.15

మార్పు స్వరాలను వినిపిస్తున్న గుజరాత్, హిమాచల్ ఎన్నికలు

గాంధీయిజం.. కమ్యూనిజం

ఏడాదిన్నర ముందే వేడెక్కుతున్న దేశం !

అవినీతి నిరోధంపై సుభాషితాలు.. సుద్దులు

దేశానికి రానున్నవి.. చీకటి రోజులు

ఆధ్యాత్మిక ఫాసిజానికి ప్రతినిధులే ప్రవచనకారులు

భౌతికవాదాన్ని తవ్వి తీసిన దేవీప్రసాద్ చటోపాధ్యాయ

భారత్ పత్రికా రంగం భవిష్యత్ ఏమిటి ?

ఇప్పుడు మీడియా లేదు.. ఉన్నది మాఫియానే

కారు చీకటిలో కాంతి దీపం

వలస భారతదేశ చరిత్ర రచన

సమాజం సైన్స్.. కొన్ని అంశాలు

దండి తర్వాత అంతటి యాత్ర

ఈ హైందవ రాజ్యంలోకి ఎట్లా చేరాం ?

'సంవేదన' శీలి, ఆ 'సవ్యసాచి!'

నవంబరు 2022

# దారి దీపం
మాసపత్రిక

సంపుటి : 1 - సంచిక : 2

**డీవీవీఎస్ వర్మ**
- సంపాదకులు

సంపాదక వర్గం

కొప్పర్తి వెంకటరమణ మూర్తి

మందలపర్తి కిషోర్


డి.సోమసుందర్

డా॥ బి.రమేష్ చంద్రబాబు

వెల : 15 రూపాయలు

## ఈ సంచికలో..

1. మార్పు స్వరాలను వినిపిస్తున్న గుజరాత్, హిమాచల్ ఎన్నికలు : సంపాదకీయం 3
2. గాంధీయిజం.. కమ్యూనిజం : పుచ్చలపల్లి సుందరయ్య 5
3. ఏడాదిన్నర ముందే వేడెక్కుతున్న దేశం ! : కె.శ్రీనివాస్ 7
4. అవినీతి నిరోధంపై సుభాషితాలు.. సుద్దులు : ఎం.కోటేశ్వరరావు 9
5. దేశానికి రానున్నవి.. చీకటి రోజులు : జస్టిస్ మార్కండేయ కట్జూ 13
6. ఆధ్యాత్మిక ఫాసిజానికి ప్రతినిధులే ప్రవచనకారులు : అశోక్ కుంబము 15
7. భౌతికవాదాన్ని తవ్వి తీసిన దేవీప్రసాద్ చట్టోపాధ్యాయ : దేవరాజు మహరాజ్ 18
8. ప్రగతి శీల అంశాలను దాచుకోవాలి : జి.భార్గవ్ 20
9. భారత్ పత్రికా రంగం భవిష్యత్ ఏమిటి ? : ఎన్.రామ్ 21
10. ఇప్పుడు మీడియా లేదు.. ఉన్నది మాఫియానే : ఎన్.వేణుగోపాల్ 24
11 కారు చీకటిలో కాంతి దీపం : ఆర్వీ రామారావు 25
12. వలస భారతదేశ చరిత్ర రచన : కొప్పర్తి వెంకటరమణమూర్తి 27
13. సమాజం సైన్స్.. కొన్ని అంశాలు : మహ్మద్ అక్బర్ 30
14. మానవ లక్షణం : మర్ల విజయ్‌కుమార్ 34
15. దండి తర్వాత అంతటి యాత్ర: వకుళాభరణం రామకృష్ణ 38
16. ఆకార్ పటేల్ హైందవ రాజ్యం పుస్తక సమీక్ష : ఎన్.వేణుగోపాల్ 39
17. 'సంవేదన' శీలి, ఆ 'సవ్యసాచి!' : మందలపర్తి కిషోర్ 41
18. మోదీ ట్రిక్స్.. కార్టూన్స్ 43
19. కొత్త పుస్తకాలు - స్వీకారం 44




కార్టూన్ : సతీష్ ఆచార్య

దారి దీపం మాసపత్రిక

వివరాలకు సంప్రదించండి

డా॥ బి.రమేష్ చంద్రబాబు,
34-15-1,
దొడ్డిపట్ల వారి తోట వీధి,
తణుకు - 534211,
ప.గో.జిల్లా, ఏపీ
ఫోన్ : 93971 14495

### గాంధీ మార్గం

దేశం అభివృద్ధి చెందడం అంటే అద్దాల మేడలు, రంగుల గోడలు నిర్మించడం కాదు. పౌరుని నైతికాభివృద్ధే నిజమైన దేశాభివృద్ధి.

# మార్పు స్వరాలను వినిపిస్తున్న గుజరాత్, హిమాచల్ ఎన్నికలు



గుజరాత్, హిమాచల్ ఎన్నికల ఫలితాలు డిసెంబర్ 8న రానున్నాయి. ఇవి బీజేపీ పాలనలో వున్న రాష్ట్రాలు గొప్పగా చెప్పుకునే డబుల్ ఇంజన్ సర్కార్లు. మోదీ జనాకర్షణ మీద ఆధారపడిన పార్టీ ప్రభుత్వాలు. అక్కడ ఎదురుదెబ్బ తగిలితే ఎన్నికలలో మోదీ మంత్ర దండం మహిమ దిగజారుతుంది. ఆ పార్టీ దేశం మొత్తం మీద డీలా పడుతుంది. డబుల్ ఇంజన్ సర్కార్ల పేరుతో ప్రాంతీయ పార్టీల మీద జరుగుతున్న దాడికి బ్రేకులు పడతాయి. ఇప్పటి వరకు వస్తున్న సమాచారం ప్రకారం ఈ రాష్ట్రాలలో పరిస్థితి మోదీకి నల్లేరు మీద బండిలా లేదు. అందువల్లనే మోదీ–షాలు వారి బలగాలు కాలికి బలపం కట్టుకుని ఎన్నికల సభలు, రోడ్ షోలతో హోరెత్తిస్తున్నారు. ఎన్నికల ప్రచారం కోసం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రమాణ స్వీకారానికి సైతం మోదీ దుమ్మా కొట్టారు. చివరికి పోటీ చేసే అభ్యర్థులను, పార్టీని పక్కనపెట్టి మోదీ తన ప్రతిష్టను పణంగా పెట్టి తనను చూసి ఓటు వెయ్యమని కోరే స్థితిలో పడ్డారు. అయినా మోదీ – షాలకు స్వంత రాష్ట్రంలో కూడా ఎదురీత తప్పడం లేదు. ఎందుకంటే ఈ రాష్ట్రాలలో ప్రజలు మార్పు పట్ల మొగ్గు చూపుతున్నారు. చాలామంది మార్పు కావాలని గొంతు విప్పుతున్నారు. ఇది ఈ ఎన్నికల్లో కనిపిస్తున్న ముఖ్య పరిణామం. ఇదే మోదీ–షాలకు ఆందోళన కలిగిస్తున్నది. మోదీ ప్రభుత్వం గత ఎనిమిదేళ్లుగా తన ఎజెండా చుట్టూ దేశ ప్రజలు, పార్టీలు తిరిగేలా చేసింది. మెజారిటీ మతవాదానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా దోహదం చేసే అంశాలు, ప్రకటనలు, చర్యలతో కూడిన ఎజెండాను వారు ఎంచుకున్నారు.

దేశరక్షణకు పాకిస్థాన్ నుండి పొంచివున్న ప్రమాదం, సర్జికల్ స్ట్రైక్స్, పుల్వామా, ట్రిపుల్ తలాక్, పౌరసత్వ చట్టాలు, హిజాబ్‌లు, మధుర, జ్ఞానవాపి వివాదాలు, పట్టణాల వీధుల పేర్లు మార్చడాలు వగైరాలతోపాటు ఒకే దేశం ఒకే ప్రజ, ఒకే ఎన్నిక, ఒకే భాషా వంటి నినాదాల చుట్టూ రాజకీయ చర్చ జరిగేలా చేశారు. మీడియా మీద పట్టు సాధించి వీటి పైనే చర్చ జరిపించారు. ఇలా రెచ్చగొట్టిన హిందూ మెజారిటీ జాతీయవాదాన్ని ఎన్నికల విజయాలకు, మోదీ వ్యక్తి పూజకు సాధనాలుగా మార్చుకున్నారు. ప్రతిపక్ష పార్టీలు ప్రత్యామ్నాయ ఎజెండాను ముందుకు తేకుండా మోదీ ఎజెండాను విమర్శించడం, నిరసనలు వ్యక్తం చెయ్యడానికి పరిమితం కావడంతో ప్రజల నిత్య జీవన సమస్యలు తెరవెనుకకు పోయాయి.

ఇలాంటి స్థితిలో రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రను ప్రారంభించారు. ఎన్ని పరిమితులు వున్నప్పటికీ అది మోదీ ఎజెండాకు భిన్నమైంది. దానికి ప్రత్యామ్నాయమైంది. మోదీ పాలన రెచ్చగొడుతున్న విద్వేషాన్ని హింసను వ్యతిరేకిస్తూ వివిధ మతాలు, భాషలు, సంప్రదాయాలు గల దేశాన్ని ఐక్యపరిచే నినాదంతో సాగుతున్నది. అధిక ధరలు, నిరుద్యోగం, రైతులకు లాభసాటి ధరలు, మంచి ప్రమాణాల విద్య, వైద్యం వంటి అంశాలతోపాటు ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకాలు, మోదీ మిత్రులకు మాత్రమే లబ్ధి చేకూర్చే విధానాలు ఈ యాత్రలో వెలుగు చూస్తున్నాయి. ఈ ప్రజా సమస్యల జోడింపుతో యాత్రకు విశేష ప్రజా స్పందన లభిస్తున్నది. దీని ప్రభావం గుజరాత్, హిమాచల్ ఎన్నికలలో కనిపిస్తున్నది. మోదీ మెజారిటీ మత జాతీయవాదంకంటే ఓటర్లు తమ నిత్యజీవిత సమస్యల మీద స్పందించడం, మార్పు కోరుతూ గళం విప్పడం కనిపిస్తున్నది.

బీజేపీకి అంతులేని ఆర్థిక బలం వుంది, పోలింగ్ బూత్ స్థాయిలో ఓటర్లను ప్రభావితం చేసే యంత్రాంగం వుంది. హోరెత్తించే ప్రచారం చెయ్యగల మీడియా తోడ్పాటు, విషప్రచారం చెయ్యగల సోషల్ మీడియా దండు వున్నది. ఈ ఎన్నికలలో జయాపజయాలు ఎలా వున్నా ప్రజాసమస్యల మీద చర్చ ప్రారంభం కావడం మాత్రం నిస్సందేహంగా ఒక ఆశావహ పరిణామం.

డీవీవీఎస్ వర్మ, సంపాదకులు,
85006 78977

# గాంధీయిజం.. కమ్యూనిజం

గాంధీ భవన్‌లో, గాంధీ జ్ఞాన మందిరం వారి ఆహ్వానంపై ఇచ్చిన స్మారకోపన్యాసం



పుచ్చలపల్లి సుందరయ్య

సామాన్య ప్రజల దృష్టిలో.. గాంధీయిజానికి, కమ్యూనిజానికి ఉత్తర, దక్షిణ, ధృవాలకున్నంత దూరముందనీ, గాంధీయిజం అహింసా విధానాన్ని అవలంభిస్తే, కమ్యూనిజం హింసావాదాన్ని నమ్ముతుందని, గాంధీవాదులు ఆధ్యాత్మిక వాదులైతే, కమ్యూనిస్టులు భౌతికవాదులని భావించబడుతుంది. దేశంలోని రాజకీయ జీవితంలో కూడా గాంధీ రాజకీయాలకు, కమ్యూనిస్టు రాజకీయాలకు హస్తిమశకాంతర బేధముందని, అసలు మన దేశంలో కమ్యూనిజానికి తావేలేదని భావించబడుతున్నది. అలాంటప్పుడు గాంధీ భవనంలో గాంధీ జ్ఞాన మందిరం వారి ఆధ్వర్యాన జరిగే ఈ సభలో నన్ను ఉపన్యసించమని అడిగినప్పుడు కొంచెం తటపటాయించాను. అయినా ఈ సమితి వారు నాకిచ్చిన ఈ అవకాశాన్ని వినియోగించుకుని మరొకసారి ఈ విషయాన్ని గురించి మననం చేసుకునే అవకాశం కలిగింది. నేను వెలిబుచ్చే అభిప్రాయాలు ఈ విషయంపై ఇక ముందు జరగబోయే చర్చలకు ప్రాతిపదికగా వుంటాయనే ఉద్దేశ్యంతో ఈ సమావేశంలో ప్రసంగించడానికి అంగీకరించాను.

1925-30 సంవత్సరాల మధ్యకాలంలో ప్రజాసేవ, దేశసేవ చేయాలని నాలో ఉత్సాహం కలిగిందంటే అది గాంధీ గారి రచనలను, వ్యాసాలను చదవడం వల్లనే. అలా చెప్పుకోవడానికి నేను గర్విస్తున్నాను. నిజానికి కమ్యూనిస్టు పార్టీలో అనేక మంది ఆయన రచనలను చదవడం ద్వారానే ఉత్తేజితులయ్యారు. ఆ అయిదేళ్లలో ఖద్దరు, అస్పృశ్యతా నివారణ, హిందూ ముస్లిం ఐక్యత, స్వదేశీ ఉద్యమం, సత్యాగ్రహం, మద్యపాన నిషేధం ఒకటేమిటి ఆయన రాసిన రచనలన్నీ చదివాను. కాని, 1930 నాటికి కొన్ని అనుమానాలు పొడచూపడం ప్రారంభించాయి. గాంధీ గారి పద్ధతుల ద్వారా, గాంధీ గారి విధానాల ద్వారా దేశ స్వాతంత్ర్యాన్ని సాధించగల్గినా నూటికి తొంభై మందిగా వున్న కార్మిక, కర్షక, మధ్యతరగతి ప్రజల ప్రభుత్వంగా అది ఉంటుందా? లేక నూటికి 10 మందిగా వున్న పెట్టుబడి దారులు, భూస్వాముల ప్రభుత్వంగా ఉంటుందా? ఒకవేళ స్వాతంత్ర్యం సిద్ధిస్తే అది బ్రిటీష్ సామ్రాజ్యవాదులతోనో లేక భారత పెట్టుబడిదారులతోనో రాజీ పడటం ద్వారా వచ్చే స్వాతంత్ర్యమే అవుతుందేమోనని అనుకోవడం జరిగింది. 1948లో గాంధీజీ చనిపోయే వరకు ఆయనతో మాకు అనేక విషయాల్లో భేదాభిప్రాయాలు ఉంటూ వచ్చాయి. అయితే వారి వ్యాసాలను శ్రద్ధగా చదివాను.

> **వందల వేల ఎకరాలు గల భూస్వాములు, లక్షల కోట్ల ఆదాయం గల పెట్టుబడిదార్లు ఈ ఆస్తులన్నింటికీ తామే యజమానులమనీ అనుకోకుండా ప్రజలకు ధర్మకర్తృత్వం వహించి ఆ డబ్బు ప్రజలకోసం, దేశం కోసం వినియోగించాలనేదే గాంధీగారి ధర్మకర్తృత్వ సిద్ధాంతం. ఈ సిద్ధాంతంతో మేమెన్నటికీ ఏకీభవించలేము.**

1928లో నేను బాలబాట సంఘంలో ఉండేవాణ్ణి. కానీ గాంధీజీ సభలకు వెళ్ళడానికి ఎప్పుడైతే నాకు అభ్యంతరం కలుగజేశారో అప్పుడు ఈ సంస్థ సామ్రాజ్యవాదులకు అనుకూలమైన సంస్థని భావించి ఇక ఒక్క క్షణం కూడా అందులో ఉండకూడదని ఇవతలకు వచ్చేశా. ఆ విధంగా గాంధీ గారి రాజకీయాలకు దగ్గరగా వచ్చాను. నూరేళ్ల సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో స్వాతంత్ర్యం కోసం కృషి చేసిన వారిలో గాంధీజీ అందరికన్నా అగ్రగణ్యులు, ముందున్న మహావ్యక్తి. గాంధీజీకి ముందు దాదాభాయ్, గోఖలే, రనడే, తిలక్ మొదలగు మహామహులు కాంగ్రెసు సంస్థకు పునాదులు వేసి పనిచేసిన వారున్నారు. కొంత మంది ఉద్యోగస్తులను, అధికారులను భయోత్పాతం కలుగజేయటం ద్వారా వారిని తరిమి వేయగలమని అనుకున్న 'టెర్రరిస్టు'లున్నారు. ఆ తర్వాత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి ప్రజల్లో పనిచేస్తూ వచ్చింది. ఈ మహావ్యక్తుల ఉద్యమాలు స్వాతంత్ర్య సముపార్జనలో ముఖ్య పాత్ర వహించాయి. కానీ వీరందరికన్నా, ఉద్యమాలన్నింటికన్నా తలమానికంగా గాంధీజీ ఉంటూ వచ్చారు. గాంధీజీలో ఉన్న ప్రత్యేకత ఏమిటి? ఇలా తలమానికంగా వుండటానికి కారణం ఏమిటి?

సామాన్య ప్రజలలో చైతన్యాన్ని కలిగించి వారందరూ కూడా పాల్గొనడానికి వీలయ్యే ఒక కార్యక్రమాన్ని ఇచ్చి ముందుకు నడిపించడంలోనే గాంధీజీ గొప్పతనం ఉంది. మనం సాధించిన స్వాతంత్ర్యం గాంధీజీ కలలుగన్న స్వరాజ్యమేనా? ఒకరిని మరొకరు పీడించే, ఒక వర్గాన్ని మరొక వర్గం దోచుకునే వ్యవస్థకు స్వస్తి చెప్పి, సామాన్య ప్రజలకు పూర్తి స్వాతంత్ర్యాన్ని ఇచ్చిన స్వరాజ్యమేనా? ఈ రోజున కాంగ్రెస్ అగ్రనాయకులు నిర్వహిస్తున్న సహకార సర్వోదయ సోషలిజమేనా ఈ స్వరాజ్యం ? స్వాతంత్ర్యం సంపాదించడానికి గాంధీయిజం పునాదులు వేసింది. స్వాతంత్ర్యం అనే మన ఆశయాన్ని సాధించడంలో గాంధీజీ యొక్క ప్రముఖ పాత్రను కమ్యూనిస్టులు గుర్తిస్తారు. కాని అంత వరకు మాత్రమే. గాంధీజీ సిద్ధాంతాలు అంతకు మించి ముందుకు పోవడానికి తోడ్పడవు. కమ్యూనిస్టు పదజాలం ద్వారా వివరించాల్సి వస్తే సమాజం అంతర్గత వర్గాలుగా విభజింపబడి వుంది. భారతదేశంలో కూడా బూర్జువావర్గం, గ్రామాల్లో భూస్వామ్య వర్గాలేగాక, కార్మికులు, రైతులు, మధ్య తరగతి ప్రజలు ఉన్న వర్గంగా విభజింపబడి ఉన్నాయి. స్వాతంత్ర్య పోరాటంలో అన్ని వర్గాల వారూ పాల్గొన్నారు. ఈ పోరాటానికి వ్యక్తులుగా ఎవరు నాయకత్వం వహించారన్నది చూసినట్లయితే మొదట గాంధీజీ, ఆ తర్వాత నెహ్రూ అని చెప్పవచ్చు. కాని వర్గ రీత్యా చూస్తే బూర్జువా వర్గం లేక ధనిక వర్గం అని చెప్పాల్సి వస్తుంది. ఇతర వర్గాలు స్వాతంత్ర్యం కోసం కృషి చేశాయి. కాని నాయకత్వం ప్రధానంగా బూర్జువా వర్గానిదే. దేశాన్ని స్వాతంత్ర్యం వైపుకు తీసుకొని పోవడంలోనైతేనేమి, ప్రజలందరినీ పోరాటంలోకి సమీకరించడంలోనైతేనేమి గాంధీజీ సిద్ధాంతాలు ప్రాముఖ్యత వహించాయి. కానీ, ఆ సిద్ధాంతానికి పరిమితులున్నాయి. విదేశీ పెత్తనం పోవడానికి మాత్రమే పరిమితమైంది. కానీ నూటికి 90 మందిగా వున్న సామాన్య ప్రజానీకం నిజంగా స్వాతంత్ర్యం కలుగజేయడానికి ఈ సిద్ధాంతాలు చాలవు. నేనిది వరకే చెప్పినట్లు గాంధీ సామాన్య ప్రజానీకానికి అందుబాటులో ఉండే కార్యక్రమాన్ని ఇవ్వడం జరిగింది.

మనదేశంలో మాలలను దూరంగా, అంటరానివారుగా చూసినట్లే దక్షిణాఫ్రికాలోను తెల్లవారు నీగ్రోలను తదితర జాతుల వారిని దూరంగా వుంచేవారు. ఈ జాతి విద్వేష విధానాన్ని రూపుమాపి సమానత్వం సాధించడం కోసం గాంధీజీ సత్యాగ్రహ, సహాయ నిరాకరణ రూపాల్లో పోరాటం సాగించారు. హృదయ పరివర్తన ద్వారా సాధించాలన్నారు గాంధీజీ. ఆ పోరాటంలో అనేక మంది పాల్గొన్నారు. అలాగే 1917లో భారతదేశంలో మొదటిసారిగా బీహార్లోని చంపరాన్‌లో బ్రిటీష్ తోట యజమానులకు వ్యతిరేకంగా "నీలి ఆకు రైతులు" పోరాటం(ఇండిగో స్ట్రగుల్) నడిపారు. ఆ తర్వాత జరిగిన సత్యాగ్రహ పోరాటాలు ముఖ్యంగా 1920-22, 1930-34, 1940-45 సంవత్సరాల్లో మూడు దశల్లో జరిగాయి.

1922లో ఈ సత్యాగ్రహ పోరాటాన్ని గాంధీ - ఇర్విన్ ఒడంబడిక జరిగిన తర్వాత విరమింపచేయడం సరికాదని మా అభిప్రాయం. మళ్ళీ మన బలాలను సమీకరించుకోవడానికి తాత్కాలికంగా విరమిస్తే సరిగా ఉండేది. అది కూడా ప్రజల కనుకూలమైన షరతులతో విరమించి ఉండాల్సింది. అయితే 1924లో, 1934లోనూ అంతకుముందు జరుగుతూ వచ్చిన పోరాటాలు విరమించడం సరి అయినదేనని నా అభిప్రాయం.



ఆ రోజుల్లో మన ఉద్యమం బలహీనపడినప్పుడు శత్రువుదే పైచేయిగా ఉన్నప్పుడు విరమించబడమొక్కటే మార్గం. ఈ విధంగా 1927, 31 సంవత్సరాల్లో ఉద్యమాలు ఉచ్చస్థాయిలో ఉన్నప్పుడు పోరాటాలు విరమించడం అంటే ఆ ఉద్యమాలకు పరిమితులు పెట్టడమే అవుతుంది. ప్రాథమిక దశల్లో ప్రజల్లో చైతన్యం కలిగించి కదలించడానికి మాత్రమే ఈ సత్యాగ్రహ పోరాటాలు ఉపకరించాయి. వెనుకబడి తలెత్తుకోలేని ప్రజానీకాన్ని వారు పాల్గొనేటటువంటి కార్యక్రమం ఇవ్వడమే ఈ పోరాటాల ప్రాముఖ్యత.

1945 నాటికి రెండో ప్రపంచయుద్ధం ముగిసి ప్రపంచ పరిస్థితులు మారాయి. బ్రిటీష్ సామ్రాజ్యవాదులు బాగా బలహీనపడ్డారు. దేశంలో అజాద్ హింద్ ఫౌజ్ పోరాటం, అనేక రాష్ట్రాల్లో కార్మిక, కర్షక పోరాటాలు, స్వదేశీ సంస్థానాల్లో తిరుగుబాట్లు- ఇవన్నీ బ్రిటీష్ సామ్రాజ్యవాదాన్ని బలహీనపరిచి, వారు స్వాతంత్ర్యం ఇచ్చేలా చేయడానికి దారి తీశాయి. అయితే స్వరాజ్యం వచ్చినా బ్రిటీష్ వారి ఆర్థిక పెత్తనం అలాగే వుందని, ఆర్థిక పెత్తనం అలా వున్నంతకాలం అది సంపూర్ణ స్వరాజ్యం కాదనే మీమాంసలు వుండనే వున్నాయి. ఆర్థిక ప్రాబల్యం వున్నా, నేటి ప్రపంచ పరిస్థితుల దృష్ట్యా బ్రిటీష్ వారు భారత దేశాన్ని తామనుకున్నట్లు తమ పిడికిలిలో ఉంచుకోలేక

పోయారు. కాగా కేవలం గాంధీ గారి అహింసా సిద్ధాంతాలతో ఏకీభవించని వారు స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు, అలాగే మనకు స్వాతంత్ర్యం వచ్చిందంటే ఆనాటి ప్రపంచ పరిస్థితుల ప్రాబల్యం లేకపోలేదు. కేవలం కాంగ్రెస్ పార్టీ కృషి వలనే స్వాతంత్ర్యం వచ్చిందనటం సత్యదూరం. అయితే కాంగ్రెస్ పార్టీ యొక్క ప్రాముఖ్యం ఉందనీ మాత్రం అంగీకరిస్తాం. మహాత్మా గాంధీ నిరంతరం హిందూ – ముస్లిం ఐక్యత కోసం కృషి చేస్తూ వచ్చారు. ఆఖరుకు ఒక హిందూ మతోన్మాది చేతిలో తుపాకీ కాల్పులకు బలి అయ్యారు. ఈ రోజున భారత్ – పాకిస్తాన్ దేశాలను హిందూ మహ్మదీయ రాజ్యాలుగా ఒకరికి వ్యతిరేకంగా మరొకరిని సామ్రాజ్యవాదులు రెచ్చగొడుతున్న ఈ సందర్భంలో గాంధీజీ యొక్క ఈ కార్యక్రమం ఎంతైనా ప్రాముఖ్యం వహిస్తుంది. గాంధీజీ యొక్క ఈ ఆశయాన్ని ఇంకా మనం చేరుకోలేదు. గాంధీజీ యొక్క కృషి చాలా ముఖ్యమైనది. కేవలం అంటరానితనం పోగొట్టడమే గాక ఏ కులంలో పుట్టినా సమానత్వం వుండాలని, సాంఘిక సమానత్వానికి భిన్నమైన ఈ పరిస్థితిని తొలగించాలని గాంధీజీ అవిరళ కృషి చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం రాజ్యాంగ చట్టం ద్వారా తదితర చట్టాల ద్వారా ఈ అంటరానితనాన్ని పోగొట్టటానికి కృషి జరిగింది. కానీ, తొలగలేదనే చెప్పాలి. హొటళ్ళలోనూ, దేవాలయాలలోనూ ప్రవేశానికి ప్రయత్నాలు జరిగాయి. కానీ ఆర్థిక అసమానత తొలగనన్నాళ్ళూ ఈ సమస్య అపరిష్కృతం గానే వుంటుంది. మన దేశం ప్రధానంగా వ్యవసాయ దేశం, వ్యవసాయం ప్రధాన వృత్తిగా పెట్టుకొని జీవిస్తున్న వారికి గ్రామ పరిశ్రమల నేవి తీరిక సమయంలో మరికొంత ఆదాయాన్ని ఇస్తాయనేటంత వరకు అంగీకరిస్తాం. కానీ, గ్రామ పరిశ్రమల ద్వారానే ప్రధాన భారీ పరిశ్రమలు లేకుండానే దేశం ముందుకు పోతుందనే ఆర్థిక సిద్ధాంతంతో అంగీకరించలేము. పరిశ్రమలో వికేంద్రీకరణ జర పాలసీ, భారీ పరిశ్రమలు మన నాగరికతకు గొడ్డలిపెట్టు అనే వాదనతో మేము ఏకీభవించలేము. కానీ గ్రామ పరిశ్రమలు వెనుకాలనున్న విదేశీతత్వంతో, మనదేశం స్వయం పోషకంగా వుంటూ మన దేశంలో తయారయ్యే వస్తువులను ఉపయోగించుకోవాలనే దానితో మేము పూర్తిగా ఏకీభవిస్తాం. కమ్యూనిస్టులు భౌతికవాదులు కాబట్టి,నిరాడంబర జీవనానికి వ్యతిరేకులని చాలామంది అభిప్రాయం. గాంధీ అంత నిరాడంబరంగా ప్రతి పార్టీ కార్యకర్త నిరాడంబర జీవితం గడపాలి. అలా చేయకపోతే ప్రజలతో సజీవ సంబంధాలు పెట్టుకోలేం. ఈ విషయంలో గాంధీవాదులే గాంధీ సిద్ధాంతాలను ధిక్కరిస్తున్నారు. కొద్దో గొప్పో మేమే ఆయన సిద్ధాంతాలకు దగ్గరగా వున్నాం. అయితే ఇంకా కృషి చేయాల్సి వుంది.

ప్రజలు – మద్యపాన మత్తులై తాగి తందనాలాడి డబ్బు వృధా చేయాలని కమ్యూనిస్టులు కోరడం లేదు. అంతవరకూ మద్యపాన నిషేధ సిద్ధాంతాన్ని అంగీకరిస్తాం. అయితే నిర్బంధంగా ఆ సిద్ధాంతాన్ని అమలు పరచడం అవివేకం. ఈ రోజున మనం చూస్తున్నట్లుగా అది మరింత ప్రమాదకరమైన పానీయాలు తాగడానికి దారితీస్తుంది. ఈ పరిస్థితుల్లో మార్పు తీసుకొని రావడం ద్వారానే మద్యపాన నిషేధాన్ని జయప్రదంగా అమలు పరచగలుగుతాం. వందల వేల ఎకరాలు గల భూస్వాములు, లక్షల కోట్ల ఆదాయం గల పెట్టుబడిదార్లు ఈ ఆస్తులన్నింటికీ తామే యజమానులమనీ అనుకోకుండా ప్రజలకు ధర్మకర్తృత్వం వహించి ఆ డబ్బు ప్రజల కోసం, దేశం కోసం వినియోగించాలనేదే గాంధీగారి ధర్మకర్తృత్వ సిద్ధాంతం. ఈ సిద్ధాంతంతో మేమెన్నటికీ ఏకీభవించలేము. ఈ రోజున ఉత్పత్తి సాధనాలు వారి చేతుల్లో ఉన్నాయి. వాటిని తమ స్వలాభం కోసం వినియోగించుకుంటున్నారు. దాన్ని వ్యతిరేకించి పోరాడక తప్పదని మేము భావిస్తాం. భారీ లాభాలు తగ్గించకుండా, వారి ఆస్తులు తగ్గించకుండా వారిలో హృదయపరివర్తన తీసుకొని రావడం అసంభవం. ఉద్యమానికి పరిమితులు పెట్టడం అవుతుంది.

**గాంధీజీ ధనికవర్గాల కోసం పని చేస్తున్నాడని మేము ఇదివరకు బండగా చెబుతూ వచ్చాం. ఇదీ తప్పు. కాని ఆయన పెట్టిన పరిమితుల వల్ల అవలంభించిన కొన్ని పద్ధతులవల్ల ఆయన అనుకున్నా, అనుకోకపోయినా ధనికవర్గాల ప్రాబల్యం, పెత్తనం అలాగే ఉండిపోవడం జరిగింది. సమానత్వమనేది గాంధీ సిద్ధాంతాల్లో కీలకం.**

స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న రోజుల్లో ఈ వర్గాలు కూడా పోరాటంలో కొంతవరకు కలిసివచ్చారు. కాబట్టి అప్పుడు వ్యతిరేక పోరాటం కొంత పదును తగ్గించారంటే అర్థం చేసుకోవచ్చు గానీ స్వాతంత్ర్యానంతరం అటువంటి దృక్పథం అవలంబించటం ఎంతమాత్రం సమర్థనీయం కాదు. దీనినే మేము వర్గపోరాటం అంటాము. అయితే దీని అర్థం ఈరోజున కమ్యూనిస్టులు సాయుధ పోరాటం కావాలంటున్నారని మీరెవరైనా సాగదీసి అర్థం తీశారంటే మాకు అన్యాయం చేసినవారవుతారు. హృదయ పరివర్తన ద్వారా లొంగితే మంచిదే. కానీ వారి సౌకర్యాలను కాపాడుకోవడానికి దౌర్జన్యానికి దిగితే, ఆ దౌర్జన్యానికి లొంగడం ద్వారా ఒక చెంపమీద కొడితే మరొక చెంపకూడా ఇవ్వడం ద్వారా హృదయ పరివర్తన కలుగుతుందా? లేక పెత్తందారీ వర్గాలు దౌర్జన్యానికి దిగినప్పుడు ఆత్మరక్షణకు పూనుకోవడం ద్వారా హృదయ పరివర్తన చేయగలమా? మార్పు శాంతియుతంగా జరగాలనేదే మా వాంఛ. అనేకమంది చనిపోవడాన్ని బుర్రలు బద్దలు **(మిగతా 12వ పేజీలో)**

# ఏడాదిన్నర ముందే వేడెక్కుతున్న దేశం !




**కె.శ్రీనివాస్**

**ఆంధ్రజ్యోతి సంపాదకులు**


చూడగా చూడగా, తెలంగాణ రాష్ట్రాన్ని జేబులో వేసుకోవడం వాళ్లకు అత్యంత అవసరంగా కనిపిస్తోంది. మునుగోడులో ద్వితీయస్థానమే రేపటి ప్రథమస్థానమన్న సంతృప్తితో ఉత్సాహపడతారని, తీరికగా వ్యూహరచన చేస్తూ, అంతిమ లక్ష్యం రెండు వేల ఇరవై మూడా, లేక ఇరవై ఎనిమిదా అన్నది నిర్ణయించుకుంటారని అనుకున్నాము. కానీ, విచికిత్సా లేదు, విరామమూ లేదు. వెంటనే రంగంలోకి దిగారు. సమస్త జాతీయసంస్థల పటాలాలు మోహరించాయి. కొనుగోలు కుంభకోణం దర్యాప్తు కొంత రెచ్చగొట్టి ఉండవచ్చును కానీ, ఇంతటి వేగానికి అది కారణం కాదనిపిస్తుంది. మొత్తానికి వాళ్లకు చాలా తొందరగా ఉన్నది. అందుకు రెండు కారణాలు ఉండవచ్చు. ఒకటి వేడిగా ఉన్నపుడే ఇనుమును వంచాలి. తెలంగాణలో రాజకీయ ఉష్ణోగ్రతలు బాగా తీవ్రంగా ఉన్నాయి. వారి అదృష్టవశాత్తూ, కాంగ్రెస్ ఇంకా గోరువెచ్చగానే మిగిలిపోయింది. ప్రభుత్వం మీద జనంలో వ్యతిరేకత బాగానే ఉన్నది. అనువైన సమయం కాబట్టి అధికులమ నవచ్చునని అనుకోవడంలో బీజేపీ తప్పులేదు. మరొక కారణం, 2024 ఎన్నికలు. ఆనాటికి, బీజేపీకి లెక్క తక్కువపడవచ్చు. పాతస్థానాలలో నష్టం జరిగితే, కొత్తస్థానాలతో భర్తీ చేసుకోవచ్చు. బీజేపీ బలానికి కొత్త చేర్పు ఇవ్వగల రాష్ట్రంగా తెలంగాణ కనిపిస్తున్నది. ఈ రెంటిలోనూ రెండో కారణమే ప్రధానమైనది కావచ్చు. నిజానికి, స్నేహం కుదిరితే, కేసీఆర్ తన లోక్‌సభ సీట్లతో బీజేపీకి మద్దతు ఇస్తారు, గత వైఖరులను బట్టి చూస్తే, అందుకు ఆయనకు సైద్ధాంతిక అభ్యంతరాలేమీ ఉండవు కూడా. కానీ, అరువు బలం మీద బీజేపీకి ఇప్పుడు ఆసక్తి లేదు. తమకు ఇప్పట్లో ఆశ లేని చోట్ల జగన్‌మోహన్ రెడ్డి వంటి లొంగుబాటు మిత్రుడు కావాలి కానీ, తెలంగాణలో అవసరం లేదు. బిజెపితో కెసిఆర్ దూరం జరగడం కాదు, బీజేపీ కూడా కెసిఆర్ను దూరం పెడుతున్నది, అందువల్లనే కేసీఆర్ తప్పనిసరి యుద్ధం చేయవలసిన పరిస్థితిలో పడ్డారు. అతి ప్రమాదకరమైన యుద్ధంలోకి అనివార్యంగా ప్రవేశించారు. బలాఢ్యుడితో తలపడవలసి వచ్చే బక్కమనిషి మీద జనానికి సానుభూతి ఏర్పడుతుందని బీజేపీ గమనించాలి. ఎంపిక చేసిన వేటలు వికటించగలవని గుర్తించాలి.

ఇంతకీ 2024 బిజెపికి ఎందుకు ముఖ్యం? 'మేం అయిదేళ్లు పాలించిపోవడానికి రాలేదు, యాభై ఏళ్లు పాలించడానికి వచ్చాం' అని అమిత్ షా అంటుంటారు. వాజపేయి ప్రధానిగా ఉన్నప్పటి ఎన్డీఏ-1లాగా అధికారంలో ఉండడానికి మోదీ, షాలు ఇష్టపడరు. కనీసం 2014 నుంచి 2019 దాకా గడచిన ఎన్డీఏ 2 లాగా ఉండడం కూడా వారికి ఇష్టం లేదు. ప్రస్తుత హయాంలో లోక్‌సభలో తిరుగులేని బలం ఉన్నదికానీ, అరకొర రాజ్యసభ ఇబ్బంది పెడుతూనే ఉన్నది. ఆ కొరవ కూడా ఉండకూడదు. కాంగ్రెస్‌కు ఆ యాభై మంది కూడా ఉండ కూడదు. అప్పుడు మాత్రమే వారు అనుకున్న మరి కొన్ని లక్ష్యాలను నెరవేర్చుకోగలరు. 2025లో భారత రిపబ్లిక్ అమృతోత్సవాలు, అదే సంవత్సరం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతవార్షికోత్సవాలు. దేశానికి కొత్త రాజ్యాంగం కాకున్నా, రాజ్యాంగానికి కొత్త దిశ, వీలైతే దేశాన్ని హిందూరాష్ట్రగా ప్రకటించడం వంటి పరిణామాలు జరగవచ్చు. అందుకు తిరుగులేని బలం కావాలి. తమ ఉనికి దక్షిణాదిలో కనీసం రెండు రాష్ట్రాలలో బలంగా ఉంటే, అది తాము సంకల్పించిన మౌలిక మార్పులకు విశ్వసనీయత అందిస్తుంది. అందుకని, 2023లో తెలంగాణ ఎన్నికలు బీజేపీకి చాలా కీలకం.

**రాహుల్‌యాత్ర, దేశంలోని ప్రజాస్వామికవాదులందరూ ఆహ్వానించవలసిన అంశంగా చెబుతూ, సామాజిక శాస్త్రవేత్త, పాత్రికేయులు యోగేంద్రయాదవ్, పెను ప్రమాదాన్ని నివారించడానికి 2024 ఎన్నికలు తుది అవకాశమని, ఇప్పుడు కాకపోతే, మరెప్పుడూ ఆ అవకాశం రాదన్నారు. చివరి అవకాశమని ఆవేశ తీవ్రత వల్ల ఆయన వక్కాణించి ఉండవచ్చును కానీ, అనేక ప్రయత్నాలు ఈ యాత్రలో భాగమైపోయి, నిజంగానే మెజారిటీవాద, ఆధిపత్య మతతత్వ శక్తులను బలహీనపరచడానికి అవకాశం దొరుకుతుందని యాదవ్ విశ్వసిస్తున్నారు.**

సాధారణ ఎన్నికలు జరిగి మూడున్నరేళ్లు మాత్రమే అయింది. ఇంకా ఏడాదిన్నరకు పైగా సమయం ఉండగానే, వాతావరణం వేడెక్కడం మొదలైంది. రాహుల్‌గాంధీ పాదయాత్ర ఆయన వ్యక్తిగత ప్రతిష్ఠను మరమ్మతు చేయడానికి, తద్వారా, కాంగ్రెస్

సంస్థపై ఆయన పట్టును పెంచి, అంతిమంగా పార్టీకి కొత్త బలం తేవడానికి ఉద్దేశించింది. జాతీయ మీడియా ఆయన ప్రయత్నాన్ని దారుణంగా అప్రధానం చేస్తున్నది. రాహుల్ యాత్ర, దేశంలోని ప్రజాస్వామిక వాదులందరూ ఆహ్వానించవలసిన అంశంగా చెబుతూ, సామాజిక శాస్త్రవేత్త, పాత్రికేయులు యోగేంద్రయాదవ్, పెనుప్రమాదాన్ని నివారించడానికి 2024 ఎన్నికలు తుది అవకాశమని, ఇప్పుడు కాకపోతే, మరెప్పుడూ ఆ అవకాశం రాదని అన్నారు. చివరి అవకాశమని ఆవేశ తీవ్రత వల్ల ఆయన వక్కాణించి ఉండవచ్చును కానీ, అనేక ప్రయత్నాలు ఈ యాత్రలో భాగమైపోయి, నిజంగానే మెజారిటీవాద, ఆధిపత్య మతతత్వ శక్తులను బలహీనపరచడానికి అవకాశం దొరుకుతుందని యాదవ్ విశ్వసిస్తున్నారు. ఆయన ఆశిస్తున్నట్టుగానే, అన్ని రాష్ట్రాలలో పౌర సమాజం ప్రతినిధులు యాత్రలో భాగమై, సంఘీభావం చెబుతున్నారు.

యాత్రలో భాగంగా, హైదరాబాద్ వచ్చినప్పుడు, ప్రజాపక్ష మేధావులు కొందరితో కలిసి రాహుల్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యే అవకాశం నాకు దొరికింది. చూసిన వెంటనే ఆయనలో వెంటనే గమనించిన అంశం, అలసట లేదు, ఆత్రుత లేదు, తాను చేస్తున్న చిన్న ప్రయత్నం దీర్ఘకాలికంగా ఫలితం సాధిస్తుందన్న నమ్మకం ఉంది. జనంతో చేస్తున్న ఈ నడక ద్వారా ఆయన చాలా నేర్చుకుంటున్నారు. ముఖ్యంగా వివిధ శ్రేణుల ప్రజల ఆకాంక్షలు, మనోభావాలు, అభిప్రాయాలు తెలుసుకుంటున్నారు. ఎందుకు తెలంగాణలో కూడా యువకులు మత తత్వం వైపు ఆకర్షితులు అవుతున్నారు అని ఆయన ప్రశ్నించారు. ప్రజా వ్యవహారాలలో ఇంతటి అలక్ష్యాన్ని, అహంకారాన్ని ప్రదర్శించే రాష్ట్ర ప్రభుత్వాన్ని చైతన్యవంతులైన తెలంగాణ ప్రజలు ఎట్లా సహిస్తున్నారు అని ఆయన ఆశ్చర్యపోయారు. మతతత్వ వ్యాప్తి సాంస్కృతిక, సామాజిక మాధ్యమాల ద్వారా అధికంగా జరుగుతున్నప్పుడు, ఆ రంగంలో కాంగ్రెస్ కూడా నిబద్ధ యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకోవాలి కదా అన్న సూచనతో ఆయన ఏకీభవించారు. రాహుల్ చేస్తున్న ప్రయత్నంలో 2024 గురించిన స్పృహ అంతర్లీనంగా ఉండవచ్చును కానీ, ఆ గడువుకు సంబంధించిన ఒత్తిడి ఉన్నట్టు లేదు. ఇంకా దాదాపు మూడు నెలలపాటు సాగే యాత్రలోనూ, ఆ తరువాత ఏడాదికి పైగా ఉన్న వ్యవధిలోనూ చాలా జరగవచ్చు. ఆయన సమకూర్చుకున్న మిత్రులు, అనివార్యంగా చేరవలసివచ్చే పొత్తుదారులు ఎందరో సమీకృతమవుతారు. మీడియా వక్రీకరించిన తన ప్రతిబింబాన్ని ఆయన తన శ్రమ ద్వారా, నిబద్ధత ద్వారా సరిదిద్దుకుంటున్నారు. కుటిల విమర్శలు ఆయనకే మేలు చేస్తాయని తెలుసుకుని, సామాజిక మాధ్యమ వీరులు వెనక్కు తగ్గారు. ధైర్యం, ఆర్ద్రత, సంకల్పం నిండిన మాటలు అనేకం ఆయన మాట్లాడుతున్నారు. ఆర్ఎస్ఎస్ నేరుగా ప్రస్తావిస్తూ విమర్శించడం, మోదీ ప్రభుత్వ కార్పొరేట్ మిత్రులను వేలెత్తి చూపించడం కాంగ్రెస్ నాయకుడిగా రాహుల్ చేస్తున్న సాహసమనే చెప్పాలి. అంతిమంగా ఆయన ఎట్లా పరిణమిస్తాడో తెలియదు కానీ, ఈ చారిత్రక సందర్భంలో మాత్రం, ప్రత్యామ్నాయ వాదులకు ఒక ఆధారపడదగిన శక్తిగా రూపుదిద్దుకుంటున్నారు.

ప్రజారంగానికి సంబంధించిన మరొక ఆసక్తికరమైన వ్యక్తిని కలిసిన అనుభవాన్ని ఇక్కడ ప్రస్తావించాలి. ఆయన దీపాంకర్ భట్టాచార్య. సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జాతీయ ప్రధానకార్యదర్శి. బిహార్ ఎన్నికల్లో 12 శాసనసభా స్థానాలను గెలుచుకుని దేశ వ్యాప్తంగా వామపక్ష అభిమానులను ఉత్సాహపరిచింది ఆయన పార్టీయే. 2024 అన్నది జీవన్మరణ సమస్య ఏమీ కాదంటారు భట్టాచార్య. 2024 తప్పనిసరిగా ఒక అవకాశమే. సందేహం లేదు. కానీ, మళ్లీ బీజేపీ గెలిచినంత మాత్రాన దేశమంతా లొంగిపోయి ఉండదు కదా, ప్రయత్నాలు కొనసాగుతాయి అన్నారాయన. ఒకవేళ నరేంద్రమోదీ 2024లో ఓడిపోయినా, పర్యవసానాలు ఏమంత సాఫీగా ఉండవని ఆయన హెచ్చరించారు. తాను ఓడిపోయిన ఎన్నికను ట్రంప్ అంగీకరించలేదు. కాపిటల్ మీదనే దాడికి ప్రోత్సహించాడు. అమెరికాలోని సమస్త వ్యవస్థలూ ఏకమై అతనిని కట్టడి చేయవలసి వచ్చింది. ప్రజాస్వామిక వ్యవస్థలు బలహీనంగా ఉన్న భారత్లో అంతకుమించిన పరిణామాలు జరగవచ్చునని భట్టాచార్య అన్నారు. '1977 నాటి పరిస్థితితో 2024ను పోలుస్తున్నారు కొందరు, నాటికీ నేటికీ తేడా ఉన్నది. ఎమర్జెన్సీని సడలించి ఇందిరాగాంధీ ఎన్నికలు నిర్వహించారు. మనం అప్రకటిత ఎమర్జెన్సీలోనే 2024 ఎన్నికలను ఎదుర్కొనవలసి ఉన్నద'ని ఆయన హెచ్చరించారు. కలవకపోతే మనుగడ లేదని విభిన్న శక్తులు ఆనాడు సమీకృతమయ్యాయని, ఇప్పుడు బీజేపీయేతర శక్తులు ఆ అవశ్యకతను గుర్తిస్తేనే ఉమ్మడి ప్రయత్నాలు సాధ్యమని భట్టాచార్య చెప్పారు. కాంగ్రెస్ లేని ప్రతిపక్ష ఐక్యతను కేసీఆర్ ఆశించడం సరికాదన్నారు. బీజేపీ ప్రభుత్వాన్ని రాజకీయంగా ఓడిస్తే సరిపోదని, వారు సమాజంలోకి జొప్పించిన వాతావరణంతో చాలాకాలం పోరాడాలని అన్నారాయన. ప్రజాస్వామ్యాన్ని అన్నిస్థాయిలలో, అన్ని రంగాలలో పటిష్టం చేయడమే మెరుగైన భవిష్యత్తుకు మార్గమని ఆయన అభిప్రాయపడ్డారు. ఇంతకూ, 2024 భారత ప్రజలకు ఏమిటి? ఏ రాజకీయ పక్షమూ సుదీర్ఘకాలం అధికారంలో ఉండగలగడం కానీ, మౌలికాంశాలను యథేచ్ఛగా సవరించగలగడం కానీ వాంఛనీయం కాదు. ప్రత్యామ్నాయం, ప్రతిపక్షం ప్రజల హక్కు. విపరీత జనామోదం భయానకమైనదని జర్మనీ అనుభవం చెబుతున్నది. తనను తాను వివేకవంతమైన మార్గంలోకి మళ్లించుకోవడానికి భారతీయ సమాజం ఎటువంటి ప్రయత్నాలు చేస్తుందో, వాటికి లభించే సానుకూలతలు, ప్రతికూలతలు ఏమిటో రానున్న ఏడాదిన్నర ఉద్రిక్తకాలంలో పరిశీలించవచ్చు. ❑

# అవినీతి నిరోధంపై సుభాషితాలు, సుద్దులు



ఎం.కోటేశ్వరరావు
**సీనియర్ జర్నలిస్టు, వేదిక.కామ్**

దేశంలో ఏం జరుగుతోంది ? అందరూ శాకాహారులే రొయ్యలబుట్ట మాయం అన్నట్లు దేశంలో అందరూ సత్య హరిశ్చంద్రుల వారసులం, అవినీతి అంటే అదేమిటో తెలియని వారం అన్నట్లుగా ఉంటారు. అయినా అవినీతి గురించి మాట్లాడని రోజు లేదు. దేశంలో అవినీతిని రూపు మాపేందుకు ఒక నిపుణుల కమిటీని వేసేందుకు ఆదేశాలు జారీ చేయాలంటూ బీజేపీ నేత అశ్వనీ ఉపాధ్యాయ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన దరఖాస్తును సుప్రీంకోర్టు కొట్టివేసింది. అదే బీజేపీ నేతలు మరో వైపు దేశంలో అవినీతి లేదు అక్రమాలు లేవంటూ రోజూ ఢంకా బజాయించి మరీ చెబుతుంటారు. స్వచ్ఛత సూచికలను ప్రకటిస్తున్న మాదిరి నెల లేదా మూడు నెలలకు ఒకసారి అవినీతి అధికారుల మీద ఉన్న కేసుల ఆధారంగా వివిధ శాఖలకు సూచికలను ప్రకటించాలని ప్రధాని నరేంద్రమోడీ చెబుతారు. ఆచరణ చూస్తే విస్తుపోతారు. అవినీతి గురించి 2014 తరువాత చెప్పిన వాటిని అమలు చేయకుంటే బీజేపీకి వ్యతిరేకంగా తమ బృందం ఆందోళనకు దిగుతుందని అన్నాహజారే కార్యదర్శి కల్పనా ఇనాందార్ ప్రకటించారు. కొంత మంది నమ్ముతున్నట్లు ఆ జగన్నాటక సూత్రధారి ఎవరిని ఎలా ఆడిస్తున్నాడో, ఎందుకు అలా ఆడిస్తున్నాడో అర్థం కావటం లేదు.

అవినీతి సూచికలో మన దేశ స్థానాన్ని మెరుగు పరిచేందుకు ప్రపంచంలో తొలి 20 స్థానాల్లో ఉన్న దేశాలు అనుసరిస్తున్న అవినీతి నిరోధక విధానాలు, అవగాహన ఏమిటో తెలుసుకొనేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు నిపుణులతో కమిటీలు వేసే విధంగా, దేశ అవినీతి సూచిక మెరుగుపడే విధంగా అవగాహనకు సూచనలు చేసే విధంగా లా కమిషన్‌ను ఆదేశించాలని అశ్వినీ ఉపాధ్యాయ పిటీషన్ దాఖలు చేశారు. సంబంధిత అంశాలపై పనిచేస్తున్న వారిని సంప్రదించాలని, మన దగ్గర ఇప్పటికే ప్రత్యేక చట్టాలున్నాయని, అవినీతి నిరోధానికి చర్యల గురించి లా కమిషన్‌ను అడుగుతామంటూ పిటీషన్‌ను కోర్టు కొట్టివేసింది. నరేంద్రమోడీకి అధికారాన్ని కట్టబెట్టంలో కాంగ్రెస్ నేతల అవినీతి, అక్రమాలు ప్రధాన పాత్ర పోషించిన అంశం తెలిసిందే. ట్రాన్సపరెన్సీ ఇంటర్నేషనల్ (టీఐ) ప్రకటించిన అవినీతి సూచికలో 2012, 13 సంవత్సరాల్లో మన దేశం 94వ స్థానంలో 2014లో 85, 2015లో 76కు ఎదిగింది. తరువాత క్రమంగా దిగజారుతూ 2020లో

> **'నేను తినను.. ఇతరులను తిననివ్వను' జనానికి నరేంద్రమోడీ చెప్పిన మాటలు. అంతే కాదు, జనం సొమ్ముకు చౌకీదారు(కాపలాదారు)నని చెప్పుకున్నారు. ఇంకేముంది ! అనుచరగణమంతా తమ పేర్ల చివర చౌకీదార్ అని తగిలించుకున్నారు. అందరూ జేజేలు పలికారు. అవినీతిని అంతం చేసే కొత్త దేవుడు దిగివచ్చారని ప్రచారం చేశారు. ఇంతకాలం తిన్న సొమ్మంతా అణాపైసలతో కక్కిస్తారని అనుకున్నారు. ఇపుడెవరూ చౌకీదార్ అని చెప్పుకోవటం లేదు.**

86, 2021లో 85లో ఉంది. 2022 సూచికను వచ్చే ఏడాది జనవరిలో ప్రకటిస్తారు. అవినీతి అంతం గురించి చెప్పిన నరేంద్రమోడీ ఏలుబడిలో తిరిగి అది కోరలు చాస్తోందన్నది స్పష్టం. టీఐ సూచికలు సరైనవా కాదా అన్న చర్చకు వస్తే కాంగ్రెస్ పాలనలో–బీజేపీ ఏలుబడిలో సూచికలను ఇచ్చింది కూడా అదే సంస్థ కనుక మోడీ పాలన గురించి ఇచ్చింది తప్పైతే కాంగ్రెస్ పాలన గురించి చెప్పింది కూడా తప్పే అవుతుంది. ఎక్కడ చూసినా అవినీతి తాండవిస్తోంది కనుకనే అసలు దాని గురించి చర్చకు రాకుండా జాగ్రత్తపడుతున్నారు. వచ్చినా మా మోడీ మీద ఇంతవరకు ఒక్క ఆరోపణ లేదుగా అని ఎదురుదాడికి దిగుతున్నారు. ఆ మాటకొస్తే మన్మోహన్ సింగ్ మీద కూడా ఏమీ లేవు.

ఇటీవల నిఘా చైతన్య వారోత్సవాల్లో ప్రధాని నరేంద్రమోడీ ఎన్నో సుభాషితాలు పలికారు. అధికారుల మీద అపరిష్కృతంగా ఉన్న కేసుల సంఖ్యను బట్టి వివిధ శాఖలకు సూచికలు ఇవ్వాలని సూచించారు. ఆ నిర్ణయం చేసి ఆ సభలో పాల్గొని ఉంటే విశ్వసనీయత ఉండేది. ఎవరు అడ్డుపడ్డారు ? కేంద్ర నిఘా సంస్థలో ఫిర్యాదుల యాజమాన్య వ్యవస్థను ప్రధాని ప్రారంభించారు. అవినీతి నిరోధక సంస్థలలో పని చేస్తున్నవారి మీద బురద చల్లేందుకు, పని చేయనివ్వకుండా చూసేందుకు స్వప్రయోజనపరులు చూస్తారని, ఆ క్రమంలోనే తనను కూడా

లక్ష్యంగా చేసుకున్నారని, కానీ జనం దేవుళ్లు వారికి నిజం తెలుసు, తరుణం వచ్చినపుడు వారు నిజానికి మద్దతుగా నిలు స్తారు అన్నారు. కేంద్ర నిఘా సంస్థ 2021 వార్షిక నివేదిక ప్రకారం కేంద్ర శాఖల్లోని అధికారులు, సిబ్బందిపై వచ్చిన 1,09,214 ఫిర్యాదుల్లో ప్రధాని తరువాత స్థానంలో ఉన్న అమిత్ షా నిర్వహిస్తున్న హోంశాఖ మీద వచ్చినవి 37,670, తరువాత 11,003తో రైల్వే, 6,330తో బాంకులు ఉన్నాయి. 2013లో సివిసికి 35,332 వచ్చాయి. ఆ తరువాత నుంచి క్రమంగా పెరుగుతున్నాయి. దీని భావమేమి తిరుమలేశా ! మోడీ అధికారానికి వచ్చిన తరువాత అధికారుల్లో అవినీతి పెరిగినట్లా తగ్గినట్లా !! కేసుల గురించి సూచికలు ఇమ్మని ప్రధాని చెప్పారు సరే, తన ఏలుబడిలోని ప్రభుత్వ శాఖలు ఎలా పనిచేస్తున్నట్లు ? కామన్ వెల్త్ హ్యూమన్ రైట్స్ ఇనీషియేటివ్ సంస్థ ఒక సమాచారహక్కు ప్రశ్నకు ఇచ్చిన సమాధానాన్ని వెల్లడించింది. దాని ప్రకారం 2013 ఏప్రిల్ నుంచి 2017 ఫిబ్రవరి వరకు డిజిఎఫ్‌టి కార్యాలయాలకు అందిన 181 అవి నీతి ఫిర్యాదులపై ఒక్కదాని మీద ఎలాంటి చర్యలు ప్రారంభిం చలేదని, 2009లో వచ్చిన వాటిలో ఒక కేసులో ఒక అధికారిపై విధించిన పెనాల్టి వివరాలను సమాచార హక్కు కింద ఇవ్వ లేదని తేలింది.దరఖాస్తులకు సమాధానాలు ఇవ్వలేదు. కర్ణాటక లోకాయక్త సమాచారహక్కు ప్రశ్నకు ఇచ్చిన సమాధానం మరింత దారుణంగా ఉంది. అవినీతి కేసులు, తాను దర్యాప్తు చేసిన వాటి వివరాలను గణాంకాలను నిర్వహించాల్సిన బాధ్యత తమకు లేదని, 2006లో కేంద్ర సమాచార కమిషన్ జారీ చేసిన ఉత్తరువు ప్రకారం పెద్ద ప్రజా ప్రయోజనం ఉంటే తప్ప సమాచారం ఇవ్వనవసరం లేదని, సమాచారం గనుక ఇస్తే నిం దితులైన అధికారుల గోప్యతకు భంగం కలుగుతుందని సమా ధానమిచ్చింది. నిఘా చైతన్య వారోత్సవాల్లో ఇలాంటి సంస్థలు, వ్యవస్థ అధికారులకే మోడీ సుభాషితాలను వినిపించారు.

నరేంద్రమోడీ పాలనలో అవినీతి పెరిగిందని, గ్రామాల సంపదలను పారిశ్రామికవేత్తలు లూటీ చేస్తుంటే ప్రభుత్వం మౌనంగా ఉందని అన్నా హజారే కార్యదర్శి కల్పన నవంబరు పదవ తేదీన లక్నోలో రాష్ట్రీయ కిసాన్ మంచ్ ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో చెప్పారు.2011లో అన్నా ప్రారంభించిన అవినీతి వ్యతిరేక ఆందోళన కారణంగా కాంగ్రెస్‌కు మారుగా బీజేపీ అధికారానికి వచ్చిందని ఎనిమిదేళ్లుగా చేసిందేమీ లేదన్నారు. గతంలో కూడా అన్నా హజారే ఇలాంటి హెచ్చరికలే చేశారు. ఇప్పుడేం చేస్తారో చూడాల్సి ఉంది. మోడీ అధికారానికి వచ్చిన తరువాత ఈడీ తదితర సంస్థల దాడులు విపరీతంగా పెరిగాయి. అవినీతి మీద పోరులో తమ తీరుకు ఇది నిదర్శనం అని బీజేపీ చెప్పుకుంటుంది. అసలు కథలు వేరే అన్నది తెలిసిందే. ఆర్థిక రంగం క్రమబద్దీకరణ జరిగి పన్ను ఎగవేతలు, ఆర్థిక నేరాలకు తావు లేదంటున్నారు, మరి గత ఎనిమిదిన్న రేళ్లలో దాడుల సంఖ్య విపరీత పెరుగుదలకు కారణం ఏమిటి ? 2004 నుంచి 2014 వరకు 112 ఈడి దాడులు జరిగితే 2014 నుంచి 2022 వరకు 3,010 దాడులు చేసినట్లు ప్రభు త్వం పేర్కొన్నది. 112 దాడుల్లో స్వాధీనం చేసుకున్న మొత్తం రు.5,346 కోట్లు, 3010 దాడుల్లో చేసుకున్నది రు.99,356 కోట్లు. 3010 కేసుల్లో శిక్షలు పడింది కేవలం 23 ఉదంతా ల్లోనే, అందుకే వీటిని ప్రతిపక్షాల నేతల మీద బెదిరింపు దాడులని జనాలు అనుకుంటున్నారు. ఏటా జీఎస్టీ 85 వేల కోట్ల మేరకు ఎగవేస్తున్నట్లు బ్రిటన్‌కు చెందిన రుబిక్స్ సంస్థ అంచనా వేసింది. ఇలా అవినీతి గురించి ఎన్నైనా చెప్పుకోవచ్చు.

ఇటీవలి కాలంలో సమాచార కేంద్రాల అనుసంధానం కారణంగానే చట్టబద్దంగా జరిగే లావాదేవీల మీద నిఘాతో పాటు అక్రమాలను కనుగొనటం సులభతరమైంది. వాటి ఆధా రంగా అక్రమార్కుల మీద తీసుకొంటున్న చర్యలే ప్రశ్నార్ధకం. రెండవది అక్రమాలకు పాల్పడుతున్నవారు గతంలో మాదిరి నగదుతోనే పని నడిపిస్తున్నారు. అందుకే దాడులు జరిపితే టన్నుల కొద్దీ నగదు పట్టుబడుతున్నది. పెద్ద నోట్ల రద్దు తరువాత ఆర్థిక రంగంలో నగదు సరఫరా 17.7 లక్షల కోట్ల నుంచి 32 లక్షల కోట్లకు పెరిగింది. అవినీతి పెరుగుదలకు ఇదొక సూచిక. మోడీ సర్కార్ చెబుతున్నట్లు లావాదేవీలన్నీ బాంకుల ద్వారా జరిగితే ఇటీవల తెలంగాణాలోని మునుగోడు, అంతకు ముందు హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో వందల కోట్ల ఖర్చు గుట్టు వెల్లడి కావాలి. అలాంటిదేమీ లేదు.

2014కు ముందు అవినీతి ప్రభుత్వానికి ఒక అత్యవసరమైన భాగంగా ఉండేది. ఇప్పుడు ఏ మాత్రం సహించని విధానం అనుసరిస్తున్నామని నరేంద్రమోడీ హిమచల్‌ప్రదేశ్ ఎన్నికల సభల్లో చెప్పారు. మాటలు కాదు ఆచరణ అన్నది అసలు జరు గుతున్నదేమిటో మనకు చూపుతుంది. లోక్‌పాల్ జోక్ పాల్‌గా మారిందని కేంద్ర సమాచార కమిషన్ మాజీ సభ్యుడు శైలేష్ గాంధీ చమత్కరించారు. అవినీతికి వ్యతిరేకంగా అన్నా హజారే చేసిన ఆందోళనకు మోడీ అండ్ కో మద్దతు ఇచ్చింది. దాన్నే ఒక ప్రధాన ఎన్నికల అంశంగా చేసుకొని లబ్ది పొందింది. అలాంటి పెద్దలు సుప్రీంకోర్టు ఆదేశించిన తరువాతనే ప్రధాని పీఠం ఎక్కిన ఐదేళ్ల తరువాత ఇష్టం లేని పెళ్లికి తలంబ్రాలు పోసినట్లు లోక్‌పాల్ నియామకం జరిపారు.

అన్నా హజారే తదితరుల ఆందోళన, అనేక అవినీతి ఆరోప ణల పూర్వరంగంలో మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం 2013లో లోక్ పాల్, లోకాయక్త చట్టాలను చేసింది. ఈ వ్యవస్థలను ఏర్పాటు

చేయాలన్న డిమాండ్ అంతకుముందు ఎప్పటి నుంచో ఉంది. కొత్త ప్రభుత్వం వచ్చిన ఐదేళ్ల తరువాత ఏర్పాటు చేశారు. లోక్‌పాల్ వ్యవస్థలో బీజేపీ అనుకూలురను నింపి దాన్ని ఒక ప్రహసన ప్రాయంగా మార్చారనే విమర్శలు ఉన్నాయి. అన్నా హజారే బృందంలోని కిరణ్ బేడి తరువాత బీజేపీగా అసలు రూపాన్ని వెల్లడించారు. అరవింద్ కేజ్రీవాల్ ఆమ్ ఆద్మీ పార్టీని ఏర్పాటు చేశారు. ప్రధాని అధ్యక్షతన లోక్‌పాల్ ఎంపిక కమిటీ ని ఏర్పాటుచేసిన తరువాత దాదాపు నాలుగేళ్లు నరేంద్రమోడీ ఆ కమిటీతో ఒక్కసారి కూడా సమావేశం కాలేదని 2018లో సమాచర హక్కుచట్టం కింద అడిగిన ప్రశ్నకు ప్రభు త్వం వెల్లడించిందని అంజలీ భరద్వాజ తెలిపారు. అంతకు ముందు లోక్‌పాల్‌ను ఏర్పాటు చేయకుంటే ఆందోళన చేస్తానని 2015లో అన్నా హజారే ప్రకటించారు. రెండేళ్ల తరువాత 2017లో మోడీని ప్రశ్నిస్తూ ఒక ప్రకటన చేశారు. 2018లో ఆరు రోజులు నిరసన దీక్ష చేపట్టారు. లోక్‌పాల్ అంశం సుప్రీం కోర్టు ముందుకు వచ్చినపుడు అది "ఒక సంక్లిష్టమైన ప్రక్రియ" అని కేంద్ర ప్రభుత్వం నివేదించింది. ప్రభుత్వ వివరణ ఏ మాత్రం సంతృప్తికరంగా లేదని సుప్రీం కోర్టు అన్నది. చివరకు 2019లో నియమించారు. ఎంపిక కమిటీ కూడా కేంద్రంలో ఎవరు అధికారంలో ఉంటే వారికి అనుకూలంగా ఉంటుంది. ప్రధాని అధ్యక్షులు, లోక్‌సభ స్పీకర్, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి లేదా ప్రతినిధి, ప్రతిపక్ష నేత, మరో ప్రముఖ న్యాయవాది, అంటే ముగ్గురు అధికార పార్టీ వారే ఉంటారు. లేదా మద్దతుదారులు ఉంటారని వేరే చెప్పనక్కర్లేదు. ప్రతిపక్ష నేత మల్లిఖార్జున ఖర్గేను కమిటీ ఆహ్వాని తుడిగా మాత్రమే పిలిచారు. ఎంపికలో తన పాత్ర ఉండదు కనుక సమావేశాన్ని బహిష్కరించారు. ఆ కమిటీ 2019 లోక్‌సభ ఎన్నికలకు ముందు మార్చిలో లోక్‌పాల్‌గా సుప్రీంకోర్టు జడ్జిగా పనిచేసిన పినాకి చంద్రను ఎంపిక చేశారు.

ఇక లోక్‌పాల్‌కు వచ్చిన ఫిర్యాదుల తీరు తెన్నులను చూస్తే 2019-20లో వచ్చిన 1,427లో 85 శాతం తమ పరిధిలోకి రావని, ఆరు శాతం సరైన పద్ధతిలో నింపలేదని తిరస్కరించారు. మిగిలిన వాటిని విచారించి నిగ్గు తేల్చిందేమిటో జనానికి తెలియదు. నియామకం జరిగి ఏడాది కూడా నిండకముందే లోక్‌పాల్ కమిటీ సభ్యుడిగా ఉన్న దిలీప్ భోంసలే 2020 జనవరి 6న 'వ్యక్తిగత కారణాల'తో రాజీనామా చేశారు. తరువాత వెల్లడైనదేమంటే భోంసలేకు ఆఫీసు లేదా అధికారిక పనిగానీ లేదంటూ మూడు లేఖలు రాసినా లోక్‌పాల్ చైర్మన్ పట్టించుకో లేదు. 'తొలి రోజు నుంచీ పనిచేయకపోవటాన్ని, మబ్బుగా ఉండటాన్ని చెబుతూనే ఉన్నాను. చైర్మన్ నా సూచనలను పూర్తిగా పక్కన పడేశారు. ఏ మాత్రం ఆసక్తి చూపలేదు, స్పందన ప్రతికూలంగా ఉంది' అని భోంసలే చెప్పినట్లు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ రాసింది. తన వద్దకు వచ్చిన ఫిర్యాదుల్లో ఎక్కువ భాగం నిరర్ధకమైనవని, వాటి గురించి మూడేళ్ల తన పదవీ కాలాన్ని గడిపితే సమయం వృధా తప్ప మరొకటి కాదని భోంసలే అన్నారు. పని చేయాల్సిన పద్దతి ఇది కాదు, పరిస్థితిని మెరుగు పరిచేందుకు చైర్మన్ ఎలాంటి చొరవ చూపలేదని అన్నారు. జస్టిస్ భోంసలే రాజీనామా తరువాత మరొక జడ్జి కరోనాతో మరణించారు. ఆ రెండు పోస్టులను ఇంత వరకు నింపలేదు. విచారణ, ప్రాసిక్యూషన్ డైరెక్టర్ల పోస్టులతోపాటు అవసరమైన ఇతర సిబ్బందిని కేంద్రం నియమించలేదు. కేటాయించిన నిధుల్లో మూడో వంతు ఖర్చు పెట్టలేదని 2021లో పార్లమెంటరీ కమిటీ తీవ్ర ఆందోళన వెల్లడించింది. గుజరాత్ సీఎంగా నరేంద్రమోడీ లోకాయక్త గురించి అనుసరించిన వైఖరిని చూస్తే లోక్‌పాల్ జోక్‌పాల్‌గా ఎందుకు మారిందో అర్థం చేసుకోవచ్చు. పదేండ్లపాటు గుజరాత్ లోకాయక్త నియామకం జరపలేదు లేదా వ్యతిరేకించారు. 2011లో నాటి గవర్నర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తితో సంప్రదించి జస్టిస్ ఆర్ఏ మెహతాను నియ మించగా తొలగించాలంటూ నరేంద్రమోడీ సుప్రీంకోర్టు తలుపు తట్టి విఫలమయ్యారు. నరేంద్రమోడీ తీరు తెన్నులతో ఆగ్రహించిన జస్టిస్ మెహతా బాధ్యతలను తీసుకొనేందుకు తిరస్కరించారు. లోకాయుక్తలు ప్రభుత్వ వ్యతిరేక వైఖరితో ఉండకూడదని మోడీ సర్కార్ వాదించింది. జస్టిస్ మెహతా తిరస్కరణ తరువాత ఏకంగా చట్టానికే సవరణలు తెచ్చారు. నియామక ప్రక్రియలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రమేయం లేకుండా చేశారు. మొత్తం ప్రభుత్వానికే అధికారాన్ని కట్టబెట్టారు. నరేంద్రమోడీ ప్రధానిగా అధికారానికి వచ్చిన తరువాత 2016లో లోక్‌పాల్, లోకాయక్త చట్టాన్ని నీరుగార్చారు. ఎవరైనా అక్రమంగా సంపా దించిన వారు తమ కుటుంబసభ్యుల పేర్లతో దాచుకుంటారు. సవరణల ప్రకారం అధికారుల పేరుతో ఉన్నవి తప్ప మిగతా కుటుంబ సభ్యుల వివరాలను వెల్లడించాల్సిన అవసరం లేకుం డా చేశారు. సమాచార హక్కు చట్టం ప్రకారం ఏ సమాచారం వెల్లడించాలో లేదో నిర్ణయించే అధికారం సమాచార కమిషన్‌కు ఇచ్చింది. ప్రస్తుత లోక్‌పాల్, కమిటీ సభ్యుల ఎంపిక ప్రక్రియ సమావేశాల మినిట్స్ ఇవ్వాలని అడిగిన ప్రశ్నకు ఇవ్వనవసరం లేదని 2021లో ప్రభుత్వం పేర్కొన్నది. కేంద్ర సమాచార కమిషనర్ల ప్రక్రియలోనూ మోడీ సర్కార్ ఇలాగే తిరస్కరించింది. ఆచరణ ఇలా ఉంటే మరోవైపు బహిరంగ వేదికల మీద చెబుతున్న సుభాషితాలను చూస్తే దగా దగా కుడి ఎడమల దగా దగా అన్న మహాకవి శ్రీశ్రీ గుర్తుకు రావటం లేదూ ! 'నేను తినను ఇతరులను తిననివ్వను' ఇదీ నరేంద్రమోడీ జనానికి చెప్పిన మాటలు. అంతే కాదు, జనం సొమ్ముకు చౌకీదారు (కాపలాదారు)

నని చెప్పుకున్నారు. ఇంకేముంది ! అనుచర గణమంతా తమ పేర్ల చివర చౌకీదార్ అని తగిలించుకున్నారు. అందరూ జేజేలు పలికారు. అవినీతిని అంతం చేసే కొత్త దేవుడు దిగివచ్చారని ప్రచారం చేశారు. ఇంతకాలం తిన్న సొమ్మంతా అణాపైసలతో కక్కిస్తారని అనుకున్నారు. ఇప్పు డెవరూ చౌకీదార్ అని చెప్పు కోవటం లేదు. లోక్‌పాల్‌కు ఫిర్యాదులు ఎందుకు రావటం లేదంటే తమ పాలనలో అవినీతి లేన పుడు ఎలా వస్తాయంటూ బీజేపీ నేతలు ఎదురుదాడికి దిగుతున్నారు ! మహిమ కలి కాలానిది అందామా నరేంద్రమోడీది అందామా ? అవినీతి గురించి అందరికీ తెలిసినందున ఎవరికి తోచింది వారు అనుకోవచ్చు. పైకి అంటే పంచాయితీ గానీ లోలోపల అనుకు నేందుకు ఇంకా స్వేచ్ఛ ఉంది. మహా భారతంలో ధర్మపీఠం ఎక్కిన శకుని కౌరవులను నాశనం చేయాలనే అంత రంగాన్ని వెల్లడిస్తాడు. మన పూర్వీకుల దగ్గర ఆ పాత పీఠాలు ఎక్కడైనా ఉన్నా లేదా దేశ భక్తులైన మన సంస్కృత పండితులు ఆ పరిజ్ఞానాన్ని వెలికితీసి వాటిని రూపొందించి పుణ్యం కట్టు కుంటే మన పాలకులను వాటి మీద ఎక్కించి అంతరంగాలను బయట పెట్టించవచ్చు, అది తప్ప మరొక మార్గం లేదు, దేశం కోసం వారా పని చేస్తారా ? ❑

# గాంధీయిజం.. కమ్యూనిజం

(6వ పేజీ తరువాయి)

కొట్టుకోవడాన్ని ఎవరు వాంఛిస్తారు? పెట్టుబడిదారులు, భూస్వాములు దౌర్జన్యానికి దిగే అవకాశం, సాహసం లేకుండా చేయాలనేదే మా ఉద్దేశ్యం. ఈ రోజున ఉన్న పరిస్థితుల్లో భారత దేశం సోషలిజం కోరు తున్న పరిస్థితుల్లో పెట్టుబడిదారులు, భూస్వాముల అధికారం పోవాలని ప్రజలే ముందుకు వస్తున్నప్పు డు ధనిక వర్గాలు దౌర్జన్యానికి పూనుకోవడం కష్టం. వారు వెనుకంజ వేయవచ్చు. వారు దౌర్జన్యం చేయనప్పుడు ప్రతి దౌర్జన్యం చేయాల్సిన అవసరం లేకుండాపోతుంది. అలా కాకుండా ఎక్కువ మంది ప్రజలు దోపిడీ విధానం పోవాలని వాంఛించినప్పుడు అలా కాదు దౌర్జన్యం చేసి, దోపిడీ విధానాన్ని కాపాడుకుంటామంటే దానికి ఆ ప్రజలే సమాధానం చెపుతారు. వారు ఎన్ని దౌర్జన్యాలు చేసినా ప్రజలు అలాగే పడివుంటారని మేము చెప్పడం లేదు. దాన్ని మరో కొసకు లాగి మేము హింసను కోరుతున్నామని చెప్పడం అబద్దా లు చెప్పడమే అవుతుంది. టెండూల్కర్ రాసిన "గాంధీజీ చరిత్ర లో" గత 20 ఏళ్లుగా జరిపిన పోరాటం అహింసా సిద్ధాంతా లను నమ్మి చేసిన పోరాటం కాదు. మరో మార్గంలేక బల హీనంగా వున్న ప్రజాశక్తులు సాగించిన 'సాత్విక నిరోధం మాత్రమే' అని గాంధీ రాసిన లేఖను పేర్కొన్నారు. ఈ విషయం ఇక్కడ మీకు గుర్తుకు తీసుకువస్తున్నాను. గాంధీ దేశానికి ఏమీ చేయలేదని, ఆయన ప్రవచనాల నుంచి నేర్చుకొని ఆచరిం చేదేమీ లేదని మేము అనుకోవడం లేదని నేను వేరే చెప్పనవ సరం లేదు. గాంధీజీ ధనికవర్గాల కోసం పని చేస్తున్నాడని మేము ఇదివరకు బండగా చెబుతూ వచ్చాం. ఇదీ తప్పు. కాని ఆయన పెట్టిన పరిమితుల వల్ల అవలంభించిన కొన్ని పద్ధతుల వల్ల ఆయన అనుకున్నా, అనుకోకపోయినా ధనికవర్గాల ప్రాబ ల్యం, పెత్తనం అలాగే ఉండిపోవడం జరిగింది. సమానత్వమ నేది గాంధీ సిద్ధాంతాల్లో కీలకం, దక్షిణాఫ్రికాలో తెల్లవారితో నీగ్రోలకు సమానత్వం, చంపారన్లో రైతుల సమానత్వం కోసం, విదేశాలలో భారతదేశం సమానత్వం కోసం, అన్ని కులాల వారి సమానత్వం కోసం, హిందూ ముస్లిం సమానత్వం కోసం, ఆర్థిక అసమానతలు తొలగించి సమానత్వం సాధించడం కోసం, మొత్తం ఆయన జీవితం అంతా సమానత్వం కోసం పోరాడారు. సమానత్వమనేది ఆయ న నడిపిన ఉద్యమాలన్నింటికీ కీలకం, బీజం. ఈ సమానత్వం సాధించాలనే కర్తవ్యం ఇంకా మిగిలి వుంది. దాన్ని సాధించాలి. అలా చేసినప్పుడే గాంధీజీ ఆశయాల ను నెరవేర్చిన వారమౌతాము. పూర్తి సమానత్వం సాధించటం మాట అటుంచి హెచ్చు తగ్గులు సాధ్యమైనంత వరకైనా తగ్గించా లి. భూమిపై, ఇతర ఆదాయాలపై సీలింగ్ విధించటం ద్వారా గాంధీజీ సిద్ధాంతాన్ని కొద్దిగానైనా ఆచరించినట్లవుతుంది. ఇది రెండవ కర్తవ్యం. గాంధీజీ శాంతి కావాలన్నారు. ప్రపంచంలో కొన్ని దేశాలు, ముఖ్యంగా అమెరికా, బ్రిటన్ సామ్రాజ్యవాదులు యుద్ధాన్ని రెచ్చగొడుతున్నారు. వారిని వ్యతిరేకించి ప్రపంచ శాంతిని కాపాడటానికి కృషి చేయడం, హిందూ-ముస్లిం ఐక్యత, కులతత్వాలను తొలగించడం కూడా గాంధీజీ ఆశయా లను అమలుపరచడానికి చేసే కృషియే. ఇలా చేసిననాడే ప్రజల సౌభాగ్యం, దేశ సౌభాగ్యం, మానవ కల్యాణం సాధ్యమౌతాయి.

చైనాలో సన్ యట్ సేన్‌ను ఆ దేశ కమ్యూనిస్టు పార్టీ ఎంతో గౌరవిస్తుంది. కమ్యూనిస్టు పార్టీ ఆయన అభిప్రాయాలన్నింటితో ఏకీభవించకపోయినా, ఆయన దేశాభివృద్ధికి ఒకానొక దశలో శాయశక్తులా కృషి చేశారు. ఆయనను కమ్యూనిస్టు పార్టీ తల మానికంగా ఎంచుతుంది. ఎన్ని లోపాలున్నా, పరిమితులున్నా అటువంటి వారిని గౌరవించి వారి ఆశయాలను ముందుకు తీసుకుపోవడం సత్సంప్రదాయం. అలాగే మహాత్మాగాంధీని, వారి సేవను గుర్తించి మనం గౌరవించాలి. ❑

**("సాహితీ మిత్రులు" ప్రచురించిన "నేనెరిగిన సుందరయ్య" - డా. ఏ.పి విఠల్ పుస్తకం నుండి సేకరణ)**

# దేశానికి రానున్నవి చీకటి రోజులు

తెలుగు అనువాదం : ఎన్.వేణుగోపాల్



**జస్టిస్ మార్కండేయ కట్జూ**
**సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మాజీ అధ్యక్షులు**

> **దేశంలో ప్రస్తుతం ఆర్థిక స్థితి మరింత దిగజారింది. జాతీయాదాయ పెరుగుదల రేటు ఐదు శాతానికి పడిపోయింది. ఎన్నో రంగాలలో పతనం కనబడుతున్నది. మున్నెన్నడూ లేనంతగా నిరుద్యోగం పెరుగుతున్నది. ప్రస్తుత పాలనా పద్ధతుల లోపల పరిష్కరించడం అసాధ్యమైన ఈ నిజమైన సమస్యల నుంచి, అవి ఇంకా దిగజారుతుండడం నుంచి ప్రజల దృష్టిని మళ్లించాలంటే ఏదో ఒక బలి పశువును కనిపెట్టాలి. సరిగ్గా హిట్లర్ అట్లాగే యూదులు అనే బలి పశువును కనిపెట్టినట్టుగా. భారతదేశంలో అటువంటి బలి పశువు ముస్లింలు. అందువల్ల ముస్లింల మీద అత్యాచారాలు ఇంకా పెరుగుతాయనీ, కొద్దిగా తక్కువగా క్రైస్తవుల మీద పెరుగుతాయనీ నాకు భయం కలుగుతున్నది.**

నాజీ జర్మనీకీ భాజపా భారత్‌కూ పోలికలు చూపుతూ సరిగ్గా జర్మనీలో జరిగినట్టుగానే, అసలు సమస్యల నుంచి దృష్టి మళ్లించడానికి మతోన్మాదాన్ని రెచ్చ గొడుతున్నారని అంటున్నారు జస్టిస్ మార్కండేయ కట్జూ. భారతదేశంలో జరుగుతున్న సంగతులు నాకు నాజీల కాలంలో జర్మనీలో జరిగిన సంగతులను గుర్తుకు తెస్తున్నాయి. జనవరి 1933లో హిట్లర్ అధికారానికి వచ్చిన తర్వాత యావత్తు జర్మనీ ఉన్మాదంలో పడిపోయింది. ఎక్కడ చూస్తే అక్కడ జనం 'హెయిల్ హిట్లర్' అని 'సీగ్ హెయిల్' అని 'యుడెన్ వెరెక్కె' అనీ అరవడం, మత్తెక్కిన మరబొమ్మల్లాగ ఆ పిచ్చివాణ్ణి ప్రశంసించడం చేశారు. మీకు కావాలంటే ఆ దృశ్యాలన్నీ యూ ట్యూబ్ మీద చూడవచ్చు. జర్మన్లు ఎంత ఉన్నతమైన సంస్కృతీపరులంటే వారు మాక్స్ ప్లాంక్, ఐన్‌స్టీన్ వంటి గొప్ప శాస్త్రవేత్తలను, గూథె, షిల్లర్ వంటి మహా రచయితలను, హీనె వంటి మహా కవులను, మొజార్ట్, బాక్, బీథోవెన్ వంటి మహా సంగీత విద్వాంసులను, మార్టిన్ లూథర్ వంటి గొప్ప సంస్కర్తలను, కాంట్, నీషే, హెగెల్, మార్క్స్ వంటి గొప్ప తత్వవేత్తలను, లీబ్నిట్జ్, గాస్, రీమన్ వంటి గొప్ప గణిత శాస్త్రజ్ఞులను, ఫ్రెడరిక్ ది గ్రేట్, బిస్మార్క్ వంటి గొప్ప రాజనీతిజ్ఞులను కన్న నేల అది. నేను కలిసిన ప్రతి ఒక్క జర్మన్ కూడ ఎంతో ఉత్తములు. అయినప్పటికీ, రంగస్థలం మీదికి హిట్లర్ వచ్చాక, జర్మన్లే ఉత్తమ పాలక జాతి అని, వారి సమస్యలన్నిటికీ బాధ్యులు యూదులే అని ప్రకటించాక, జర్మన్లు ఆ పిచ్చి ప్రేలాపనలను నమ్మడం మొదలుపెట్టారు. యూదుల మీద జరిగిన అత్యాచారాలకు, చివరికి జరిగిన మహా మారణకాండకు వారు ఎదురు చెప్పలేదు. బహుశా దాన్ని సమర్థించి ఉంటారు కూడా. అలా ఎలా జరిగింది ? కచ్చితంగా జర్మన్ ప్రజలందరూ మూర్ఖులేమీ కాదు. అంతరాంతరాల్లో దుర్మార్గులేమీ కాదు. అన్ని దేశాల, అన్ని మతాల, అన్ని నరజాతుల, వగైరా అన్ని సమూహాల ప్రజల్లో 99 శాతం మంచివాళ్లేనని నా ప్రగాఢ నమ్మకం. మరి అరవై లక్షల మంది యూదులను గ్యాస్ చాంబర్లలోకి పంపి మూకుమ్మడిగా హత్య చేయడానికి జర్మన్లకు చేతులెలా వచ్చాయి ?

నా ఉద్దేశంలో దానికి కారణమేమంటే, మహా శక్తిమంతమైన ఆధునిక ప్రచారసరళి అత్యంత సంస్కృతీపరుల, ఆలోచనాపరుల మెదళ్లలోను విషం నింపగలదు. ఎక్కువ మంది జర్మన్ల విషయంలో జరిగిందదే. మొదటి ప్రపంచయుద్ధంలో ఓటమి తర్వాత జర్మన్లలో నిండిన నిరాశా నిస్పృహలు, 1929 మహా సంక్షోభం తర్వాత పెద్ద ఎత్తున వ్యాపించిన నిరుద్యోగం, ధరల పెరుగుదల, ఆర్థిక సంక్షోభం హిట్లర్ వంటి దుర్మార్గుడి విష ప్రచారానికి సులభంగా దొరికిన ఆయుధాలు. ఆ విష ప్రచారాన్ని జర్మన్లు మొత్తానికి అక్షరం వదలకుండా మింగి తమ మెదళ్లలో నింపుకున్నారు.

ఇవాళ అత్యధిక భారతీయుల విషయంలో అదే జరుగుతున్నది. అభివృద్ధి నిరోధక, హిందూ నయా ఫాసిస్టు పార్టీ అయిన భాజపా 2014లో అధికారానికి వచ్చినప్పటి నుంచి భారతీయ మైనారిటీలకు (ప్రత్యేకంగా ముస్లింలకు) వ్యతిరేకంగా భారీ మతోన్మాద ప్రచారానికి తెరలేపింది. ఆవులను చంపుతున్నారనీ, హిందూ బాలికలకు వల వేస్తున్నారనీ, వగైరా విద్వేషం నిండిన ఉపన్యాసాలతో చాలామంది హిందువుల మనసులను విష పూరితం చేశారు. రామాలయం నిర్మించాలనే ప్రకటనలూ, ముస్లింలను కొట్టి చంపడమూ కొన్నేళ్లుగా సర్వసాధారణమయ్యాయి. పాకి

స్తాన్‌లోని బాలాకోట్ మీద వైమానిక దాడి, సానుకూలమైన భారత ప్రచార సాధనాల ద్వారా యుద్ధోన్మాదాన్ని రెచ్చగొట్టడం ఈ దండయాత్రలో భాగమే. ఈ ప్రయత్నమంతా ఇటీవలి పార్ల మెంటరీ ఎన్నికలలో భాజపాకి కనీవినీ ఎరగని ఘన విజయం చేకూర్చడం ద్వారా అనుకున్న ఫలితాలను సాధించింది. భారతదేశంలోని ఏ ఒక్క నిజమైన సమస్యనూ పరిష్కరించలేని గారడీ చర్యగా అధికరణం 370 రద్దు, దుష్ట పాకిస్తాన్ మీద సాధించిన మహా విజయంగా, ఉత్సవ సందర్భంగా చాలా మంది హిందువులను మరింత ఉన్మాదులుగా మార్చింది. అమెరికాలోని హ్యూస్టన్‌లో 'హౌడీ మోడీ' ప్రదర్శన దీనికి ఒక సాక్ష్యం.

కనీ వినీ ఎరగని స్థాయి నిరుద్యోగం (స్వయంగా భారత ప్రభుత్వ సంస్థ అయిన నేషనల్ సాంపిల్ సర్వే వెల్లడించింది), దారుణమైన శిశు పోషకాహార లోపం (దేశంలోని ప్రతి ఇద్దరు పిల్లల్లో ఒకరు పోషకాహార లోపం బారిన పడి ఉన్నారు), అతి పెద్ద సంఖ్యలో రైతుల ఆత్మహత్యలు (మూడు లక్షలకు పైగా), అశేష ప్రజానీకానికి దాదాపుగా అందని సరైన ఆరోగ్య సౌక ర్యాలు, నాణ్యమైన విద్యా సౌకర్యాలు, ధనికులకూ పేదలకూ మధ్య విపరీతంగా పెరిగిపోతున్న అంతరం (దేశంలోని 135 కోట్ల జనాభాలో సగం మంది దగ్గర ఉన్న సంపద కన్నా ఎక్కువ సంపద ఏడుగురు భారతీయుల దగ్గరే ఉంది) వంటి దేశంలోని నిజమైన సమస్యలలో ఏ ఒక్కటీ ఇటీవలి లోకసభ ఎన్నికలలో చర్చకే రాలేదు.

లౌకిక వాదమనేది ఉత్తర అమెరికా, యూరప్‌ల వంటి పారి శ్రామిక సమాజాల లక్షణం. అది ఆసియా దేశాలలో అత్యధికం గా ఉన్న భూస్వామ్య, అర్ధ భూస్వామ్య సమాజాల లక్షణం కాదు. రాజ్యాంగంలో ఆ మాట ప్రస్తావించినంత మాత్రాన దేశం లౌకిక దేశం అయిపోదు. భారతదేశం ఇంకా అర్ధ భూస్వామ్యమేననేది ఈ సమాజంలో విస్తృతంగా ఉన్న కులతత్వం, మతతత్వం రుజు వు చేస్తున్నాయి. భారతీయులలో అత్యధికులు లోలోతుల నుంచి మత విశ్వాసాలు కలవాళ్లు. భారతీయులలో దాదాపు 80 శాతం హిందువులు గనుక వారు చాలా సులభంగా మతోన్మాద ప్రచారా నికి గురికాగలరు. దేశంలో హిందువులలోనూ ముస్లింలలోనూ అత్యధికులు మతతత్వానికి గురైనవాళ్లేనని నా అభిప్రాయం. నా చిన్నతనంలో నా హిందూ బంధువులూ మిత్రులూ చాలా మంది ముస్లింల మీద విషం కక్కుతుండడం నేను చూశాను. కాకపోతే వాళ్లు అలా మాట్లాడుతున్నప్పుడు పక్కన ముస్లిం లేకుండా చూసే జాగ్రత్త తీసుకునేవారు. ఇవాళ ఒక ముస్లింను కొట్టి చంపేశా రంటే చాలా మంది హిందువులకు అది పట్టడమే లేదు. బహుశా కొందరు సంతోషిస్తున్నారేమో కూడ. ఒక తీవ్రవాది తగ్గాడని అనుకుంటున్నారేమో !

మైనారిటీల పట్ల, ప్రత్యేకించి ముస్లింల పట్ల విద్వేషం రూపంలో మతోన్మాదం చాలా మంది హిందువులలో పైకి కనబడకుండా ఎప్పుడూ ఉంటూనే ఉంది. ఎక్కడో ఒకచోట నిప్పురవ్వ పడితే పేలిపోయే మందుపాతర లాగ అది వేచి చూస్తూ ఉండింది. 2014 నుంచి 2019 వరకూ ఆ మతోన్మాద మంటలను భారతీయ జనతా పార్టీ ఎగసన దోస్తూ వచ్చింది. ఈ పార్టీ మీద ఆధిపత్యం వహిస్తున్నది భయంకరమైన ముస్లిం వ్యతిరేక, క్రైస్తవ వ్యతిరేక మతోన్మాద సంస్థ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్.

ఇప్పుడిక భారతీయ జనతా పార్టీ, దాని నాయకుడు మోడీ అసాధారణ విజయం సాధించారు గనుక, ప్రజలవైపు నుంచి తమ సమస్యలు పరిష్కరించే పాలన ఇమ్మని ఒత్తిడి పెరుగు తుంది. అంటే ఉద్యోగాలు కల్పించమనీ, రైతుల నిస్సహాయ స్థితి ని మెరుగుపరచమనీ, శిశు పౌష్టికాహార లోపాన్ని తగ్గించమనీ, మంచి ఆరోగ్య సేవలు అందించమనీ, నాణ్యమైన విద్య అందిం చమనీ, వగైరా ఆకాంక్షలు పెరుగుతాయి. కాని, ఈ పాలకులకు ఆ పరిష్కారాలు ఎలా సాధించాలో తెలియదు. అంతే కాదు, పరిష్కరించకపోవడం మాత్రమే కాదు, దేశంలో ప్రస్తుతం ఆర్థిక స్థితి మరింతగా దిగజారింది. జాతీయాదాయ పెరుగుదల రేటు ఒక్కసారిగా 5 శాతానికి పడిపోయింది. వాహనాల తయారీ రంగంతో సహా పారిశ్రామిక ఉత్పత్తులలో, రియల్ ఎస్టేట్‌లో, విద్యుచ్ఛక్తి రంగంలో, అటువంటి మరెన్నో రంగాలలో పతనం కనబడుతున్నది. మున్నెన్నడూ లేనంత నిరుద్యోగం తలెత్తడం మాత్రమే కాదు, అది ఇంకా పెరుగుతున్నది. ప్రస్తుత పాలనా పద్ధతుల లోపల పరిష్కరించడం అసాధ్యమైన ఈ నిజమైన సమ స్యల నుంచి, అవి ఇంకా దిగజారుతుండడం నుంచి ప్రజల దృష్టి ని మళ్లించాలంటే ఏదో ఒక బలిపశువును కనిపెట్టాలి. సరిగ్గా హిట్లర్ అట్లాగే యూదులు అనే బలి పశువును కని పెట్టినట్టుగా. భారతదేశంలో అటువంటి బలి పశువు ముస్లింలు. అందువల్ల ముస్లింల మీద అత్యాచారాలు ఇంకా పెరుగుతాయనీ, కొద్దిగా తక్కువగా క్రైస్తవుల మీద కూడ పెరుగుతాయనీ నాకు భయం కలుగుతున్నది.

సరిగ్గా నాజీ పాలనా కాలంలో జర్మనీలో విజ్ఞానశాస్త్రాన్ని ఎట్లా జాత్యహంకార పూరితమైన అర్థరహిత ప్రేలాపనగా మార్చా రో, భారతదేశంలో కూడ 2014 తర్వాత విజ్ఞానశాస్త్రాన్ని అట్లాగే మార్చారు. నాజీ జర్మనీలో చరిత్రను ఎట్లా వక్రీకరించారో, 2014 తర్వాత భారతదేశంలో అట్లాగే వక్రీకరిస్తున్నారు. సరిగ్గా జర్మన్ ప్రచార సాధనాల మీద గోబెల్స్ ఆధిపత్యం చలాయించి నట్టు, భారత ప్రచార సాధనాలు వంగిపోయి, లొంగిపోయి, 'సర్వం సహా చక్రవర్తి'కి ప్రణామాలు పలుకుతున్నాయి. ❑

# ఆధ్యాత్మిక ఫాసిజానికి ప్రతినిధులే ప్రవచనకారులు



**అశోక్ కుంబము**

> **గరికపాటి మాటలు వింటుంటే చీము నెత్తురువున్న ఎవరికైనా రక్తం మరుగుతుంది. కానీ వనజ నిలకడగా, నిబ్బరంగా చెప్పిన తీరు ఎందరినో ఆలోచింపచేస్తుంది. ధైర్యాన్ని ఇస్తుంది. అయితే ఇలాంటి ప్రవచనకారులను నిర్దిష్టంగా ఎండ గడుతూనే వీళ్ళందరికి మూలుగయిన బ్రాహ్మణీయ హిందూత్వ ఫాసిజాన్ని అన్ని రూపాలలో ఎదుర్కోవాలి. లేకపోతే ఆధ్యాత్మిక ఫాసిజం మన నడివీధుల్లో, నట్టింట్లో, నెట్టింట్లో మన అనుమతి లేకుండానే ఊరేగుతుంది.**

మొన్నటి వరకు 'చాదస్తపు మాటలు' అని ఈసడించుకున్న వాటినే ఇప్పుడు జనాలు చాటంత చెవులేసుకొని వింటున్నారు. జీవిత చరమాంకంలో కాలక్షేపం కోసం వినే ప్రవచనాలు ఇప్పుడు "జీవిత సారం" తెలుసుకోవడం కోసం వింటున్నామని యూట్యూబ్, ఇతర సోషల్ మీడియా మీదికి ఎగబడుతున్నారు. 'మాకు భలే గిరాకీ పెరిగిందని' స్వయంగా ప్రవచనకర్తలే కాసింత గర్వంగా చెబుతున్నారు. వాళ్ళ వెలుగుబాటు రాజకీయ శూన్యంలో జరగటం లేదని, గత ఎనిమిదేండ్లుగా హిందూ రాష్ట్ర స్థాపనకు పునాదులు వేసుకుంటున్న సంఘ్ పరివార్ రాజకీయ నీడలో జరుగుతుందని ప్రవచనకారులు చెప్పకనే చెబుతున్నారు.

కొత్త కాషాయ గాలి తెలుగు నేల మీద వీస్తుంటే ప్రవచన కారుల స్వరం పెరుగుతోంది. వాళ్ళను ఫాలో అయ్యే మంద ఎక్కువవుతావుంటే వారి మాట మదమెక్కుతుంది. వేల ఏండ్లుగా సమాజాన్ని అణిచివేయడానికి వాడుకున్న భావజాలాన్ని 'కొత్త సీసాలో పాత మత్తు'గా ఆధ్యాత్మికత పేరిట సామాజిక వేదికల మీది నుండి ప్రవచిస్తున్నారు. ఆశ్చర్యంగా ఈ కొత్త వాతావరణం లో అణిచివేత, దోపిడీ, పీడనకు గురైన వర్గాలు, కులాలు, లింగాలు ఈ ప్రవచనకారులకు భజనపరులుగా మారుతున్నారు. అయితే కనీసం కొందరైనా ఆలోచనాపరులు, సామాజిక కార్య కర్తలు ప్రవచనకారుల ముసుగు తొలిగించే ప్రయత్నం చేస్తు న్నారు. ప్రవచనాల పేరుతో కొనసాగిస్తున్న హింసను ఎండగడుతున్నారు.

అయితే ఈ ప్రవచనకారుల గురించి చర్చ వచ్చినప్పుడల్లా ఒక పెద్ద 'మనోభావాల బ్యాచ్' ట్రోలింగ్‌కు సిద్ధమయిపోతోంది. ఈ బ్యాచ్‌కు విషయం అర్థం కావాల్సిన పనిలేదు. అసలు ఆలోచించాల్సిన పని కూడా లేదు. ఎందుకంటే ఆ పని వేరే వాళ్లకు అప్పగిస్తారు. వీళ్లు ప్రతి చిన్న దానికి మనస్సును గాయ పరుచుకొని గాయి గాయి చేస్తుంటారు. మరో 'అమాయకపు / అయోమయపు బ్యాచ్' 'వాళ్ళకు చేతనైన పనేదో వాళ్ళు చేసు కుంటున్నారు. వాళ్ల మాటలు మనకు నచ్చకపోతే వినకుండా వుంటే సరిపోతుంది. వాళ్ళను వినడం దేనికి?, విమర్శించడం దేనికి?' అని సుద్దులు చెబుతుంటారు. ఇది కేవలం వ్యక్తులుగా వినడం, వినకపోవడం గురించి కాదు. ఎందుకంటే ప్రవచన కారులు తమ ఇంట్లో కూర్చోని గునుక్కోవడం లేదు. పబ్లిక్ స్పేస్‌లో కూర్చొని 'మొత్తం సమాజాన్ని 'ఉద్ధరించడం' కోసమే ఆధ్యాత్మిక బోధన చేస్తున్నామని' చెబుతున్నారు. చెప్పేవాళ్ళు తమకు తాముగా ఏదైనా బాధ్యతను ఆపాదించుకోవచ్చు. కానీ, వినేవాళ్ళకు హక్కులుంటాయి. తమకు ఇష్టమొచ్చింది చెప్పి 'ఇదే పరమ సత్యం' అని చెప్పుకుంటూ పోవడం ఈ ఆధునిక కాలంలో ఒప్పుకునే విషయం కాదు. పైన చెప్పిన రెండు బ్యాచ్ లతోపాటుగా 'గురువు గారి బ్యాచ్' అనే మూడో బ్యాచ్ కూడా ఒకటి ఉంది. 'ప్రవచనకారులు భాషా, సాహిత్య రంగాలలో ఉద్దండ పండితులు. అలాంటి గురువులు చెప్పేది విని అర్థం చేసుకునే ప్రయత్నం చెయ్యాలే తప్ప వాళ్ళను అపార్థం చేసు కోవద్దు, తప్పుపట్టొద్దు. ఎందుకంటే వాళ్ళను విమర్శించే స్థాయి మనకు లేదు.' ఇలాంటి వాళ్ళు తమ మెదడును ఆ గురువుల పాదాల దగ్గర పెట్టి మాట్లాడుతుంటారు.

అయితే వీళ్ళకు అర్థం కాని విషయం ఏమంటే అసలు ఆ పండితుల జ్ఞానం దేనికి సంబంధించింది? ఆ జ్ఞానాన్ని ప్రసరిం చి వాళ్ళు సమాజాన్ని ఎటు వైపునకు తీసుకుపోవాలని అనుకుం టున్నారు ? అసలు ఎవ్వరూ ఈ పండితులు? కట్టకట్టుకొని ప్రవచనకర్తలు అందరూ బ్రాహ్మణులే ఎందుకయ్యారు? వాళ్ళకే ఈ సమాజాన్ని 'ఉద్ధరించాలని' ఎందుకు అనిపిస్తుంది? తరత

రాల అన్యాయాలకు పుక్కిటి పురాణాల పేరిట ఎందుకు మద్ధతును కూడగడుతున్నారు? వాళ్ళు చెప్పే ప్రవచనాలలో ఏ సాహిత్యమైనా వుండనీ, అది ఎవరి ఆధిపత్యం కోసం పని చేస్తుందో చూడాలి. ప్రవచనకారులు మొత్తంగా ఏ విధంగా బ్రాహ్మణీయ హిందూత్వ భావజాలాన్నీ పునరుద్ధరించే పని చేస్తున్నారో చూడాలి. మన సమాజంలోని అన్ని రకాల అణిచి వేతలకు, హింసలకు కావాల్సిన భావజాల, సాంస్కృతిక పునాదిని ఎట్లా ఏర్పాటు చేస్తున్నారో చూడాలి.

ప్రవచనకారులు చేస్తున్న పని మొత్తం పెను ప్రమాదమై ముంచుకొస్తున్న హిందూత్వ ఫాసిజానికి భావజాలరంగాన్ని సిద్ధం చేయడం. మతం మత్తును సుతిమెత్తగా నరనరానికి ఎక్కించడం. సాంప్రదాయం పేరిట కట్టుబాట్లతో మనిషి స్వేచ్ఛను, సమాజ పురోగతిని అడ్డుకోవడం. అయితే ఆధునికత పేరిట, అభివృద్ధి పేరిట జరుగుతున్న విధ్వంసాన్ని ఎవరైనా ప్రశ్నించవచ్చు. కానీ ప్రశ్న హేతుబద్ధమై, శాస్త్రీయమైనదై వుండాలి. ఆ ప్రశ్న సమన్యాయం, సమతా భావనలకు దారులు వేసేదిగా ఉండాలి. అంతేకాని ఆధునిక భావనలను, నవ జీవన వ్యవహారాలను ఎద్దేవా చేస్తూ కట్టుబాట్ల కంచె వెయ్యొద్దు. 'వేదాల్లోనే అన్నీ వున్నాయిష' అని, అదే సత్యమని దబాయిస్తే సరిపోదు. ప్రవచనకారులు రూపంలో ఒక్కో విధంగా కనిపిస్తున్న ప్పటికి, సారంలో అంతా ఆధ్యాత్మిక ఫాసిస్టులే! ఇప్పుడు సాధా రణ భాషలో "ఫాసిజం" అనేది ఒక తిట్టు పదంగా మారింది. కానీ అది ఒక రాజకీయ సిద్ధాంతం, ఆచరణ. ప్రపంచాన్ని ఏకదృష్టితో చూసే రాజకీయం. ఫాసిస్టులు తాము ఇతరులకంటే (అంటే తమలో భాగం కాని, తమ భావాలను అంగీకరించని, తామ శతృవు అనుకునే వారితో పోలివుండే ఎవరైనా) గొప్పవాళ్ళమని నమ్మేవాళ్లు. అంతేకాదు, ఆ భావనతో హింసను కొనసాగించే వాళ్ళు. ఇతర భావాలను ధ్వంసం చేసేవాళ్లు. ఆధిపత్యాన్ని నిర్మాణం చేసి దానిని నిత్య జీవితంలో భాగం చేసేవాళ్లు. అటువంటి రాజకీయాలతో జాతీయవాదం పేరిట ఇటలీలో అన్ని ఉదారవాద, ప్రజాస్వామిక సంస్థలను బుల్డోజ్



చేసి నెత్తుటి ఏరులు పారించిన "నేషనల్ ఫాసిస్టు పార్టీ" నాయకత్వాన్ని కలిసి వాళ్ళ సలహా, ప్రోత్సాహంతో భారతదేశం లో అతి-జాతీయ వాదాన్ని (ultra-nationalism) కలగన్నది సంఘ్ పరివార్ శక్తులు. ఇటాలియన్ ఫాసిస్టులు గర్వంగా తమ సిద్ధాంతాన్ని, అస్తిత్వాన్ని ప్రకటించుకున్నారు. కానీ చివరికి ఆ ఫాసిస్టులను ప్రజలు నడిరోడ్డు మీద ఉరికించారు. మిలాన్ చౌరస్తాలో ఫాసిస్టుల శవాలను తలకిందులుగా వేలాడగట్టి చెప్పు దెబ్బలు కొట్టారు. చరిత్రలో ఫాసిజం ఓడిపోయింది కాబట్టే హిందూత్వ శక్తులకు ఫాసిస్టు పోలిక రుచించడం లేదు. కానీ తాము నడుస్తున్నది ఫాసిస్టు దారిలోనే! ఆ దారికి ఆధ్యాత్మిక ఫాసిజం ఒక కాగడాలా పనిచేస్తుంది.

"ఆధ్యాత్మిక ఫాసిజం" (Spiritual Fascism) అనేది నేటి భావన కాదు. దానిని ఫాసిస్టు సిద్ధాంతకర్త జూలియస్ ఎవోలా ప్రతిపాదించాడు. అతను ఆధారాలతో కూడిన చరిత్రకు వ్యతి రేకి. దాని స్థానంలో పురాణాల మీద ఆధారపడే ఆది భౌతిక చరిత్రను (metaphysics of history) ప్రపోజ్ చేశాడు. అది హిందూ పురాణాలలో ఉండే యుగ చరిత్రతో పోలి వుంటుంది. పురాణాలనే చరిత్ర చెయ్యడం, దాని ద్వారానే మంచి, చెడులను నిర్మాణం చెయ్యడం దాని ముఖ్య ఉద్దేశం. అంతేకాదు, ఎవరు యుగపురుషుడో (ఎవోలా పితృస్వామ్యవాదని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు!) ఎవరు 'ప్రజా కంఠకులో' ఆ పురాణకర్తలే నిర్ణయిస్తారు. వారి కట్టు కథల ఆధారంగానే నీతి, నిజాయితీ,

**ఫాసిస్టు నాయకుడు ముస్సోలిని క్రైస్తవ మతానికి దగ్గరవ్వడాన్ని ఎవోలా సహించలేదు. ఎలాగైనా దూరం చేయడానికి ప్రత్యేక పూజలు చేశాడు. తనకు ఉన్నాయని అనుకున్న ఇంద్రజాల 'శక్తులను' ప్రయోగించాడు. వీటి మూలంగానే ఎవోలాను ఫాసిస్టు నాయకత్వం కొంత దూరంగా వుంచింది. కానీ అతని మత్తు, మాయ సిద్ధాంతాలను విమర్శించలేదు. ఎవోలా క్రిస్టియా నిటీని ముందు శత్రువుగా భావించినప్పటికి తర్వాత కాలంలో కథాలిసిజం మీద తన విమర్శ తగ్గించి, ప్రొటెస్టన్ల మీద దాడి మొదలు పెట్టాడు. చివరికి కాథలిక్స్ కూడా ఎవోలాను ఎత్తిపట్టారు.**

సత్యం, ధర్మం నిర్ణయమవుతాయి. ఎవోలా ప్రకారం ప్రపంచం లో ఎన్నో రహస్య సత్యాలు (mysterious truths) దాగున్నాయి. అయితే వాటిని సృష్టించిన వాడు మాత్రమే చూడగలుగుతాడు. అర్థం చేసుకోగలుగుతాడు. అంటే ప్రపంచం అనేది ఒక రహస్య జ్ఞాన నిధి అది కొందరికే అర్థమవుతుంది. (ప్రవచనకారులకు అర్థమయినట్లుగా అని!).

ఇటువంటి పుక్కిటి పురాణాలకు ఇటలీలో ఫాసిజం 1922లో అధికారం చేపట్టగానే మంచి ఆదరణ పెరిగింది (ఇప్పుడు ప్రవచనకర్తలకు మాదిరిగానే). అదే అదనుగా ఎవోలా ఫాసిస్టు ప్రభుత్వ ముఖ్య పత్రిక Defense of the Raceలో తన జాతి ఎంత గొప్పదో, ఎందుకు గొప్పదో విపరీతంగా రాయడం మొదలు పెట్టాడు. ఆ "ఆధ్యాత్మిక జాతివివక్ష" (spiritual racism) రాతల ద్వారా తాను నమ్మిన పాగనిజాన్ని (Paganism) పునరుద్ధరించాలని అనుకున్నాడు. రోమన్ పాగన్ అనేది నాలుగో శతాబ్దానికి చెందిన మతం. ఈ మతంలో హిందూమతంలో మాదిరిగానే ప్రకృతి ఆరాధన, బహు దేవతారాధన ఉంటుంది. పూజలు, మంత్రాలు, ఇంద్రజాల క్రీడలు ఉంటాయి. దాదాపుగా హిందూ మతానికి పోల్చదగినది. అందుకే ఎవోలా తన రచనలలో హిందూ మతానికి సంబంధించిన అనేక రెఫరెన్సెస్ ఇచ్చాడు. 'యూదులు, క్రైస్తవులు బయటివారని, వారి మతాలే పాగనిజం అభివృద్ధికి అడ్డంకి' అని బహిరంగానే ప్రకటించాడు. ఫాసిస్టు నాయకుడు ముస్సోలిని క్రైస్తవ మతానికి దగ్గరవ్వడాన్ని ఎవోలా సహించలేదు. ఎలాగైనా దూరం చేయడానికి ప్రత్యేక పూజలు చేశాడు. తనకు ఉన్నాయని అనుకున్న ఇంద్రజాల 'శక్తులను' ప్రయోగించాడు. వీటి మూలంగానే ఎవోలాను ఫాసిస్టు నాయకత్వం కొంత దూరంగా వుంచింది. కానీ అతని మత్తు, మాయ సిద్ధాంతాలను విమర్శించలేదు. ఎవోలా క్రిస్టియానిటీని ముందు శత్రువుగా భావించినప్పటికి తర్వాత కాలంలో కథొలిసిజం మీద తన విమర్శ తగ్గించి, ప్రొటెస్టన్ల మీద దాడి మొదలు పెట్టాడు. చివరికి కాథలిక్స్ కూడా ఎవోలాను ఎత్తిపట్టారు. ఎందుకంటే తాము నమ్మే సాంప్రదాయవాదాన్నే అతనూ ప్రచారం చేస్తున్నాడు కాబట్టి. మొత్తంగా ఎవోలా తన ఆధ్యాత్మిక ఫాసిజం ద్వారా చరిత్రను, స్వేచ్ఛను, మానవవాదాన్ని, హేతువాదాన్ని, మార్క్సిజాన్ని వ్యతిరేకించాడు. వర్గ సమాజం సుస్థిరం కావాలని కోరుకున్నాడు. పీడిత ప్రజలు వర్గ దోపిడీ గురించి ఆలోచించ కుండా ఒక మంద మనస్తత్వాన్ని (mob mentality) నిర్మాణం చెయ్యాలని ప్రవచనాలు చెప్పాడు. సామాజిక పురాణాల (social myths) ద్వారానే ఆ మంద మనస్తత్వాన్ని సునాయాసంగా ప్రజల్లో అభివృద్ధి చెయ్యొచ్చని నమ్మాడు. ఆ పనేచేశాడు. వాస్తవానికి ముస్సోలిని ఇంకా కావాల్సినంత దూకుడుగా ఫాసిజాన్ని అమలు పరచడం లేదని దిగులు పడేవాడు.

బ్రాహ్మణీయ ప్రచనకారులు సరిగ్గా ఎవోలా చేసిన ఆధ్యాత్మిక ఫాసిస్టు పనే చేస్తున్నారు. నిచ్చనమెట్ల సమాజాన్ని జన్మ జన్మల కర్మఫలితాలతో ముడిపెడుతున్నారు. 'అది నీ కర్మ ఫలం. కాబట్టి అనుభవించాల్సిందే' అని దోపిడీ, పీడనలకు ఆధ్యాత్మిక మద్దతును కూడగడుతున్నారు. 'అంతా అమ్మవారి ఆటలోని పావులం మాత్రమే. కాబట్టి ఆ ఆటను ప్రశ్నించకు, ఆట ఫలితాలను ఆశించకు' అని నిద్రబుచ్చుతున్నారు. సమాజ చలనాన్ని కోరుకునే అన్ని రాజకీయాలను కించపరుస్తూ తమ ఆధిపత్యం కొనసాగే హిందూ రాష్ట్రాన్ని కలకంటున్నారు. దానికి మద్దతుగా సమాజం మీదికి మత్తు జల్లుతున్నారు. తెలుగు నేల మీద అందులో అగ్రగణ్యుడు గరికపాటి.

సీనియర్ జర్నలిస్టు వనజ తన వీడియోలో చూపించినట్లు గరికపాటి ఒక సెక్సిస్ట్. స్త్రీలు ఎలాంటి బట్టలు వేసుకోవాలి? ఎలా వేసుకోవాలి ? జుట్టు ఎంత పెంచుకోవాలి? ఎలా ముడి వేసుకోవాలి? సామాజిక, ఆర్థిక వ్యవహారాలలో ఎలా ప్రవర్తించాలో తానే నిర్దేశిస్తాడు. ఈ వ్యాఖ్యానాలకు మద్దతుగా పురాణాలను వల్లిస్తాడు. ఒకవైపు స్త్రీని శక్తి రూపమంటాడు. మరోవైపు స్త్రీ "సృష్టి ధర్మానికి" అనుగుణంగా (పురుషుడికి లొంగి!) బతకాలంటాడు. "సృష్టిలో ఏ లోపం లేదు, మన దృష్టిలోనే లోపమంతా" అంటాడు. ఆ లోప దృష్టితోనే స్త్రీని చూస్తాడు. "పవిత్ర" పురాణాలు చెప్పే నోటితోనే పైటకొంగుల ముచ్చట్లు చెబుతాడు. తన ముందుండే మంద చప్పట్లు కొడుతుంటే మురిసిపోతాడు. గరికపాటి లాంటివాళ్ళను బహిరంగంగా ఎండగట్టడం అవసరం. అందుకు వనజకు అభినందనలు. గరికపాటి మాటలు వింటుంటే చీము నెత్తురు వున్న ఎవ్వరికైనా రక్తం మరుగుతుంది. కానీ వనజ నిలకడగా, నిబ్బరంగా చెప్పిన తీరు ఎందరినో ఆలోచింపచేస్తుంది. ధైర్యాన్ని ఇస్తుంది. అయితే ఇలాంటి ప్రవచనకారులను నిర్దిష్టంగా ఎండగడుతూనే వీళ్ళందరికి మూలుగయిన బ్రాహ్మణీయ హిందూత్వ ఫాసిజాన్ని అన్ని రూపాలలో ఎదుర్కోవాలి. లేకపోతే ఆధ్యాత్మిక ఫాసిజం మన నడివీధుల్లో, నట్టింట్లో, నెట్టింట్లో మన అనుమతి లేకుండానే ఊరేగుతుంది. "ఉద్ధరిస్తానని" అంటూ ఉద్దెర మాటలు చెబుతూనే ఉంటుంది.

ఆధ్యాత్మిక ఫాసిజం పీడిత కులాల, వర్గాల, లింగాల, మత మైనారిటీల మీద కొనసాగుతున్న దాడి. దానిని భావ జాల రంగంలో ఎదురించడం ప్రజాస్వామ్య, సమతా సమాజాన్ని ఆకాక్షించే అందరి కర్తవ్యం. ❑

**(కొలిమి సౌజన్యంతో)**

# భౌతిక వాదాన్ని తవ్వి తీసిన దేవీప్రసాద్ చటోపాధ్యాయ



డాక్టర్ దేవరాజు మహారాజు
**కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు విజేత, జీవ శాస్త్రవేత్త**

**ప్రపంచానికే తొలిసారి భౌతికవాదం గురించి చెప్పిన దేశం మనది. దీనిని భారతీయులందరూ సగర్వంగా చెప్పుకోవాల్సింది పోయి, మనువాదుల చేతుల్లో కీలు బొమ్మలై, కల్పనల్లో ఊహించుకున్న దేవీ దేవతల మూర్తులకు పూజలు చేస్తూ దిగజారిపోయారు. నిజాలను వదిలి, అబద్ధాల వెంట పరుగులు పెట్టారు. అలా శతాబ్దాలు గడిచిపోయాయి. మధ్య మధ్యలో దేవీ ప్రసాద్ ఛటోపాధ్యాయ లాంటి వివేకవంతులు ఆధునిక కాలంలో కూడా భౌతికవాద ప్రాశస్త్యాన్ని ఎలుగెత్తి చెబుతూనే ఉన్నారు. కానీ, కళ్ళు మూసుకుని, తలవంచుకుని గొర్రెల్లా బతికే జనం వారి హెచ్చరికల్ని పట్టించుకోలేదు. శూన్యాన్ని మహాశక్తిగా విశ్వసిస్తూ వస్తున్నారు.**

ఒకప్పుడు ప్రపంచానికి భౌతిక వాదం పరిచయం చేసిందే మనదేశం. ఇక్కడి చార్వాక–లోకాయత ఆలోచనా విధానాన్ని మనువాదులు అన్యాయంగా అణగదొక్కారు. భూస్థాపితం చేశారు. తమ కట్టుకథల్ని ప్రచారం చేసుకుని అదే మన సంస్కృతి, అదే మన సంప్రదాయం అని బుకాయించారు. అయినా భౌతికవాదం ఎక్కడికీ పోలేదు. ఈ నేలలోనే ఉంది. ఈ గాలిలోనే ఉంది. లోకాయత అంటే లోకేశు ఆయుతం: అని అర్థం. అంటే లోకంలో వ్యాప్తి చెందిన ప్రజల దృక్పథం – అని అర్థం! వీరు లోకాన్నే విశ్వసిస్తారు. ఎక్కడా లేని ఇతర లోకాలను నమ్మరు. లోకంలోని లోకులను మాత్రమే విశ్వసిస్తారు. లోకాయత ప్రజల తత్వశాస్త్రం. ఆధునిక వైజ్ఞానిక పరిశోధనలు జరగక ముందే (బీసీఈ) లోకాయతులు ప్రపంచమే వాస్తవం అన్నారు. నాలుగైదు మూలకాల సంయోగం వల్లనే ఈ ప్రపంచం ఏర్పడిందన్నారు. నీరు, నిప్పు, గాలి, భూమి – నాలుగు మూలకాలయితే, అయిదోది ఆకాశం అన్నారు. చైతన్యం అనేది పంచ భూతాల నుండి వస్తుందన్నారు. 'భూతే బాహ్యా చైతన్యం!' మనుషులందరి శరీరాలు ఒకటే – ముక్కు, ముఖం, చేతులు, కాళ్ళు అందరికీ ఒకేలా ఉన్నప్పుడు, జీవన క్రియలు ఒకేలా జరుగుతున్నప్పుడు ఈ వర్ణ వ్యవస్థ ఎందుకూ? ఈ కులాల తారతమ్యాలు ఎందుకూ ? అసలు అవి ఉండాల్సిన అవసరం ఏమిటీ ? అని లోకాయతులు సాధారణ శకానికి ముందే ప్రశ్నించారు. వీరే అతి ప్రాచీన భారతీయ భౌతిక వాదులు. ఈ ప్రపంచాన్ని ఏ శక్తీ నడిపించడం లేదని, ఆత్మ, పునర్జన్మ మోక్షం వంటివి ఉండవని చాటి చెప్పారు.




1918–1993 మధ్య కాలంలో దేవీ ప్రసాద్ ఛటోపాధ్యాయ అనే మార్క్సిస్టు మేధావి, తత్వవేత్త ముందుకొచ్చాడు. వైదిక ధర్మ ప్రచారకుల వేదాల అబద్ధపు కట్టడాల్ని కూల్చి వేస్తూ... వారు భూస్థాపితం చేసిన భారతీయ భౌతిక వాదాన్ని అదే భూమి పొరల్లోంచి తవ్వితీశాడు.

ఒకప్పుడు దేశంలో విస్తృతంగా ప్రచారంలో ఉన్న లోకాయత – చార్వాక తాత్వికతను దేశ ప్రజలకు విడ మర్చి చెప్పాడు. వైదిక పురాణా లు ప్రచారం చేసిన భ్రమల్ని బద్దలు కొట్టాడు. అన్నింటికీ 'కారణం' – హేతువు ప్రధాన మని, అది వైజ్ఞానిక అవగాహన మీద ఆధారపడి ఉండాలని చెప్పిన మహనీయుడాయన! తొలిసారి తత్వశాస్త్రాన్నీ, వైజ్ఞాని కతనూ కట్టగట్టి కొత్త ఆలోచనల కు దారులు వేసిన పరిశోధకుడాయన! చరిత్రకు, సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలకు సైన్సు వెన్నముక కావడం మనం చూశాం. కానీ, దేవీ ప్రసాద్ చట్టోపాధ్యాయ కొత్తగా ఫిలాసఫీకీ సైన్సుకూ ఉన్న సంబంధాన్ని హేతుబద్ధంగా

చెప్పి – నిరూపిం చారు ! ప్రాచీన భారతీయ భౌతిక వాదాన్ని అధ్యయనం చేసి, ఆయన ప్రకటించిన 'లోకాయత' మాత్రమే కాదు, వైజ్ఞానిక శాస్త్రాల చరిత్రను (HISTORY OF SCIENCE), ప్రాచీన భారతదేశంలో వైజ్ఞానిక పద్ధతుల్ని (SCIENTIFIC METHODS IN ANCIENT INDIA) ఆయన గ్రంథాలుగా ప్రకటించారు. ఇవే కాకుండా ప్రాచీన భారత దేశంలో విజ్ఞాన శాస్త్రం – సమాజం (SCIENCE AND SOCIETY IN ANCIENT INDIA). వంటి గ్రంథాలు బహుళ ప్రజాదరణ పొందాయి. ఆయన గ్రంథం లోకాయత (A STUDY IN ANCIENT INDIAN MATERIALISM) – 1959 దేశంలోనే కాదు, విదేశాల్లోనూ సంచలనం సృష్టించింది. భారతీయ మార్క్సిస్టు తాత్వికత గూర్చి ప్రపంచానికి ఒక కొత్త అవగాహనను కలిగించింది. దేవీ ప్రసాద్ ఛటోపాధ్యాయ (19 నవంబర్ 1918–8 మే 1993) రచనలు 'సైన్స్ అండ్ సొసయిటీ ఇన్ ఏన్సియంట్ ఇండియా' – సంపుటాలుబీ 'వాట్ ఈజ్ లివింగ్ అండ్ వాట్ ఈజ్ డేడ్ ఇన్ ఇండియన్ ఫిలాసఫీ', 'ట్రూ ట్రెండ్స్ ఇన్ ఇండియన్ ఫిలాసఫీ', 'రిలిజియన్ అండ్ సొసయిటీ' వంటి గ్రంథాలు తిరగేస్తే ఒకప్పుడు ప్రపంచానికి భౌతికవాదం బోధించిన భారతదేశం ఈ రోజు ఎందుకు ఇలా కుప్పగూలి పోయిందో అర్థమవుతుంది. అంతేకాదు, దాన్ని పునరుద్దరించు కోవాల్సిన బాధ్యత నేటియువతరం మీద ఎంత ఉందో అంచనా వేసుకోవడానికీ వీలవుతుంది. కార్యాచరణకు ప్రేరణ లభిస్తుంది.

చార్వాకుడు ఒకనాటి రుషి. అతను ప్రపంచంలోనే మొట్ట మొదటిసారి భౌతికవాదం గురించి ఆలోచించాడు. బృహస్పతి ఆ ఆలోచనకు ఒకరూపం ఇచ్చాడు. పైగా చార్వాకుడి పేరుతోనే ఆ ఆలోచనా విధానాన్ని 'చార్వాకం' అని అన్నాడు. మాధవాచార్య ఆ పదానికి అర్థం చెప్పాడు. చారూ అంటే తియ్యని అని, వాక్ అంటే మాట అని చెప్పాడు. యదార్థాల్ని సున్నితంగా చెప్పడం – అని కూడా మనం అనుకోవచ్చు. చార్వాక్‌కు మరొక అర్థం కూడా ఉంది. వారు ప్రతిపాదించినవి నాలుగు విషయాలు (నాలుగు వాక్కులు) గనక, వారి ఆలోచనా ధోరణిని 'చార్వాక' అని కూడా అన్నారు. 1. యావత్ జీవేతూ సుఖ్‌జీవేతూ (జీవితాంతం సుఖంగా జీవించు) 2. రుణమూ కృత్వా ఘృత పీవేతూ (అప్పు చేసైనా నెయ్యితాగు) 3. భస్మీ భూతస్య దేహస్య (కాలిపోయి బూడిద అయ్యే ఈ దేహం) 4. పునరాగమన కృతః (మళ్ళీ తిరిగి వస్తుందని ఎలా అనుకుంటావూ?) నెయ్యి తాగు – అంటే ఇక్కడ నెయ్యనే కాదు. పాలు, పెరుగు, శరీరానికి అవసరమైన పౌష్టి కాహారం అని అర్థం. చనిపోయాక ఈ దేహం కాలిస్తే బూడిద అవుతుంది. పూడిస్తే మట్టి అవుతుంది. అంతేగాని ఇక పునరాగమనం ఎక్కడా? శరీరం ఎలా తిరిగి



వస్తుంది అని ప్రశ్నించారు. అంటే పునర్జన్మ అబద్ధమనీ, అది ఉండదనీ చెప్పారు. మోక్షానికి కూడా ఆధారం లేదన్నారు.

శరీరమే ముఖ్యం. వైదికులు చెప్పే ఆత్మ ఉండాలన్నా కూడా శరీరం ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలి కదా ? అప్పు చేసైనా సుఖంగా ఉండు – అని అన్నది ఎందుకంటే అప్పు తీసుకున్న వాడు, అప్పు ఇచ్చిన వాడూ ఇద్దరూ ఏదో ఒక నాటికి నశించాల్సిన వాళ్ళే. కానీ జీవిని, ప్రాణాన్ని కష్టపెట్టకుండా కాపాడుకొమ్మని చార్వాకులు చెప్పారు. మిధ్యావాదాన్ని నమ్మగూడదని – అన్నారు. సంశయ వాదం, సందేహ వాదాన్ని ప్రమాణంగా తీసుకోలేదు. కర్మఫలం ఉండదు. స్నేహితులతో, బంధువులతో బతికినంత కాలం సంతోషంగా గడపడమే జీవితం ! వారినందరినీ పక్కకు నెట్టి, ఎక్కడా లేని పరలోక సుఖాల కోసం పూజలు, యజ్ఞాలు చేయడం మూర్ఖుల లక్షణం–అని అన్నారు. తర్కాన్ని – అనుభవాన్ని – శరీరాన్ని మాత్రమే నమ్ము కోవాలి. అంతేగాని, ఆత్మను, పునర్జన్మను, స్వర్గనరకాలను, కర్మకాండను నమ్ముకోగూడదన్నది వారి సిద్ధాంతం! వైదిక ధర్మంలో యజ్ఞ యాగాలకు, జంతు బలులకు చాలా ప్రాముఖ్యం ఉంది. ప్రకృతిని పరిరక్షించుకోవాలని భావించే చార్వాకులు / లోకాయతులు – పశువుల్ని, పక్షుల్ని ఇతర జీవ రాసుల్ని అమితంగా ప్రేమించేవారు. అందుకే జంతు బలుల్ని తీవ్రంగా అడ్డుకున్నారు. బలి ఇచ్చిన పశువులు స్వర్గానికి వేళ్ళేదైతే, ఈ వైదిక పండితులు వృద్ధాప్యంతో సతమతమయ్యే తమ తండ్రిని బలిచ్చి నేరుగా స్వర్గం పంపవచ్చు కదా? అని సవాలు విసిరారు. లోకాయతుల అర్థవంతమైన ప్రశ్నలకు జవాబు చెప్పలేక వైదిక ధర్మ బోధకులు వక్ర భాష్యాలు చెప్పి, అణగదొక్కారు. భౌతిక దాడులకు పూనుకుని చార్వాకుల్ని బానిసలుగా మార్చారు. ఆడ వారిపై అత్యాచారాలు చేశారు. కుట్ర పూరితంగా వారి గ్రంథాల్ని సైతం నాశనం చేశారు. కాల్చేశారు. అందుకే చార్వాక–

లోకాయుతలపై ప్రాచీన గ్రంథాలు మనకు దక్కలేదు.

దేవీప్రసాద్ ఛటోపాధ్యాయ లాంటి పరిశోధకుల కృషితో కొంతలోకొంత సమాచారం బయటికొచ్చింది. ఏది ఏమైనా 'నాస్తికో వేద నిందక' (నాస్తికులు వేదాలను నిందిస్తారు-ఒప్పుకోరు) అన్న భావన లోకంలో స్థిరపడింది. చార్వాక - జ్ఞాన సిద్ధాంతాన్ని ప్రతిపాదించింది. అంటే థియరీ ఆఫ్ నాలెడ్జ్ (EPISTEMOLOGY). ప్రత్యక్ష ప్రమాణాలుంటేనే దేనినైనా స్వీకరించాలని ఈ సిద్ధాంతం చెప్పింది. ప్రత్యక్ష అనుభవం అనేది రుచి, వాసన, స్పర్శ, దృష్టి, శబ్దం వల్ల గ్రహించొచ్చు. జ్ఞానేంద్రియాలకు అందని భ్రమలు - కల్పితాలు! అప్రత్యక్ష విశ్వాసాల్ని భౌతికవాదం పరిగణనలలోకి తీసుకోదు. చార్వాక "థియరీ ఆఫ్ రియాలిటీ" (METAPHYSICS)ని నమ్ముతుంది. గాలి, నీరు, అగ్ని, భూమితోనే ప్రతి పదార్థం రూపొందుతుంది గనక, 'పదార్థమే' (MATTER) జీవనానికి ప్రధానం అన్నారు. 'మేటర్'ని గుర్తిస్తుంది గనక, ఈ సిద్ధాంతం 'మెటీరియలిజం' అయ్యింది. జీవించి ఉన్న ప్రాణిలోని స్పృహ (CONSCIOUSNESS)ను వైదిక ధర్మం 'ఆత్మ' అని భావించింది తప్పితే - ఆత్మ అనేది లేదన్నది చార్వాకులు గట్టిగా చెప్పారు. ఒక రకంగా చార్వాక - లోకాయత అనేది భారతీయ తాత్త్విక దృక్పథంలో ప్రధానమైంది. ప్రపంచానికే తొలిసారి భౌతికవాదం గురించి చెప్పిన దేశం మన భారతదేశం. ఆ విషయం భారతీయులందరూ సగర్వంగా చెప్పుకోవాల్సింది పోయి, మనువాదుల చేతుల్లో కీలుబొమ్మలై, కల్పనల్లో ఊహించుకున్న దేవీ దేవతల మూర్తులకు పూజలు చేస్తూ దిగజారిపోయారు. నిజాలను వదిలి, అబద్ధాల వెంట పరుగులు పెట్టారు. అలా శతాబ్దాలు గడిచిపోయ్యాయి. మధ్య మధ్యలో దేవీ ప్రసాద్ ఛటోపాధ్యాయ లాంటి వివేకవంతులు ఆధునిక కాలంలో కూడా భౌతికవాద ప్రాశస్త్యాన్ని ఎలుగెత్తి చెపుతూనే ఉన్నారు. కానీ, కళ్ళు మూసుకుని, తలవంచుకుని గొర్రెల్లా బతికే జనం వారి హెచ్చరికల్ని పట్టించుకోలేదు. శూన్యాన్ని మహాశక్తిగా విశ్వసిస్తూ వస్తున్నారు. 'దేబీదా'గా ప్రేమగా పిలవబడ్డ దేవీ ప్రసాద్ ఛటోపాధ్యాయ చదువుకునే రోజుల్లో డిగ్రీలోనూ, పీజీలోనూ గోల్డ్ మెడల్స్ సంపాదించారు. తత్వశాస్త్ర విద్యార్థిగా, అధ్యాపకుడిగా ఒక కొత్త ఒరవడి సృష్టించినందుకు చివరిదశలో ఆయనను ఒక సైన్స్ సంస్థ 'గెస్ట్ సైంటిస్ట్'గా సగౌరవంగా నియమించుకుంది. న్యూఢిల్లీలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్, టెక్నాలజీ అండ్ డెవలప్‌మెంట్ స్టడీస్‌లో కొంతకాలం ఉన్నారు. ఇది చాలా చాలా అరుదైన విషయం! భారత ప్రభుత్వం ఆయన కృషిని గుర్తించి, ఆయన మరణించిన తర్వాత ఐదేండ్లకు 1998లో పద్మభూషణ్ ప్రకటించింది. ఆయన కృషి వృథాగా పోలేదు. సమకాలీనంలో పరిస్థితులు చాలా ప్రమాదకరంగా తయారయ్యాయి. అయితే, ఈ పరిస్థితి తప్పకుండా మారుతుంది. రాగల కాలాలలో యువత బుద్ధుడు చెప్పిన 'అత్ దీపోభవ' (నీవే దీపానివి అయిపో) అన్న మాటని గుండెల్లో నింపుకుని, వైజ్ఞానిక భౌతిక-మానవ వాదానికి దారులు వేస్తారు. తప్పదు!! ❑

## ప్రగతిశీల అంశాలను దాచుకోవాలి - జి.భార్గవ్

ఆధిపత్య సంస్కృతితో పోరాడలేక, రాజీపడలేక సతమతమయ్యే స్థితిలో ఎందరో వుంటారు. అది నిజమైన వేదన. రాజీలను సైద్ధాంతికంగా సమర్థించుకుంటూ మరికొందరుంటారు. అది ఆత్మ తృప్తి కోసం చేసుకునే ఆత్మవంచన. వ్యక్తిగత అభిరుచులు ఎక్కడ ముగుస్తాయో ఎక్కడ సామాజిక నైతిక విమర్శ ఆరంభమౌతుందో స్పష్టత లేని వారు ఇంకొందరుంటారు. వారిది దబాయింపు. జానపదం, సాంప్రదాయం అనే విభజన కేవల కళారూపాల విభజనే తప్ప సాంస్కృతిక సారంలో కాదనే ఎరుకలేని వారుంటారు. సంస్కృతం కేవలం బ్రాహ్మణులదనో, క్లాసికల్ కళారూపాలు ప్రజలకు పనికి రావనో నమ్మే వారుంటారు. ధైర్యంగా అలాంటి సూత్రీకరణలు చేసేవారుంటారు. అది వట్టి పాప్యులిజం. శిష్టవర్గాల చేత రూపొందిన సాహిత్య కళారూపాలు, వాటి నిర్మాణ సూత్రాలూ ఆ వర్గాల వ్యక్తిగత ఆస్తి కాదు. సమాజమంతా కలిసి సృష్టించిన అదనపు సంపదను తేరగా తిని విశ్రాంతి వర్గాలు సృష్టించిన కళా సంపద అది. విశ్రాంతి వర్గాలను రద్దు చేసి, వారి భౌతిక సంపదలను ఎలాగైతే సమాజం స్వాధీనం చేసుకుని ప్రజలందరి అవసరాల కోసం, వికాసం కోసం ఉపయోగిస్తుందో సరిగ్గా అలాగే, విశ్రాంతి వర్గాలు సృష్టించిన భాషా, సాహిత్య, కళా సంపదలను సమాజం స్వాధీనం చేసుకుని కొత్త ఆశయాలతో వాటిని మరింత పదునుబెట్టి, అభివృద్ధి చేసి ప్రజలందరి మనోవికాసాల కోసం ఖర్చుచేస్తుంది. ఇదొక్కటే సరైన, ప్రగతి శీలమైన వైఖరి. (బానిసలు మనుషులే కారని నమ్మిన అరిస్టాటిల్ భావజాలాన్ని చెత్త బుట్టలోకి వేసి ఆయన తాత్విక, తార్కిక సిద్ధాంతాలను ఎలా భద్రంగా దాచుకుని అధ్యయనం చేస్తామో వ్యక్తిగతంగా న్యూటన్ నమ్మిన మతవాద మార్మిక చెత్తను విసర్జించి ఎలాగైతే ఆయన భౌతిక శాస్త్రాన్ని నేర్చుకుని మరింత అభివృద్ధి చేసుకున్నామో.. ఆవిధంగా. ఇదొక్కటే మానవాళి భవిష్యత్తుకు పనికొచ్చే వైఖరి. మిగిలిందంతా తాత్విక గందరగోళం లేదా అచారిత్రిక క్రోధం లేదా నైతిక లోకపు దివాలా. ❑

# భారత పత్రికారంగం భవిష్యత్తేమిటి?

(అనువాదం: కొండముది లక్ష్మీ ప్రసాద్)



ఎన్.రామ్

హిందూ పత్రిక మాజీ సంపాదకులు

**ప్రముఖ వార్తా పత్రికలూ, వార్తా టెలివిజన్ సంస్థలలో సంపాదకీయ విషయాన్ని, సంపాదకీయ కార్యకలాపాల్ని తక్కువ చేయడం, విలువ లేకుండా చేయడం, మార్కెట్ పరిశోధన పేరు మీద క్రమపద్ధతిన నోరు మూయిస్తున్నారు. యాజమాన్యాలు, సీనియర్ మేనేజ్‌మెంట్ నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా సంపాదకీయాల స్థాయిని దిగజార్చే పద్ధతులను ఇష్టపూర్వకంగా అంగీకరించడం, సంపాదకీయ సమాచారం ముసుగులో అందించే అడ్వర్‌టైజ్‌మెంట్ సమాచారంలో వార్తలకు చెల్లించే వివరాలను పూర్తిగా ఇవ్వకపోవడం, అసలు ఇవ్వకపోవడం చేస్తున్నారు.**

అభివృద్ధి చెందిన ప్రపంచ దేశాలలో వార్తా పత్రికా రంగం చూస్తుండగానే సంక్షోభంలో కూరుకుపోయింది. ఈ డిజిటల్ యుగంలో బాగా అభివృద్ధి చెందిన దేశాలలోని వార్తా పత్రికలూ, సమాచార టెలివిజన్ల భవితవ్యంపై విషాదం అలముకుంది. వ్యాన్ ఇఫ్రా ఆధ్వర్యంలో అక్టోబర్ 2011న వియన్నాలో నిర్వహించిన ప్రపంచ వార్తా పత్రికల మహాసభ, ప్రపంచ సంపాదకుల ఫోరంలలో నేనూ పాల్గొన్నాను. ఆ సమావేశాల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరిలోనూ వార్తా పత్రికా రంగ చారిత్రక యుగం ముగింపు కొచ్చిందని, ప్రపంచవ్యాప్తంగా అటూ ఇటూగా అందరం నిలకడలేని అనిశ్చితిలోకి అడుగుపెడుతున్నామన్న భావన కలిగింది. పాఠకుల ప్రవర్తనలోనూ, వార్తలను స్వీకరించే తీరులోనూ పెనుమార్పులు వస్తున్నాయి. వెబ్, మొబైల్ వేదికలు వేగాన్ని పుంజుకుంటున్నాయి. ప్రాణాంతకమైన ఆర్థిక ఇబ్బందులతోపాటు జారిపోతున్న పాఠకలోకాన్ని తిరిగి చేజిక్కించుకోవడం సంప్రదాయ వార్తా పత్రికా రంగానికి పెను సవాలైంది. పరిశ్రమకు సంబంధించిన ఇటువంటి ధోంఖులతోపాటు అభివృద్ధి చెందిన దేశాలలో ఒత్తిళ్ళు, నిరాశ నిర్వేదాలు, గందరగోళాలతో ఇప్పటికే స్వతంత్రమైన, సమర్థవంతమైన జర్నలిజం భారీగా దెబ్బతింది. కొలంబియా యూనివర్సిటీలోని మా పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ప్రచురించిన 'అమెరికా జర్నలిజం పునర్నిర్మాణం' అన్న సమకాలీన నివేదికలలో ప్రస్తావించినట్లు, 'దేశానికి పట్టు గొమ్మలైన వార్తాపత్రికలు, కొద్దిమంది జర్నలిస్టులతో, కొద్ది పేజీలకు పరిమితమై, కొన్ని కథనాలతో వాస్తవంగా కుంచించుకుపోతున్నాయి. ఈ దుస్థితితో భారతదేశ వార్తా పత్రికా రంగాన్ని పోల్చి చూస్తే, అది అభివృద్ధి బాటలో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. కాని ఎగిసిపడుతున్న మన అభివృద్ధి వృత్తాంతం, దాని పర్యవసానాల్ని విమర్శనాత్మకంగా పరిశీలించుకోవాల్సి వుంది. గణాంకాలు అందుబాటులో ఉన్నా వాటిని అంతగా పట్టించుకోదలచలేదు. 2012 న్యూయార్కర్ పత్రికలో కెన్ ఔలెట్ట తన వ్యాసంలో భూమండలంలో వార్తా పత్రికలు బతికి బట్టకడుతున్న దేశాలలో భారతదేశం ఒకటని, ఇక్కడ జర్నలిస్టులకు, ప్రత్యేకించి యువకులకు పుష్కలంగా నైపుణ్యావకాశాలు ఉన్నాయని రాశారు.

ఇండియన్ ప్రెస్, ప్రత్యేకించి భారతదేశ భాషా వార్తా పత్రికలూ మరియు ఉపగ్రహ వార్తా టెలివిజన్ వృద్ధిపథంలో కొనసాగుతున్నాయి. ఈ అభివృద్ధి కథనంతో కొంతభాగాన్ని విశేషంగా పరిశోధించి, విశ్లేషించిన అంశాల్ని 15 సంవత్సరాల క్రితమే రాజకీయ శాస్త్రవేత్త అయిన రాబిన్ జఫ్రీ తన 'భారతదేశ వార్తా పత్రికా విప్లవం' అన్న పుస్తకంలో పొందుపరిచారు. దీనితోపాటు ఈ అంశంపై ఎకనామిక్ మరియు పొలిటికల్ వీక్లీలో 1987, 1993, 1997లలో సీరియల్‌గా ఆయన వ్యాసాల్ని ప్రచురించారు. అభివృద్ధి చెందిన సాంకేతిక విజ్ఞానం, నిలకడగా విస్తరిస్తున్న అక్షరాస్యత, మెరుగైన కొనుగోలు శక్తి, వైవిధ్య భరితమైన కథనాలు, వీటన్నింటినిమించి రాజకీయ ఉత్సుకతలు–భారత వార్తాపత్రికా విప్లవం వెనుకనున్న కీలకాంశాలుగా రాబిన్ జఫ్రీ పేర్కొన్నారు. ఇక్కడ వార్తల దాహార్తి పుష్కలంగా ఉండి, విశ్లేషణలు, వ్యాఖ్యానాలు, వినోదం, వాటి సంకర ఆవిష్కరణ అయిన 'వినోదాత్మక సమాచారం' అన్నీ వార్తల ముసుగు కింద చలామణి అవుతున్నాయి. ఈ మూసలో పలుకుబడి కలిగిన భారత భాషా వార్తా దినపత్రికలు పుంఖానుపుంఖాలుగా విస్తరించాయి. అందులో చాలా పత్రికలు అత్యధిక సర్క్యులేషన్, భారీ పాఠక లోకాన్ని కలిగి ఉన్నాయి.

అయినప్పటికీ భారత పత్రికా రంగం ప్రదర్శిస్తున్న ఎగసిపడే అభివృద్ధిని, వాటి పర్యవసానాల్ని ఆరాధనా స్థాయికి తీసుకు వెళ్ళకూడదు. భిన్నత్వాలు కలిగిన ప్రజల అవసరాలు, ప్రత్యేకించి గ్రామీణ ప్రజలు, మహిళల అవసరాలకు న్యాయం చేయకలిగే సామాజిక దృక్కోణం కలిగి ఉండటానికి భారతదేశ వార్తా పత్రికారంగం ఇంకా చాలా దూరం ప్రయాణించవలసి ఉన్నది. ఈ అంశాలపై సంపాదకీయాలు వ్రాయటానికి వాస్తవం లో అనేక ఇబ్బందులు ఇమిడే ఉన్నాయి. భారత టెలివిజన్ భారీ ప్రేక్షక లోకాన్ని కలిగి వుండి ఇంకా వృద్ధి చెందుతూనే ఉంది. అయినప్పటికీ ఈ సామూహిక ప్రేక్షక లోకంలో అత్యధికభాగం వినోద ఛానళ్ళకు సంబంధిం చినవారే. ఇంగ్లీష్ మరియు ఇతర భాషా వార్తా పత్రికలతో పోటీ పడగలిగిన 24ఞ7 ఉపగ్రహ టెలివిజన్ వార్తా ఛానళ్ళు డజన్లలో ఉన్నా, మొత్తం టీవీ మార్కె ట్లో వారి నిష్పత్తి చాలా స్వల్పంగా ఉంది. భారత పత్రికా రంగం ప్రదర్శిస్తున్న ఎగసిపడే వృద్ధిని పెద్దదిగా చేసి చూపించ వద్దనటా నికి ఇతర కారణాలు కూడా ఉన్నాయి. కవర్ పేజీ ధరలకంటే తక్కువ ధరలకు పత్రికలను అమ్మడం, వందల వేలాది కాపీలను ముద్రించి, వాటిని పాత కాగితాల మార్కెట్‌కు తరలించడం లాంటి అనైతిక పద్ధతులతో భారీ సర్క్యులేషన్ లేబిల్ పొందడం వార్తా పత్రికలకు పరిపాటి అయ్యింది. వీటిలో రెండవ పద్ధతి వాణిజ్య ప్రకటనల సము పార్జనకు ఒక విధాన ప్రక్రియగా మారింది. ఇది చాలదన్నట్లు టెలివిజన్ ప్రేక్షకుల కొలమాన విధానం(టి.ఎ.ఎం.) విస్తృతమైన విమర్శలకు గురై, న్యాయ పరమైన చిక్కులను ఎదుర్కొంటున్నది. ప్రింట్, సమాచారరంగ వ్యవస్థలన్నీ క్రమంగా ఆర్థిక సంక్లిష్టతను ఎదుర్కొంటున్నాయి. గత కొన్నేళ్లుగా వాణిజ్య ప్రకటనల రంగం కుంచించుకుపోతు న్నది.పత్రికా ప్రచురణ రంగంలో వృద్ధి మందగించింది. 2008 –09 ప్రపంచ ఆర్థిక సంక్షోభం ఇందుకు దోహదపడినట్టుంది. అది భారత పత్రికా రంగ వృద్ధిని దెబ్బ తీసింది. సంక్షోభ పూర్వకాలంలో చవిచూసిన, కీలకమైన వాణిజ్య ప్రకటనల రెవెన్యూను మనం తిరిగి చూడలేమని నిపుణులు చెబుతున్నారు.

భారతదేశం డిజిటల్ యుగ వైరుధ్యాలను ఎదుర్కొని ఎలా మనగలుగుతుంది? పరివర్తనా యుగానికి కేంద్రమైన ఈ వైరు ధ్యాన్ని వివరించటానికి ప్రయత్నిస్తాను. ఒక ప్రక్కన అత్యధికం గా ప్రజలు డిజిటల్‌గా వార్తా పత్రికల్ని చదివేందుకు ముందు కొస్తున్నారు. మొదటిసారిగా చరిత్రలో ఉత్తమ ప్రచురణలకు ప్రపంచవ్యాప్త సజీవ పాఠకలోకాన్ని కలిగి వున్నాము. బహు ముఖమైన శీర్షికలతో, మల్టీ మీడియా హంగులతో సుసంపన్న మైన అనేక అత్యుత్తమ వార్తాపత్రికలూ, వార్తా వెబ్‌సైట్లు లభ్య మౌతున్నాయి. లభ్యమౌతున్న ఈ స్థలంలో అందించగలిగే సమర్థతకు ఆకాశమే హద్దుగా ఉన్నది. మరోపక్క, పాత వార్తా పత్రికారంగాన్ని అతలాకుతలం చేస్తున్న 'అస్తిత్వ సంక్షోభం" ఇంకా పరిష్కరింపబడలేదు. భారీ నష్టాన్ని చవిచూస్తూ అది కొనసాగుతూనే ఉన్నది. ఎందుకంటే ఈ అద్భుతమైన పరిణా మం అటు అంతర్జాలానికి గాని లేదా ఇటు డిజిటల్ జర్నలిజా నికి గాని మనగలిగే ఆదాయాన్ని మరియు వ్యాపార నమూనాని ఇవ్వలేకపోతున్నది.

అంతర్జాల వినియోగంలో, బ్రాడ్ బ్యాండ్ లభ్యం కావడంలో మన దేశం సాపేక్షంగా వెనుకబడి ఉన్న కారణంగా వార్తా పత్రికా రంగం సమాచార టెలివిజన్ ఆ మేరకు ప్రయోజనాల్ని పొందగలగడంలో ఎవరికీ లేశ మాత్రమైన సందేహం కూడా లేదు. ఈ విషయంలో చైనా అత్యద్భుత ప్రగతిని సాధించింది. జులై 2014 అంతానికి ఆ దేశంలో 63.2 కోట్ల మంది అంతర్జాల వినియోగదారులున్నట్లు అంచనా వేస్తున్నారు. వీరిలో అత్యధికభాగం బ్రాడ్‌బ్యాండ్ వినియోగదారులు కావడం విశేషం. మనదేశ అంతర్జాల అభివృద్ధిపై అధికారికంగా ఇంత వరకు ఏవిధమైన శాస్త్రీయ సర్వే నిర్వహింపబడలేదు. చిత్తు అంచనాలలో భారతదేశంలో 24 కోట్ల మంది అంతర్జాల వినియోగదారులు ఉన్నట్లు తెలుస్తున్నది. వీరిలో అత్యధికులు లోప భూయిష్టమైన బ్యాండ్ విడ్త్‌తో సతమతమౌతున్నారు. పోల్చదగ్గ జనాభా కల్గిన ఈ రెండు దేశాల్లో అంతర్జాల విస్తరణ పోలిక ఆసక్తికరమైన విశేషాల్ని తెలియజేస్తుంది. భారతదేశంలో కంటే చైనాలోఅంతర్జాల విస్తరణ రెండున్నర రెట్లకుపైగా ఉంది. దీనర్థమేమంటే వార్తా పత్రికా రంగం మరియు సమాచార టెలివిజన్లపై డిజిటల్ విప్లవ ప్రభావం పడటం ఇంకా ప్రారంభం కాలేదు. మనదేశంలో ప్రతి వార్తాపత్రిక వెబ్‌సైట్ కలిగి ఉండి, అందులో అనేక పత్రికలు సమాచారాన్ని, ఆకర్షణీయమైన డిజిటల్ హంగులను దేశ, విదేశీ పాఠకుల కోసం నిర్వహిస్తు న్నప్పటికీ, అవి ప్రింట్ మీడియాకు లోబడే ఉన్నాయి. ది గార్డియన్ పత్రిక సంపాదకులు ఎలన్ రుస్ బ్రిడ్జర్ ఇలా చెప్తున్నారు. 'జర్నలిజం కాంతి తరంగాల వేగంతో సమానంగా మార్పుకు గురౌతున్నది. (దాదాపు సెకనుకు 3 లక్షల కి.మీ.) మీడియాను పరివర్తింప చేస్తున్న డిజిటల్ టెక్నాలజీల నూతన విజ్ఞానాన్ని, నవీన సత్యాలను తప్పనిసరిగా ప్రతి వారం తెలుసు కుంటున్నాము" ఈ మార్పు మన దేశంలో శబ్ద తరంగాల వేగంతో (సెకనుకు 342.29 మీటర్లు) ఉన్నట్లు మన దేశ వార్తా పత్రికా పరిశ్రమ అంతర్గతంగా అభిప్రాయపడు తున్నట్లుంది.

ఈ పరిస్థితి ఉదాసీనతను పుట్టిస్తున్నది. డిజిటల్ యుగానికి ముఖ్యమైన నూతన విజ్ఞానాన్ని, నవీన సత్యాలను తెలుసుకోవా లనే నిజమైన చొరవ ఉండటం లేదు. అమెరికా ప్రింట్‌మీడియా ఎదుర్కొంటున్న పరిస్థితిని భారత వార్తా పత్రికారంగం 2040 నాటికి ఎదుర్కోవలసి ఉంటుందని, ప్రకటనలపైన, ఇతర అంశాలపైన ఆర్జించగలిగే రెవెన్యూలో అత్యధికభాగం మనం సొంతం చేసుకోవటానికి సంసిద్ధులం కావాలని భారతదేశంలో


కొన్ని అధ్యయనాలు తెలుపుతున్నాయి. డిజిటల్ ప్రభావం తక్షణం కాకపోయినా సమీపంలో ఉంటుందన్న వాస్తవాల్ని గుర్తించలేని వారి జోస్యాలు, అంచనాలు సత్య దూరాలనిఏ స్తుం ది. 2040 వరకు పరివర్తన సమయం రాకుండటం అసాధ్యమ నిపిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న ఏకీకరణల ప్రక్రి యతో రాజీపడటం, ఇక్కడ మన ముందు పెద్ద సవాలుగా నిలి చింది. 'మార్పు' యొక్క నడకను నిశితంగా అంచనా వేసుకొని, సంక్లిష్ట పరిస్థితులను గమనంలో ఉంచుకొని భవిష్యత్ మార్పులకు సిద్ధం కావలసి ఉంది. భారత వార్తా పత్రికల రం గంలో పలుకుబడి కలిగిన వర్గాలు చాలాకాలంగా రాజకీయా లలో నిర్వహిస్తున్న ప్రజాతంత్ర పాత్ర ప్రశ్నించలేనిది. దురదృష్ట వశాత్తూ, ఆర్థిక సమస్యలు, విధానాలు వచ్చేసరికి ప్రధాన స్రవంతి మీడియా అప్రజాస్వామికంగానే వ్యవహరిస్తున్నది. కానీ ఎప్పుడూ ఇదే విధానం కొనసాగటం లేదు. ఆకలి చావుల సమస్యల్లో క్షేత్ర స్థాయిలో తీవ్ర బాధితుల వాస్తవ జీవితాల్ని బహిరంగపరచటం లోను, ప్రభుత్వం అనుసరిస్తున్న వినాశకర విధానాల అమలును నివారించి, తీవ్ర ఆకలి, క్షామ పరిస్థితుల నుండి విముక్తిపరిచే గ్యారంటీలు పొందటంలోను ఇతర ప్రజాతంత్ర సంస్థలతో కలిసి భారత దేశ మీడియా నిర్వహించిన చారిత్రాత్మక పాత్రను అమర్త్యసేన్ కొనియాడారు.

రెండు దశాబ్దాలుగా తీవ్ర దుష్ప్రభావాల్ని కలిగించిన నయా ఉదారవాద విధానాలను సవాలు చేసే వార్తలు, విశ్లేషణలు, వ్యాఖ్యానాల్ని భారత వార్తా పత్రికా పరిశ్రమను నిర్వహిస్తున్న అనేక శక్తులు బహిష్కరించాయి. ప్రధాన స్రవంతి పత్రికలు మరియు సమాచార టెలివిజన్ ఆ విధానాలను నెత్తికెత్తుకొని, వాటిపై వస్తున్న విమర్శల్ని, అభ్యంతరాల్ని ప్రచురణకు నోచుకోకుండా చేయటమో లేదా విమర్శల పదును తగ్గించడమో చేస్తున్నారు. సామాజిక ఆర్థిక ప్రతికూల ప్రభావాల్ని సెన్సార్ చేస్తున్నారు. ఆర్థిక నిపుణులతోపాటు ఈ విధానాలపై పటిష్టమైన విమర్శలు చేసే వారి గొంతుకలకు కూడా ప్రచురణలో స్థానం కల్పించడం లేదు. ప్రజల దైన్య స్థితుల వాస్తవాలను ప్రముఖంగా చెప్పటంకంటే 'అంతా బాగానే ఉంది" అన్న భావనకు ప్రచురణలలో ప్రాధాన్యతనివ్వాలని పత్రికా యజమానులు, ప్రకటనకర్తలు, మార్కెటింగ్ అధికా రులు, కార్పొరేట్ మేనేజర్లు, చివరకు సీనియర్ జర్నలిస్టుల నుండి కూడా భారతదేశ జర్నలిజం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నదని విమర్శకులు ఎత్తిచూపుతున్నారు. 'పేదరికం, ప్రత్యేకంగా గ్రామీణ పేదరికం, వార్తలకుగాని, సంపాదకీయాల కుగాని కథనా వస్తువుగా ఉండకలిగే అర్హత లేదంటున్నారు. పేదరికంలో ఉన్న యువకులకు, ఈ వార్తాసేకరణ వారి ఆకాం క్షల్ని ఎలా నెరవేర్చగలదని, వ్యాపార తాత్వికత నుండి ఉద్భవిం చిన వార్తాపత్రిక సంపాదకీయ తాత్వికత, ఆశావాదాలలో ఒకటి గా ఎలా మనగులుగుతందనే అంశాల గూర్చి భారతదేశ వార్తా పత్రికా ఎగ్జిక్యూటివ్లతో 'ఔలెట్ట' నిర్మొహమాటంగా జరిపిన సంభాషణల నుండి తెలుసుకొన్నారు. చెన్నైలోని ఆసియా స్కూల్ ఆఫ్ జర్నలిజం విద్యార్థులకు 2002 సంవత్సర స్నాతకోత్సవం సందర్భంగా ప్రముఖ ఆర్థికవేత్త ప్రభాత్ పట్నాయక్, 'మార్కెట్లు, నైతికత, మీడియా' అనే అంశంపై తన స్వతసిద్ధమైన, అసాధా రణమైన అవగాహనతో ప్రసంగించారు. ఆయన ఆ సందర్భం గా చేసిన ప్రసంగ పూర్తి పాఠం ఆన్‌లైన్‌లో లభ్యమౌతున్నది. ఇక్కడ దాని ముగింపును మాత్రం ప్రస్తావిస్తాను.

ఆర్థిక అంశాలకు సంబంధించి మీడియా శక్తిపై, పై ప్రసంగాన్ని మనం 'పట్నాయక్ చట్టం'గా అభివర్ణించవచ్చును. 'అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి, మీడియా ఒకే సరసన ఉన్నప్పు డు, మీడియా శక్తివంతంగా కనిపిస్తుంది. కానీ దానంతటదిగా మీడియా మానవ విలువల్ని సమర్థిస్తూ, పేదలు నిర్భాగ్యుల వేదనల్ని వాస్తవంగా వ్యక్తం చేసినప్పుడు అది శక్తి విహీనంగా కనిపిస్తుంది. ఈ శక్తి విహీనత ఒక ప్రక్రియ ద్వారా ఉద్భవిస్తుం దని ఆయన సూత్రీకరించారు. ఆర్థికవ్యవస్థపై అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ప్రాబల్యం సాధించడమే ఆ ప్రక్రియగా చెప్పా రు. వైరుధ్య పూర్వకమైన, గౌరవనీయమైన కొన్ని మినహాయిం పులు తప్పించి, స్థూలంగా ఈ ప్రాబల్యాన్ని మీడియా మనస్ఫూర్తిగా సమర్థిస్తున్నది. పేదరికం, సామూహిక నిరాకరణ, మౌలిక జీవనాధార సమస్యలు, ఈ సమస్యలపై ప్రభుత్వ విధానాల ప్రభావం, వ్యవసాయం స్థితిగతులు, గ్రామీణ సమస్య లు భారతదేశ వార్తాపత్రికల్లో, సమాచార టెలివిజన్‌లో అతి తక్కువస్థాయిలో ప్రచురణకు నోచుకుంటున్నాయి. పట్నాయక్ ప్రస్తావించిన 'గౌరవనీయ మినహాయింపులు' చాలా సార్థకమై నవి. గ్రామీణ దుస్థితి, రైతుల ఆత్మహత్యలు, సామూహిక వలసలులాంటి సామాజిక అంశాలపై పి. సాయినాథ్ పరిశోధన వ్యాసాలు, ప్రజాహితమైన, పరిశోధనాత్మకమైన, కార్యాచరణను రూపొందించే జర్నలిజం యొక్క విలువైన సాంప్రదాయాలకు కట్టుబడి ఉన్నాయి. ఇటువంటి జర్నలిజానికి విలువనివ్వకలిగే ప్రజా సంస్కృతిని నిర్మించగలిగి, ప్రతిభావంతమైన పై కృషికి వివిధ భారతీయ భాషల్లో ఈ అంశాలపైనే ఆదర్శ భావాలు గల యువ విలేకరుల రచనలు తోడైతే ప్రస్తుత సంక్లిష్ట స్థితినుండి బయటపడటానికి మార్గం దొరకగలదు.

భారత వార్తా పత్రికా రంగం చర్చలలో తరచూ ఉపేక్షింప బడుతున్న క్లిష్టమైన అంశం దగ్గరకు వచ్చాను. రెండురకాలైన పరిస్థితులు, వార్తా పత్రికా పరిశ్రమ అదృష్టాలు, జర్నలిజం స్థితి. ఈ రెంటిని కలుపకూడదు. యాజమాన్యాల ఆర్థిక రాజకీయ ప్రయోజనాల్ని నెరవేర్చడం కోసం వార్తల్ని, విశ్లేషణల్ని, వ్యాఖ్యానాల్ని మార్చుతున్నారు. (మిగతా 26లో)

# ఇప్పుడు మీడియా లేదు.. ఉన్నది మాఫియానే



ఎన్.వేణుగోపాల్
వీక్షణం పత్రిక సంపాదకులు

**రెండు రాష్ట్రాల్లో తెలుగు పత్రికలు ఏదైనా ఒకటి చదివితే వాస్తవం తెలియదు. ప్రతి ఒక్కరు రెండో మూడో పత్రికలు చదివి బిట్వీన్ ద లైన్స్ అర్థం చేసుకోవాలి. అందువల్ల కొందరు పత్రికలు చదవడం మానేశారు. ఆ తర్వాత వచ్చిన టెలివిజన్ ఒక 'మాదక ద్రవ్యం'. ఆపై విజృంభించిన సాంకేతిక పరిజ్ఞానం మేలు-కీడుల కలయిక.**

## దారిదీపం పత్రిక ఆవిష్కరణ సమావేశంలో..


కత్తి అంచున ఉన్న దేశ ప్రజలలో ప్రగతిశీల విశాల భావ జాలాన్నినింపేందుకు, సామాజిక చైతన్యం తెచ్చేందుకు పత్రికలు ప్రయత్నించాలని గత రెండు దశాబ్దాలుగా తెలుగులో ప్రత్యా మ్నాయ మీడియాగా ప్రఖ్యాతి పొందిన 'వీక్షణం' పత్రిక సంపా దకుడు ఎన్.వేణుగోపాల్ అన్నారు. మార్క్సిస్టు భావజాల వ్యాప్తి ధ్యేయంగా పెట్టుకున్న 'దారిదీపం' మాసపత్రికను శనివారం (అక్టోబర్ 1, 2022) సాయంత్రం జూమ్ సమావేశంలో వేణు గోపాల్ ఆవిష్కరించి ప్రసంగించారు. 'పత్రికలు-సామాజిక చైత న్యం' అనే అంశంపై ఆయన మాట్లాడుతూ ఈ శీర్షికలో ఉన్న రెండు పదాలూ (పత్రికలూ, సామాజిక చైతన్యం) దుష్ట సమా సంగా, విరోధ భాసలా ఇప్పు దున్నాయని ఆయన ఆవేదన వెలిబుచ్చారు. ఇప్పుడు మీడియా లేదు, ఉన్నది మాఫియానే అని స్పష్టం చేశారు. 1984లో తను జర్నలిజంలోకి అడుగు పెట్టిన పుడు 'ఆబ్జెక్టివ్ న్యూట్రాలిటీ' ముఖ్యమని జర్నలిజం మొదటి క్లాసులో హితవుగా చెప్పేవారని, ఇప్పుడు అది ఆవిరైపోయింది వేణుగోపాల్ చెప్పారు. వార్తలో ఉండాల్సిన 5 డబ్ల్యూ, 1 హెచ్ సూత్రంలో ముఖ్యమైన 'ఎందుకు' అన్న ప్రశ్నకు తావులేకుండా పత్రికలు వార్తలు నింపుతున్నాయని ఆవేదన వెలిబుచ్చారు. 1955 ఉప ఎన్నికల్లో రెండు ప్రధాన తెలుగు పత్రికల వైఖరి చూసి 'పెట్టుబడికి, కట్టు కథకు పుట్టిన విషపుత్రికలు-పత్రికలు' అని మహాకవి శ్రీశ్రీ చెప్పిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. 1960 నుంచి 80 వరకూ సామా జిక చైతన్యం కొద్దోగొప్పో ఉన్నా, 1990 నుంచి మూడు దశాబ్దాలుగా తిరోగమన పథంలో పత్రికలు పయనిస్తున్నాయని చెప్పారు.




ప్రపంచీకరణ తర్వాత తిరోగమనంలో పత్రికల ప్రయాణం సాగుతున్నదని, ప్రగతిశీలభావాలు ఉండడం చాదస్తంగా పరిగ ణింపబడుతున్నదని చెప్పారు. 'న్యూస్ పేపర్ ఈజ్ ఏ ప్రోడక్ట్, నాట్ ఏ సోషల్ సర్వీస్' అని వక్కాణించిన తాను పనిచేసిన పత్రిక యజమాని మాటలు ఉటంకిస్తూ-రెండు రాష్ట్రాల్లో తెలుగు పత్రికల ధోరణులను ప్రస్తావించారు. "ఏదైనా ఒక పత్రిక చదివితే వాస్తవం తెలియదు. ప్రతి ఒక్కరు రెండో మూడో పత్రికలు చదివి బిట్వీన్ ద లైన్స్ అర్థం చేసుకోవాలి. ఇందువల్ల కొందరు పత్రికలు చదవడం మానేశారు," అని వేణుగోపాల్ చెప్పారు. ఆ తర్వాత వచ్చిన టెలివిజన్ ఒక 'మాదక ద్రవ్యం' అనీ, తర్వాత విజృంభించిన సాంకేతిక పరిజ్ఞానం మేలు-కీడుల కలయిక అన్నారు. "టెక్నాలజీ వచ్చి రచనను ప్రజాస్వామీక రించి మేలు చేసింది. కానీ అనియంత్రిత వ్యక్తీకరణ వల్ల కీడు జరిగింది. అన్ని రాజకీయ పార్టీలు వెబ్‌లో అబద్ధాలపై బాగా వెచ్చిస్తూ పెద్ద పెద్ద కార్యాలయాలను నెలకొల్పడంతో మహా సముద్రంలో గుక్కెడు మంచినీళ్లు దొరకని నావికుడికిలా పాఠకు డయ్యారని అభిప్రాయపడ్డారు. ఈ నిరంతర వార్తా స్రవంతిలో మొత్తం మురికినీరేనన్నారు.

రెండు దశాబ్దాలుగా తాము ఎన్నో ఒడిదొడుకుల మధ్య నిర్వహిస్తున్న 'వీక్షణం' పత్రికకు ఉన్న మూడు లక్ష్యాలను (1. ప్రధాన వార్తా స్రవంతి లో వస్తున్న వార్త ల వెనుక ప్రజా కోణాలు ప్రస్తావించడం 2. ప్రచార సాధనాల మౌనం వహిస్తున్న, విస్మరిస్తున్న ప్రజాకోణాలు చర్చించడం 3) సామాజిక ఘటనలను అర్థం (మిగతా 25లో)

# కారు చీకట్లో దారిదీపం



ఆర్వీ రామారావు
విశాలాంధ్ర సంపాదకులు

**దారిదీపం పత్రిక ఆవిష్కరణ సమావేశంలో..**

గత ఎనిమిదేళ్లపై నుంచి మనం చీకట్లోకి ప్రయాణించేట్టు చేస్తున్నారు. ఈ దశలో డి.వి.వి.ఎస్.వర్మ సంపాదకత్వంలో "దారి దీపం" పత్రిక వెలువడడం కారు చీకట్లో కాంతి రేఖలా ఉంది. ప్రజలను అంధకారంలోంచి జ్వాజ్వల్యమానమైన వెలుగు లోకి ప్రయాణించేట్టు చేయడం ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో సులభ సాధ్యమైన వ్యవహారం కాదు. అంత మాత్రం చేత వెలుతురు వైపు నడవడం ఆపేయలేం. ఆపేయకూడదు కూడా. ఈ పత్రిక ద్వారా వర్మ గారు జనానికి దారి చూపించడానికి దారిదీపం పట్టుకుని బయలుదేరారు. ఇంతకు ముందు ఆయన దాదాపు వరసగా రెండేళ్లపాటు 'జాతీయ స్ఫూర్తి' పత్రికను ఉత్తమ ప్రమా ణాలతో తీసుకొచ్చారు. ఈ మధ్య అది అనివార్య పరిస్థితుల్లో ఆగిపోయింది. అయినా వర్మ గారు తన అన్వేషణ, ప్రయత్నం ఆపడానికి సిద్ధంగా లేరు. ప్రధానమైన పత్రికలన్నీ జనానికి సమాచారం అందించడం మానేసి చాలా కాలం అయింది. సమాచారానికి, వ్యాఖ్యానానికి మధ్య ఉండవలసిన గీత చెరిగి పోయి చాలా కాలం గడిచింది. ఇటీవల కాలం దాకా వర్మ గారి సంపాదకత్వంలో వెలువడిన జాతీయస్ఫూర్తికి సుదీర్ఘ చరిత్రే ఉంది. దాదాపు రెండు, రెండున్నర దశాబ్దాల కిందటే ఆయన జాతీయ స్ఫూర్తి పత్రిక తీసుకొచ్చారు. మధ్య మధ్యలో అది కనిపించకుండాపోయి నా వర్మ గారి ప్రయాణం, అన్వేషణ ఆగలేదు. రెండు రెండున్నర దశాబ్దాల కిందట వర్మ గారి సంపాదకత్వంలో వెలువడిన జాతీయ స్ఫూర్తి పత్రిక ఆవిష్కరణోత్సవంలో నేను, రాఘవాచా రిగారూ పాల్గొన్నాం. సరిగ్గా గుర్తు లేదు కానీ మా ఇద్దరిలో ఒకరం అధ్యక్షు లుగా, మరొకరం జాతీయ స్ఫూర్తి ఆవి ష్కర్తగా ఉన్నాం. మొన్న మొన్నటి దాకా వెలువడి కారణాంతరాల వల్ల ఆగిపోయి న జాతీయ స్ఫూర్తి అంతకుముందు చేసిన ప్రయత్నంకన్నా అనేక రెట్లు మెరుగైంది. సాంకేతిక పరిజ్ఞానంలో వచ్చిన మార్పు లను ఆ పత్రిక సంపాదకవర్గం సంపూర్ణంగా వినియోగించు కుంది. పత్రికలో ఉండే సరుకూ రాటు దేరింది. ఆ సమయంలో నాలుగైదు ప్రత్యేక సంచికలు వెలువరించారు. గ్రాంసీ, ఏంగెల్స్ ప్రత్యేక సంచికలు, మార్క్స్ మీద రెండు ప్రత్యేక సంచికలు వెలువడ్డాయి. కరోనా కష్ట కాలంలోనూ వర్మ గారు తన పని ఆపలేదు. ఆ సమయంలోనే రాంభట్ల శత జయంతి సందర్భంగా ఓ ప్రత్యేక సంచిక డిజిటల్ రూపంలో

> **పత్రిక నడపడానికి సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగపడే మాట వాస్తవమే. కానీ కేవలం సాంకేతిక పరిజ్ఞానం మీదే ఆధారపడితే అది చూడడానికి సర్వాంగ సుందరంగా కనిపించవచ్చు. కానీ అందులో ఉన్న సరంజామా సైతం సుదీర్ఘ కాలం ఉపయోగపడాలంటే సంపాదకవర్గానికి తమ పత్రిక ఎలా ఉండాలో కచ్చితమైన ప్రణాళిక ఉండాలి. ఆ ప్రణాళిక ఎలా ఉండాలో వర్మ గారికి ఆయన మిత్ర బృందానికి క్షుణ్ణంగా తెలుసు.**

వెలువరించారు. అది అచ్చులో లేదన్నదొక్కటే లోటు. పత్రిక నడపడానికి సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగపడే మాట వాస్తవమే కానీ కేవలం సాంకేతిక పరిజ్ఞానం మీదే ఆధారపడితే అది చూడడానికి సర్వాంగ సుందరంగా కనిపించవచ్చు. కానీ అందులో ఉన్న సరంజామా సైతం సుదీర్ఘ కాలం ఉపయోగపడాలంటే సంపాదకవర్గానికి తమ పత్రిక ఎలా ఉండాలో కచ్చితమైన ప్రణాళిక ఉండాలి. ఆ ప్రణాళిక ఎలా ఉండాలో వర్మ గారికి ఆయన మిత్ర బృందానికి క్షుణ్ణంగా తెలుసు. సాంకేతిక పరిజ్ఞానం పత్రికా నిర్వాహకుల పని సులభ తరం చేయడానికి మాత్రం ఉపకరించాలి. కంప్యూటరీకరణ సంపూర్ణంగా పత్రికా రంగంలో అందుబాటులోకి రాక ముందే ప్రసిద్ధ జర్నలిస్టు మానికొండ చలపతిరావు బంగారం లాంటి మాట చెప్పారు. "ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పత్రికను సర్వాంగ సుందరంగా అలంకరించడానికి చాలా ఉపయోగ పడ్తుంది. కానీ దాని ఆత్మకు తీవ్ర ప్రమాదం పొంచి ఉంది" అని అన్నారు. ఇప్పుడు మన పత్రికా రంగం ఆయన భయపడ్డ దశలోనే ఉంది. ఇది నిజానికి చలపతి రావు భవిష్యద్దర్శనంతో చేసిన హెచ్చరిక. ఇవాళ చాలా పత్రికలకు రంగులు, హంగులు, ఆర్భాటాలు బాగానే సమకూరాయి. కానీ అనేక పత్రికల్లో ఎంత వెతికినా ఆత్మ కనిపించడం లేదు. వర్మ గారు పత్రిక నిర్వహిం చడంలో అవసరం మేరకు సాంకేతిక పరిజ్ఞాన్ని వినియోగించు కుంటున్నా అందులో సమకూర్చే సరంజామా నిండా ఆత్మే

సాక్షాత్కరిస్తుంది. ఇది కేవలం వర్మ గారి ఆత్మ ఘోష కాదు. మనమే కాదు మన చుట్టూ ఉన్న వారు, మన సమాజం కూడా సుఖంగా, సవ్యంగా, సమాజానికి ఉపకరించే రీతిలో ఉండాలి అన్న సూత్రాన్ని వర్మ గారు నమ్ముతారు. ప్రజాభిప్రాయాన్ని మలచడానికి పత్రిక ఏ మేరకు ఉపయోగపడుతుందో ఆయనకు బాగా తెలుసు. ఆయన నా లాగా వృత్తి రీత్యా పత్రికా రచయిత కాదు. కేవలం అభిరుచి వల్లే ఆయన పత్రికా నిర్వహణ బాధ్యత స్వీకరించారు. సమాజాభ్యుదయాన్ని కాంక్షించే వారికి ఈ దారి దీపం కచ్చితంగా కాగడాలా ఉపయోగపడుతుందన్న నమ్మకం నాకు ఉంది. పత్రిక వ్యక్తి కృషి మీద ఆధార పడవలసిన వ్యవహారం కాదు అని ఈ పత్రికా నిర్వాహకులకు తెలుసు. ఏ పత్రికైనా సమష్టి కృషిని ప్రతిబింబించాలి. సమష్టి కృషిని ప్రతిబింబిస్తున్నాము అంటే మన ఆలోచనలను కలబోసుకుంటు న్నామనే. ఆ ఆలోచనలు సవ్యమైన దిశగా సాగాలి. సవ్యమైన మార్గం వామ పక్షమే అని ఎప్పుడో రుజువైంది. వామపక్ష వాదుల్లో భిన్నాభిప్రాయాలు ఉండొచ్చు. కానీ అవి ప్రజాస్వామ్య విధానంలో చర్చలకు తావివ్వాలి. అప్పుడు తప్పనిసరిగా సరైన దారేదో కనిపిస్తుంది. సమాజాన్ని యుగాల వెనక్కు తీసుకెళ్లా లన్న ప్రయత్నాలు ఎనిమిదేళ్ల కిందే మొదలు కాలేదు. ఎప్పటి నుంచో ఆ ధోరణ ఉంది. విలోమ చైతన్యాన్ని పనిగట్టుకుని ప్రోత్సహించే వారు ఎప్పుడూ ఉంటారు. ఇవ్వాళ మనం ప్రధాన స్రవంతి అనుకుం టున్న మీడియాలో ఆశాస్త్రీయ భావజాలాన్ని పనిగట్టుకుని ప్రచారంలో పెడ్తున్నారు. మరో వేపు మీడియా అభిప్రాయాలు మలచడం మానేసి అమ్మకం సరుకుగా మారిం ది. ఈ నేపథ్యంలో వర్మ గారు మరో దారిదీపం చేతబు చ్చుకుని ప్రయాణం సాగిస్తున్నారు. ఆయన జాతీయ స్ఫూర్తి నిర్వహించ డంవల్ల ఎంత చమురు వదిలిందో నాకు లెక్కలు తెలియవు కానీ సవ్యమైన దిశలో ఆలోచించి రాసే వారు అంటే మార్క్సిస్టు దృక్పథంతో అధ్యయనం చేసి రాసేవారు, సమాజలో వివిధ సందర్భాలలో మార్క్సిజాన్ని అనువర్తింపచేసి ముందుకు సాగుతూ రాసే వాళ్లు కనీసం 50–60 మంది తయారయ్యారు. ఇది కచ్చితంగా వర్మ గారి పత్రికా నిర్వహణ పద్ధతివల్లే సాధ్యం అయింది. చీకట్లు ఆవరిస్తున్నంత కాలం ఇలాంటి దారిదీపం అవసరం ఉంటుంది. ఆ దీపం వెలుతురు ఎటు ప్రసరింప చేయాలో వర్మ గారికి కచ్చితంగా తెలుసు. ఆ దారి దీపానికి ఎర్రెర్రని వందనాలు. సెలవు. ❑

## భారత పత్రికారంగం భవిష్యత్తేమిటి?

(23వ పేజీ తరువాయి)

ప్రముఖ వార్తా పత్రికలూ, వార్తా టెలివిజన్ సంస్థలలో సంపాదకీయ విషయాన్ని, సంపాదకీయ కార్యకలాపాల్ని తక్కువచేయడం, విలువలేకుండా చేయడం, మార్కెట్ పరిశోధన పేరుమీద క్రమపద్ధతిన నోరు మూయించడం చేస్తున్నారు. యాజమాన్యాలు, సీనియర్ మేనేజ్‌మెంట్ నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా సంపాదకీయాల స్థాయిని దిగజార్చే పద్ధతులను ఇష్టపూర్వకంగా అంగీకరించడం, సంపాదకీయ సమాచారం ముసుగులో అందించే అడ్వర్‌టైజ్‌మెంట్ సమాచారంలో వార్తలకు చెల్లించే వివరాలను పూర్తిగా ఇవ్వకపోవడం, అసలు ఇవ్వకపోవడం చేస్తున్నారు. ప్రైవేటు ఒప్పందాలు, ఎన్నికల ప్రచార వార్తలకు చెల్లింపులు స్వీకరించడం, అనుకూల వార్తల ప్రచురణలకు లంచాలు తీసుకోవడం, ఈ రకమైన పద్ధతులలో వార్తా పత్రికలూ, ఇతర వార్తా మీడియా వర్ధిల్లుతుంటే భారత దేశ మీడియా రంగం తీవ్రమైన అక్రమాలతో కూడిన అభివృద్ధిబాటలో పయనిస్తున్నదని భావించాల్సి వస్తున్నది. ❑

**(సీపీఐ(ఎం) వెబ్ సైట్ సౌజన్యంతో..)**

## ఇప్పుడు మీడియా లేదు.. ఉన్నది మాఫియానే

(24వ పేజీ తరువాయి)

చేసుకోనేలా ప్రజలకు దృక్పథం ఇవ్వడం) వివరించారు. “A good newspaper is a nation talking to itself Arthur Millerను కోట్ చేస్తూ– తప్పుడు చైతన్యాన్ని ప్రతిఘటించడం ఎలా? అన్నది సత్యానం తర యుగంలో పెద్ద సవాలన్నారు. యాజమాన్యపు కేంద్రీకరణ దుష్ప్రభావాన్ని వివరిస్తూ 90 శాతం మీడియా కేవలంనలుగురు ధనిక పారిశ్రామికవేత్తల చేతిలో ఉందని వేణుగోపాల్ చెప్పారు. విష విద్వేష భావజాలాన్ని పెంచుతున్న, పంచుతున్న సంఘ్ పరివార్ కమ్మేస్తున్న కారుచీకటిలో ‘దారిదీపం’ వెలుగు దివ్వె కావాలన్న అభిలాషను వెలిబుచ్చారు. కార్ల్ మర్క్స్ ఫ్రీ ప్రెస్ గురించి చెప్పిన ఈ కింది ఒక మంచి మాటతో వేణుగోపాల్ ప్రసంగం ముగిసింది.

The free Press is the ubiquitous vigilant eye of a people soul, the embodiment of a peoples faith in itself, the eloquent link that connects the individual with the State and the world, the embodied culture that transforms material struggles into intellectual struggles and idealises their crude material form. It is a peoples frank confession to itself... It is the spiritual mirror in which a people can see itself... It is the spirit of the State, which can be delivered into every cottage, cheaper than coal gas. It is all-sided, ubiquitous, omniscient. ❑

# వలస భారతదేశ చరిత్ర రచన.. విస్మరణకు గురైన ఉపశ్రేణులు




కొప్పర్తి వెంకటరమణమూర్తి
**చరిత్ర పరిశోధకులు**

**ఆంటోనియో గ్రాంసీ తొలిసారి చేసిన ఉపశ్రేణుల Subaltern Classes వర్గీకరణ నుంచి స్ఫూర్తి పొందిన చరిత్రకారుడు రంజిత్ గుహ వలస భారతదేశ చరిత్ర రచనలో విస్మరణకు గురైన ఉపశ్రేణుల మీద ఫోకస్ చేస్తూ రాసిన తొలివ్యాసం ఇది. జాతీయోద్యమ చరిత్రను ఉన్నత తరగతి దృష్టి నుంచి క్రింది తరగతుల మీదకు మొదటిసారి మళ్లించింది. మార్క్సిస్ట్ చరిత్ర రచన నుంచి భిన్నమైన మార్గం తీసుకుని ప్రపంచ వ్యాపితంగా సంచలనం సృష్టిస్తూ Subaltern Studies పేర 12 సంపుటాలుగా వెలువడిన పరిశోధనకు ఇది ప్రారంభం. సంక్షిప్తతకు, సమగ్రతకు, తులనాత్మక విమర్శకు గొప్ప ఉదాహరణ ఈ వ్యాసం.**

భారత జాతీయభావ చరిత్ర రచన చాలా కాలంపాటు శిష్టవర్గం (elite class) అధీనంలోనే నడచింది. ఈ వర్గంలో రెండు తరగతులు ఉన్నాయి. ఒకటి వలసవాద శిష్టవర్గం. రెండవది బూర్జువా జాతీయ శిష్టవర్గం. రెండూ భారతదేశంలో బ్రిటిష్ పాలనా ప్రతి ఫలనాలుగానే ప్రారంభమై, అధికార మార్పిడి తర్వాత కూడా కొనసాగి, మొదటిది ఇంగ్లండ్‌లో నయా వలసవాదంలోనూ, రెండవది ఇండియాలో నయా జాతీయ వాదంలోనూ విలీనమయ్యాయి. వలసవాద నయా వలసవాద శిష్టవర్గ చరిత్ర రచనలో ప్రధాన పాత్రధారులు బ్రిటీష్ రచయితలూ వ్యవస్థలూ అయినప్పటికీ వారిని అనుకరించే వారు ఇండియాలోనూ ఇతర దేశాల్లోనూ లేకపోలేదు. అట్లాగే, భారత జాతీయవాద నయా జాతీయవాద శిష్టవర్గ చరిత్ర రచన ప్రధానంగా భారతీయ విధానం అయినప్పటికీ దాన్ని అనుసరించే ఉదార చరిత్రకారులు బ్రిటన్‌లోనూ ఇతరచోట్లా ఉన్నారు.

2. అయితే ఈ రెండు వర్గాలూ భారత జాతిని నిర్మించడానికి అవసరమైన జాతీయ భావ చైతన్యాన్ని విస్తరింప చెయ్యడంలో శిష్టవర్గమే ప్రధాన భూమిక వహించిందనే దురభిమానానికి లోనయ్యాయి. వలసవాద నయావలసవాద చరిత్ర రచనేమో ఈ విజయాల్ని బ్రిటిష్ వలస పాలకులకు, విధానాలకు, వ్యవస్థలకు, సంస్కృతికీ కట్టబెట్టగా – జాతీయవాద నయా జాతీయవాద చరిత్ర రచన ఈ ఘనతను భారతదేశ శిష్టవర్గానికీ వారి భావాలకు, వ్యవస్థలకు, కార్యకలాపాలకు ఆపాదించింది.

3. ఈ రెండు వర్గాల్లో మొదటిది భారత జాతీయవాదాన్ని ప్రాథమికంగా ఒక ఉద్దీపనకు గురై జ్వలించిన వెలుగుగా మాత్రమే భావిస్తుంది. సంకుచితమైన ప్రవర్తనా దృక్పథం ఆధారంగా ఇది సమస్త జాతీయభావాన్ని వలసవాదం సృష్టించిన వ్యవస్థల, అవకా శాల, వనరుల పట్ల భారతీయ శిష్టవర్గ ప్రతిస్పందనల సారంగానే గుర్తిస్తుంది. ఈ చరిత్ర రచనలో అనేక పాయలు ఉన్నప్పటికీ అన్నిటి లోనూ ప్రధానంగా జాతీయభావాన్ని – దేశాన్ని పాలించడానికి వలస పాలకులు స్థాపించిన వ్యవస్థలతో శిష్టవర్గం సంభాషిస్తూ వ్యవహరించడం నేర్చుకునే క్రమంలో పుట్టిన భావజాలంగా చెప్పడం తప్పనిసరిగా ఉంటుంది. ఈ క్రమంలో దేశానికంతా వర్తించే మంచేదో జరగాలనే మహత్తర ఆశయం శిష్టవర్గానికి లేదనీ, వలస పాలన చేత సృష్టించబడి దానికే సంధానించబడిన సంపద, అధికారం, ప్రతిష్టల్లో భాగం పంచుకోవడాన్ని మాత్రమే ఆ వర్గం ఆశించిందంటుందీ చరిత్ర రచన. అంతేకాదు, ఇది అసలు భారత జాతీయవాదమే ఇటువంటి ప్రయోజనాల కోసం వలస పాలకులకూ జాతీయ శిష్టవర్గానికీ మధ్య, కొన్నిసార్లు శిష్టవర్గంలోనే భిన్న తరగతుల మధ్య ఏర్పడిన సహకారంలో నుంచీ, పోటీలో నుంచీ పుట్టిందంటుంది.



రంజిత్ గుహ


4. ఇక రెండవ చరిత్ర రచన భారత జాతీయభావాన్ని ప్రజల్ని పారతంత్ర్యం నుండి స్వాతంత్ర్యంవైపు స్వదేశీ మేధావులచే నడిపిం చబడిన ఒక ఉదాత్త ప్రయత్నంగా చెబుతుంది. ఈ చరిత్ర రచనలో కూడా అనేక పాఠాంతరాలు ఉన్నాయి. ఇవి వ్యక్తులు, నాయకులు, శిష్ట సంస్థలు నిర్వహించిన పాత్రల్ని నొక్కి చెప్పడంలో స్థాయీ బేధాల్ని చూపుతాయి. అయితే ఈ రకమైన చరిత్ర రచనలన్నిటిలో సామాన్యంగా కనిపించే లక్షణాలు కొన్ని ఉన్నాయి. అది వలస పాల న సృష్టించిన విద్వేషపూరితమైన వాతావరణానికి సమాధానంగా శిష్టవర్గం వ్యక్తం చేసిన అసాధారణ మానవీయ విలువలు, వలస పాలకుల దోపిడికి అణచివేతకు వ్యతిరేకంగా వారు ప్రదర్శించిన స్వార్థ రాహిత్యం, త్యాగ నిరతి, ఆత్మత్యాగాలను శ్లాఘిస్తాయి. అధికా రంలోనూ అవకాశాల్లోనూ భాగం పొందడానికి వారు వలస పాలనకు అందించిన సహకారంతో పోల్చినపుడు ఇవి మహత్తరమైనవని భావిస్తుందీ దృక్పథం. అట్లా, భారత జాతీయోద్యమ చరిత్ర అంతా భారత శిష్టవర్గ ఆత్మిక చరిత్రగా భావించబడింది.

5. శిష్టవర్గ చరిత్ర రచన వల్ల ప్రయోజనాలు పూర్తిగా లేకుం డా పోలేదు. అది మనకు వలస ప్రభుత్వ నిర్మాణాన్నీ, ప్రత్యేక చారిత్రక సందర్భాల్లో దాని అంగాలు పనిచేసే తీరునీ, దాన్ని కొనసాగించిన వర్గాల మధ్య కుదిరిన అమరికనీ అర్థం చేసు కోవడానికి ఉపయోగపడుతుంది. ఆ కాలానికి సంబంధించి శిష్టవర్గ దృక్పథమే ఆధిక్య దృక్పథంగా ఉండడంలోని మౌలిక తనీ, ఈ రెండు వర్గాల మధ్య ఉండే అలీన, సంలీన సందర్భా ల్లోని వైరుధ్యాల్నీ, సంక్లిష్టతల్నీ అర్థమయ్యేటట్టు చేస్తుంది. అట్లాగే బ్రిటిష్, ఇండియన్ వ్యవస్థల్నీ, ప్రముఖ వ్యక్తుల్నీ మరింత విశదం చేస్తుంది. అన్నిటినీమించి చరిత్ర రచనా శాస్త్రపు ప్రాథ మిక లక్షణాల్ని అవగతం చేస్తుంది.

6. ఏమైనా, ఈ రకమైన చరిత్ర రచన భారత జాతీయ భావాన్ని మనకు సరిగా వివరించలేకపోయింది. ఎందుకంటే జాతీయభావ ప్రాదుర్భావ విస్తరణల్లో శిష్టవర్గం ప్రమేయం లేకుండా తమంత తాముగా ప్రజలు నిర్వహించిన పాత్రను ఉటంకించడంలో కానీ, వ్యాఖ్యానించడంలో కానీ ఇది తీవ్రంగా విఫలమైంది. ఈ కోణంలో ఈ చరిత్ర రచన జాతీయభావ వ్యక్తీ కరణలో ప్రజా సమూహాల పాత్రను వివరించడంలో వైఫల్యం చెందిందనడానికి సందేహానికి తావు లేదు. పైగా దానిని శాంతి భద్రతల సమస్యగా ప్రతికూల వ్యాఖ్య చేసింది. మహా అయితే చరిష్మా ఉన్న శిష్టవర్గ నాయకుల పిలుపులకు కలిగిన ప్రతిస్పం దనలుగానో, కాకపోతే ప్రత్యేకించిన వర్గాల పోరులు గానో చూపించడానికి ప్రయత్నించింది. వేలలో లేక మిలియన్లలో భారత ప్రజలు పాల్గొన్న కార్యకలాపాలు ఆ విధంగా 'అసలైన' రాజకీయ పరిణామాలకు ప్రతికూల వ్యక్తీకరణలుగా లేదా రాజ్య యంత్రాంగాన్ని దారి మళ్లించిన సంఘటనలుగా మాత్రమే గుర్తించబడ్డాయి. లేదూ, ముందే చెప్పినట్టు శిష్టవర్గం ప్రారంభించి ప్రభావితం చేసిన చైతన్యానికి భావాత్మక ప్రతి ఫలనాలుగా వ్యాఖ్యానించ బడ్డాయి. శిష్టవర్గం ప్రభావం లేకుం డానే ప్రారంభమైన అనేకానేక ప్రజా ఉద్యమాల్లోంచి, మచ్చుకు, 1919 రౌలత్ చట్ట వ్యతిరేకోద్యమం, 1942 క్విట్ ఇండియా ఉద్యమాల గురించి ఈ నమూనాలో వ్యాఖ్యానించమన్నప్పుడు ఈ చరిత్ర రచన దివాళాకోరుతనం బయటపడుతుంది. చౌరీ చౌరా, లేదూ, రాయల్ ఇండియన్ నేవీ తిరుగుబాట్ల వంటి సంఘటనల్లో శిష్టవర్గ ప్రమేయం వల్ల అట్టడుగున స్థానభ్రంశం చెందిన ఆయా ఉద్యమ భావనల్ని అర్థం చేసుకోవడానికి ఈ ఏకపక్ష మసకబారిన దృక్పథం ఎట్లా ఉపయోగపడుతుందీ?

7. ఏ దృక్పథ ప్రభావం వల్ల రాజకీయాలు సంకుచితమై, పాక్షికమైన దృక్పథం కలిగి దానికే కట్టుబడి ఉన్నాయో ఆ దృక్పథాన్నే ఈ శిష్టవర్గ అసమగ్ర చరిత్ర రచన అనుసరించింది. ప్రాథమికంగా దేశాన్ని పాలించడానికి బ్రిటిష్ స్థాపించిన వ్యవస్థల, రూపొందించిన చట్టాల, విధానాల తీరుతెన్నులతో పాటు ఇతర ఉపరితలాంశాల ప్రమాణాలన్నీ ఈ తరహా చరిత్ర రచనలన్నిటిలో భారత రాజకీయాల ప్రమాణాలుగానే స్వీకరిం చబడ్డాయి. అందువల్ల ఇటువంటి నరం మెలితిరిగిన నిర్వచనం ఉన్న ఈ చరిత్ర రచన ఏ వర్గం కోసమైతే వలస పాలకులు వ్యవ స్థల్ని నిర్మించారో, ఏ శిష్టవర్గ మైతే ఆ వ్యవస్థల నిర్వహణలో ప్రత్యక్ష భాగస్వామ్యం కలిగి ఉన్నదో ఆ వర్గ భావనల, కార్య కలాపాల సారాన్నే దేశ రాజకీయాలుగా స్థిరపరచింది. ఈ రెండు వర్గాల పరస్పర లావాదేవీలే భారత జాతీయభావ స్వరూపమైంది. జాతీయోద్యమ రంగస్థలం భారత రాజకీయ వేదికగా మాత్రమే రూపుదాల్చింది.

8. ఈ అచారిత్రక చరిత్ర రచన నుంచి 'ప్రజల రాజకీయాలు' వదలి వేయబడ్డాయని స్పష్టంగా తెలుస్తోంది. శిష్టవర్గ రాజకీయ ఆవరణకు సమాంతరంగా భారత రాజకీయాల్లో వలస పాలన పొడవునా పాలకవర్గాలూ, స్వదేశీ ఆధిక్య వర్గాలూ కాకుండా శ్రామికజనంతో కూడిన ఉపశ్రేణులూ, పట్టణ గ్రామీణ ప్రాంత మధ్యతరగతి వర్గమూ ప్రధాన భూమిక వహించాయనేది దాచేస్తే దాగని సత్యం. ఇది స్వయం ప్రతిపత్తి కలిగిన ఆవరణ. ఇది శిష్టవర్గ రాజకీయాల నుంచి ఆవిర్భవించిందీ కాదు, అస్తి త్వం కోసం దానిపై ఆధారపడిందీ కాదు. వలసపాలనకు పూర్వ మే దీని మూలాలు ఉండడమనే ఒక్క అంశం తప్ప దీనిలో మిగిలినదంతా సంప్రదాయేతరమే! కాలానికనుగుణం కానిదం టూ ఇందులో ఏమీ లేదు. వలసవాదం చొచ్చుకు రావడంతో సంప్రదాయ శిష్టవర్గ రాజకీయాలు విచ్ఛిన్నం కావడమో నిర్వీర్యం అవడమో అయినట్లుగా కాక ఈ రాజకీయాలు




వలసవాదం వచ్చిన తర్వాత కూడా రూపం లోనూ, సారం లోనూ పరిస్థితులకు అనుగుణంగా తమను మార్చుకుంటూ ధాటిగా కొనసాగాయి. స్వదేశీ శిష్టవర్గ రాజకీయాలంత ఆధునికంగా ఉంటూనే ఇవి కాలికంగా, నిర్మాణపరంగా సాపేక్షమైన లోతును కలిగి ఉన్నాయి.

9.శిష్టవర్గ చరిత్ర రచన చేత విస్మరణకు గురైన ఈ రాజకీయాల ప్రధాన లక్షణం జన సమీకరణ. శిష్టవర్గ రాజకీయాల్లో సమూహాల పాత్ర నిలువు (vertical) గా సాగితే, ఉపశ్రేణి రాజకీయాల్లో అది క్షితిజం(అడ్డం) (horizontal) గా విస్తరించింది. శిష్టవర్గ రాజకీయాలు బ్రిటిష్ పార్లమెంటరీ విధానాలనూ, వలస పాలనా పూర్వ అర్ధభూస్వామ్య రాజకీయ అవశేషాలనూ పొందుపరచుకుంటూ సాగగా – ఉపశ్రేణి ఉద్య మాలు, పాల్గొన్న సమూహాల చైతన్య స్థాయిని బట్టి సంప్రదా యక రక్త సంబంధాల వ్యవస్థల, ప్రాంతీయ సరిహద్దుల, వర్గ సమీకరణల ఆధారంగా సంభవించాయి. శిష్టవర్గ సమీకరణ చట్టబద్ధంగా, రాజ్యాంగ దృక్పథంతో జరిగితే ఉపశ్రేణుల సమీ కరణ సాపేక్షంగా హింసాత్మకంగా విస్ఫోటనగా జరిగింది. మొదటిది మొత్తం మీద కడు జాగ్రత్తగా అదుపులో ఉంచబడు తూ ప్రారంభమైతే, రెండవది అసంకల్పితంగా సంభవించింది. సమూహాలు ఇట్లా ఉవ్వెత్తున ఎగసిపడడం రైతాంగ తిరుగుబాట్లలో సమగ్రంగా రూపుకట్టింది. ఏమైనా పట్టణాల్లో, నగర ప్రాంతాల్లో భారీ సమూహాలుగా శ్రామిక జనమూ దిగువ మధ్యతరగతీ పాల్గొన్న చారిత్రక సందర్భాలన్నిటిలోనూ సమీకరణకు స్ఫూర్తి రైతాంగ తిరుగుబాట్ల నుంచే వచ్చింది.

10. ఈ తరహా సైద్ధాంతిక దృక్పథం మొత్తంగా సమూహాల సామాజిక నిర్మాణంలోని వైవిధ్యాన్ని పట్టి ఇవ్వడమే కాక నిర్దిష్ట కాలంలో జరిగే నిర్దిష్ట సంఘటనలో పాల్గొనే సమూహాల్లో ప్రాధాన్యత గల వర్గాలు ఇతరులకు నాయకత్వం వహించడం కనిపిస్తుంది. ఈ భిన్నత్వం ఉన్నప్పటికీ ఇందులోని స్థిరమైన లక్షణం శిష్టవర్గ ఆధిక్యతను తిరస్కరించడం. ఈ ఆవరణలోని సామాజిక వర్గాలన్నిటిలోనూ సామాన్యంగా ఉన్న ఉపశ్రేణిత్వమే శిష్టవర్గ రాజకీయాల నుంచి దీన్ని వేరుపరుస్తున్నది. అయితే ఈ సైద్ధాంతికాంశం అన్ని సందర్భాలలో ఒకే స్థాయి నాణ్యతతో, సాంద్రతతో లేదు. మేలైన సందర్భాలన్నిటిలో ఉపశ్రేణి రాజకీయ చర్యలు పటిష్టంగా, కేంద్రీకృత దృష్టితోనే నడిచాయి. ఐతే వివిధ శ్రేణుల విరుద్ధ ప్రయోజనాలు ఈ ప్రజా ఉద్యమాల్ని కుదుపులకు లోను చెయ్యడమూ, అవి వీటి ఆర్థిక లక్ష్యాలను అపమార్గం పట్టించి శ్రేణుల మధ్య విభేదాలకు దారితీయడమూ, ఫలితంగా అవి ప్రజా ఉద్యమాల్లో వివిధ సమాన స్థాయి వర్గాల మధ్య ఏర్పడే సంకీర్ణత పట్ల చిన్న చూపు పడడానికి కారణం కావడమూ జరిగింది.

11. దోపిడికి గురైన కార్మికుల రైతుల వంటి ఉపశ్రేణుల్లోని ప్రధాన వర్గాల పరిస్థితులు మొదలుకొని పట్టణాల్లోని పారిశ్రామి కేతర పేదల శారీరకశ్రమ, దిగువ మధ్య తరగతి మేధోశ్రమ దాకా గుర్తింపుకు రావడం ఈ రాజకీయాల మరో ప్రత్యేక లక్షణం. శ్రమకూ దోపిడికీ గురైన అనుభవం ఈ రాజకీయాల్ని విలువలతో, విధానాలతో, జాతీయాలతో సంపన్నం చేసి శిష్టవర్గ రాజకీయాల్నుంచి వేరు పరచింది.

12.పై మూడు పేరాగ్రాఫ్‌లలో వివరించిన ప్రజారాజకీయాల ప్రత్యేక లక్షణాలు (వాటి పట్టిక ఎంత మాత్రమూ పూర్తికాలేదు) అక్కడ చెప్పినంత శుద్ధంగా ఆవిష్కరించబడలేదు. వాటిల్లోని సజీవ వైరుధ్యాలు చరిత్రలో అవి వాస్తవ రూపం పొందే క్రమం లో వాటిని సరిదిద్దాయి. అప్పటికీ, అనేక దిద్దుబాట్ల మధ్య కూడా అవి ఉపశ్రేణీ, శిష్టవర్గ రాజకీయ ఆవరణల మధ్య స్పష్టమైన రేఖను గీయగలిగాయి. ఈ రెండు ఆవరణల లేదా ప్రవాహాల సహ అస్తిత్వం భారతీయ బూర్జువా వర్గం జాతి తరఫున మాట్లాడడంలో విఫలమైందన్న చారిత్రక సత్యానికి సూచిక అయ్యింది. ప్రజాజీవితానికీ చైతన్యానికీ సంబంధించిన విస్తారమైన ఆవరణలను ఈ 'ఆధిపత్యం' తనలో కలుపుకోలేక పోయింది. దీని నుంచి ఆవిర్భవించిన నిర్మాణపరమైన 'ద్వంద్వం' భారతదేశ వలస పాలన చరిత్రకు మూలబిందువు. దీనిని ప్రక్కకు నెట్టి చరిత్రను వ్యాఖ్యానించ బూనుకునే వారెవరైనా అవాస్తవిక దోషం నుంచి తప్పించుకోలేరు. (మిగతా 32లో)

# సమాజం సైన్సు.. కొన్ని అంశాలు

మహ్మద్ అక్బర్

అన్ని సమాజాలలో ఉన్న ఉమ్మడి అంశం.. ప్రజలు రెండు ప్రధాన వర్గాలుగా చీలిపోయి ఉండటం. అవి 1) పాలించే వర్గాలు. 2) పాలింపబడే ప్రజలు. అయితే కొంత మేరకు అభివృద్ధి చెందిన దేశాలలో మధ్య తరగతి ప్రజలు కూడా ఉంటారు. పాలించే వర్గాలు సంఖ్య రీత్యా చాలా తక్కువగా ఉన్నప్పటికీ, మొత్తం సమాజాన్ని తమ ఆధిపత్యంలో ఉంచుకొని పరిపాలిస్తూ ఉంటారు. వారు రాజకీయ అధికారాన్ని రెండు విధాలుగా చెలాయిస్తారు.

**మొదటిది :** రాజకీయ అధికారంతో ప్రభుత్వ యంత్రాంగాన్ని (పోలీసు, సైన్యం, చట్టాలు, కోర్టులు...) నడిపిస్తూ, అణచివేత ద్వారా ఆధిపత్యాన్ని సాధించి పరిపాలన చేయటం. **రెండవది:** పాలిత వర్గము. అంటే పాలింపబడే ప్రజా సమూ హము. ఇది సంకరీత్యా పాలకవర్గంకంటే అనేక రెట్లు ఎక్కువ గా ఉంటుంది. పాలకవర్గం పాలింపబడే ప్రజల సమ్మతిని పొందటం ద్వారా, తమ పెత్తనాన్ని, అధికారాన్ని నిలుపుకుం టుంది. ఈ అసమ్మతి పైకి కనబడదు. నిగూఢంగా ఉంటుంది. విమర్శనాత్మకంగా పరిశీలిస్తేనే కనబడుతుంది.

రాజకీయ అధికారమనేది 'సగం మనిషి, సగం జంతువు లాంటిది' అన్నాడు ఆంటోనియో గ్రాంసీ మహాశయుడు. సగం నిర్బంధంతోనూ, మరో సగం స్వచ్ఛంద అంగీకారంతో పాలించ డం, అని దీని అర్థం. ప్రజల అంగీకారాన్ని, సమ్మతిని అనేక ప్రక్రియల ద్వారా పాలక వర్గాలు సాధిస్తాయి. ప్రజల సమ్మతిని వారు ఎలా సాధిస్తారు అనేది కీలకమైన అంశం. పాలక వర్గా లు, మరియు ధనవంతులు, పేరు ప్రతిష్టలు సంపాదించిన వారు. వారి జీవితాలు పెద్ద పెద్ద భవనాలలో, గొప్ప గొప్ప చదు వులతో, ఉన్నత ఉద్యోగాలతో ఆడంబరంగా ఉంటాయి. సామా న్య ప్రజలను ఇవి బాగా ఆకర్షిస్తాయి, ప్రభావితం చేస్తాయి. సామాన్య ప్రజలు సంపన్నుల మాదిరిగా జీవించాలని కలలు కంటూ ఉంటారు. కానీ అలా జరగదు. కారణం ఏమిటంటే సంపన్నుల జీవన విధానం, వారి ఆలోచనలు, సామాన్య ప్రజలకు అర్థం కాకుండా చేసే చాలా అడ్డంకులు ఉన్నాయి.

**అటువంటి అడ్డంకులలో కొన్ని :** మత సంస్థలు, రాజకీయ పార్టీలు, కార్మిక యూనియన్లు, ప్రచార సాధనాలు (పత్రికలు, టీవీ, సినిమా, సోషల్ మీడియా..) విద్యాసంస్థలు, ఆరోగ్య

**మనం ఆశావాదంతో పనిచేస్తూ, నిరాశవాదులను క్రమంగా మార్చే ప్రయత్నం చేస్తూ పోవాలి. సమా జంలో మంచి మార్పులు సాధించాలనుకున్నవారిని, దానికి వ్యతిరేకంగా పనిచేస్తున్న వారిని పరిశీలిస్తూ జాగ్రత్తగా అంచనా వేయాలి. నిరాశావాదానికి లోను కాకుండా ఈ పనులు చేయాలి. ప్రతికూల పరిస్థితుల ను పరిశీలిస్తూ, ప్రజలు వాటికి బందీలుగా కాకుండా జాగ్రత్తపడాలి. క్రమంగా పరిస్థితులను తమకు అను కూలంగా మార్చుకోగలమనే ఆశాభావంతో పనిచేయాలి.**

సంస్థలు, సాంస్కృతిక సంఘాలు, ఆర్థిక రంగం, వ్యాపార వాణి జ్యాలు, పరిశ్రమలు.. పైసంస్థలన్నీ కలిసి రాజ్యాలను/ ప్రభుత్వా లను ఏర్పాటుచేస్తాయి. ఇవి కాకుండా మిగిలిన వాటన్నింటినీ కలిపి, పౌర సమాజం అన్నారు గ్రామ్ సీ. పౌర సమాజంలో వ్యక్తులు, కుటుంబాలు, వాటి మధ్య ఉండే సామాజిక సంబం ధాలు ఉంటాయి. అయితే సామాజిక సంబంధాలు, ఉత్పత్తి సంబంధాలకంటే భిన్నమైనవి. కానీ, రాజ్యం/ ప్రభుత్వం వీటితో సంబంధం లేనిదిగా, ప్రత్యేకమైనదిగా ప్రవర్తిస్తుంది. ప్రజల స్వచ్ఛంద అంగీకారంతో పౌర సమాజం నడుస్తుంది. అందుకే గ్రామ్ సీ మహనీయుడు రాజ్యానికి, పౌర సమాజానికి మధ్య సంబంధాలను వివరిస్తూ, 'రాజ్యం అంటే నిర్బంధ విధానంతో కలిసి ఉన్న ప్రజల స్వచ్ఛంద సమ్మతి' అని నిర్వచించాడు. రాజ్యాధికారం, రాజ్యం/ప్రభుత్వంలో వ్యాపించి ఉన్నట్లే, పౌర సమాజం అంతటా వ్యాపించి ఉంటుంది. పౌర సమాజంలో సామాజిక సంబంధాలు, అధికార సంబంధాలుగా ఉంటాయి. రాజ్యం/ప్రభుత్వం పౌర సమాజం చుట్టూ రక్షణ కవచంలా ఉండి కాపాడుతూ ఉంటుంది. ఒకవేళ రాజ్యంలో ఏమైనా తిరు గుబాటు చెలరేగితే, పౌర సమాజానికి చెందిన రిజర్వు బలగాలు (అంటే ప్రభుత్వ మిత్రులు, సంస్థలు) రాజ్యానికి వచ్చిన ప్రమా దాన్ని ఎదుర్కొని కాపాడతాయి. పాలకవర్గాలకు అను కూలమైన అభిప్రాయాలను, ప్రజలలో కల్పిస్తాయి. వారు రాజ్యానికి అనుకూలమైన అభిప్రాయాలను ఎలా మారుస్తారో చూద్దాం.

**1.విద్యా వ్యవస్థ ద్వారా :** అత్యంత అభివృద్ధి చెందిన దేశాల

ను పరిశీలిస్తే, కార్మికుల పిల్లల్లో అత్యధికులు కార్మికులుగానే మిగిలిపోతున్నారు. మధ్య తరగతి పిల్లల్లో అత్యధికులు చిన్న ఉద్యోగాలే చేస్తున్నారు. సంపన్న వర్గాల పిల్లలు సంపన్నులుగా ఉంటున్నారు. అమెరికా వంటి దేశాల్లో జరిపిన సర్వేలు తెలుపుతున్నది ఏమంటే!! 'కుటుంబ నేపథ్యం' పిల్లలపై నిర్ణయాత్మక ప్రభావాన్ని కలిగించిందని వివరిస్తున్నాయి. ఆ పిల్లలు ఏ అసమానతలతో స్కూల్లో ప్రవేశిస్తున్నారో, అవే అసమానతలు స్కూల్ విద్య పూర్తయిన తర్వాత కూడా కొనసాగుతున్నాయని, 1996 'కోల్మన్' రిపోర్టు తెలియజేస్తున్నది. పాఠశాలలు, సాంస్కృతిక పునరుత్పత్తికి ఒక సాధనంగానూ, విధానంగాను ఉన్నదని విద్యావేత్తలు అంగీకరిస్తున్నారు. ఈ విధానంలో క్రింది వర్గాల పిల్లలు తాము పెద్దవారమైన తరువాత, అధిక వేతనాలు ఇచ్చే ఉద్యోగాలు గాని, ఉన్నతస్థాయిని గాని పొందలేమని కచ్చితంగా అంగీకరిస్తున్నారు. తమకు అంత తెలివిలేదని, తమ అల్పత్వాన్ని అంగీకరించి, తమంతట తామే క్రింది సామాజిక తరగతిలోకి వెళ్లేందుకు మానసికంగా సిద్ధపడుతున్నారు. పాలకవర్గాలు, ముఖ్యంగా పారిశ్రామికవేత్తలు పాఠశాలలు ఉంటేనే తమకు ప్రయోజనకరంగా ఉంటుందని భావిస్తారు. పాఠశాలలే పిల్లల మనసుల్లో పారిశ్రామికవేత్తలకు అవసరమైన విలువలను సృష్టిస్తూ, వారి ఆధిక్యతను సమర్ధించే సంస్కృతిని పాఠశాలలే కల్పిస్తాయి. చాలా కాలం నుండి పౌర సమాజంలో ఇదే తంతు కొనసాగుతున్నది. ఇప్పుడు కూడా.

**2).ఆరోగ్యం ఆరోగ్యం :** సైన్సు ఎంతో అభివృద్ధి చెందినప్పటికీ రోగ కారకాలను, అనారోగ్యాన్ని గుర్తించటానికి బదులు 'రోగాలు లేకపోవడమే ఆరోగ్యమని' డాక్టర్లు, మందులతో రోగాలు నయమై, ఆరోగ్యంగా ఉంటారని ఎక్కువమంది నమ్ముతున్నారు. ఆరోగ్యానికి సంబంధించిన ఈ ఆలోచనలు ఒక సంస్కృతిగా రూపొంది, ఈనాడు మందుల పరిశ్రమాధిపతులు విపరీతమైన లాభాలను కూడగట్టుకుంటున్నారు. ఉదాహరణకు కోవిడ్‌బి 19 సందర్భంగా బహుళ జాతి కంపెనీలు ప్రజలను విపరీతంగా దోచుకొని లక్షల కోట్ల సంపదను ఎలా చేజిక్కిచ్చుకున్నాయో మన కళ్ళ ముందు కనిపిస్తున్నది. 90 శాతం మందులు పనికిమాలినవని డాక్టర్లకు తెలిసినా, డాక్టర్లు వ్రాస్తున్నారని ప్రజలు కళ్ళు మూసుకొని మాత్రలు మింగే సంస్కృతి పెరిగి, మందుల కంపెనీలకు కోట్లాది రూపాయల లాభం తెచ్చి పెడుతున్నది.

పోషకాహారం లేక క్షీణించిన మహిళ బలానికి ఒక టానిక్కో మరియు ఇంజక్షన్‌నో రాయమని డాక్టర్లను అడగడం సహజమని ఎక్కువమంది భావిస్తున్నారు. తెలిసి కూడా డాక్టర్లు మోసాలకు పాల్పడుతున్నారా? కాదు. వారికి ఒక ప్రత్యేకమైన వైద్య విద్య బోధింపబడుతున్నదని మనం గ్రహించాలి. వైద్య విద్యా వ్యవస్థ, ఈ రకమైన డాక్టర్లను తయారుచేయటమే దీనికి కారణం. జనం ఈ మందుల సంస్కృతి అనే మందుల మాయాజాలంలో చిక్కుకొని, తమ సంతృప్తిని వెతుక్కుంటున్నారు. అలాగే జనాభా విస్ఫోటన సమస్యను, పేదల సెక్స్ సమస్యగా చూస్తున్నారు చాలామంది. నిజానికి పేదరికం, దానికి సంబంధించిన అనేక సమస్యల వల్లే పేద ప్రజలు ఎక్కువ పిల్లలను కోరుకుంటారు. ఎక్కువ పిల్లలు ఉంటే ఎక్కువ సంపాదిస్తారని, వృద్ధాప్యంలో ఎవరో ఒకరు ఆదు కుంటారని నమ్మకం పెట్టుకుంటారు. ఈ విధంగా అనేక సమస్యలు సంస్కృతితో, పేదరికంతో ముడిపడి ఉన్నాయి. అందువలన మనం సాంస్కృతికోద్యమంపై దృష్టి పెట్టాల్సిన అవసరం చాలా ఉన్నది.

**3).సంస్కృతి ప్రపంచీకరణ :** సంస్కృతి అనేది ప్రపంచీకరణకు ఒక ముసుకు గాను, ఒక ఖడ్గం గానో ఉన్నదని డాక్టర్ కేఎస్ పణిక్కల్ అభిప్రాయపడుతున్నారు. సంస్కృతి రెండు పాత్రలను పోషిస్తుందని పణిక్కల్ గారు అంటారు. మొదటగా అవి కొన్ని దేశాలు, ముఖ్యంగా అభివృద్ధి చెందిన దేశాలు కావాలని ప్రచారం చేస్తుంది. రెండోది అది ప్రపంచ పెట్టుబడిని, ప్రపంచ వ్యాప్తంగా విస్తరించేందుకు ఒక సాధనంగా పనిచేస్తుంది. సంస్కృతి అంటే వివిధ కళలు, సాహిత్యం, జీవిత విధానమే కాదు. అది ఒక ప్రత్యేక సామాజిక బృందం యొక్క భౌతిక సంపదను, నైతిక విలువలను, నియమ నిబంధనలను సూచిస్తుంది. సంస్కృతిలో మనం ఎక్కువ భాగాన్ని సంపన్న వర్గాల ప్రచార, ప్రసార మాధ్యమాల నుంచి మనకు తెలియకుండా, ప్రశ్నించకుండా అంగీకరిస్తాం. మనం ఏ సామాజిక బృందంలో నివసిస్తున్నామో, దాని నుంచే అత్యధిక శాతం సంస్కృతిని స్వీకరిస్తాం.

## ప్రపంచీకరణ ప్రధాన లక్ష్యాలు :

విదేశీ పెట్టుబడిదారులకు తలుపులు బార్లా తెరవడం, భారీ పరిశ్రమలను గరిష్టంగా లాభాలు పోగు చేసుకునేందుకు అనుమతించడం, పెట్టుబడులపై ఎలాంటి నియంత్రణలు లేకుండా స్వేచ్ఛా మార్కెట్లు రావడం వల్ల బహుళ జాతి సంస్థలు, గుత్తాధిపతులు దేశ వనరులలో అత్యధిక భాగాన్ని, తేలికగా అస్థగతం చేసుకుంటున్నారు. వారికి ప్రజల కష్టాలతో, బాధలతో పని ఉండదు. ఈ విధంగా చేయటం ఒక విధంగా వలస పాలనయే అవుతుంది. బ్రిటిష్ పాలనలో జరిగినట్టుగానే. ప్రపంచీకరణ సంస్కృతి ద్వారా ఎలా విస్తరించబడుతున్నది? ఎలక్ట్రానిక్ సాధనాల ద్వారా, టెలివిజన్ ద్వారా, సోషల్ మీడియా ద్వారా. రాజకీయంగా ప్రాధాన్యత గల మధ్యతరగతిని చూస్తే, రోజు రోజుకీ పెరుగుతున్న వినియోగదారి సంస్కృతిని అర్థం చేసుకోవచ్చు. ఉదాహరణకు అయోడైజ్ ఉప్పుపై చేస్తున్న

దుష్ప్రచారాన్ని చూద్దాం. సైన్సును మానవుల ప్రయోజనాలకు ఉపయోగించాలి. కానీ, దానిని స్వార్థపరశక్తులు ఎలా వ్యాపార మయం చేస్తారనేందుకు ఈ ప్రకటన ఒక చక్కటి తార్కాణం. ఆ ప్రకటనలో ఒక మహిళ రెండు రకాల అయో డైజ్డ్ ఉప్పు ప్యాకెట్లను తీసుకుని పోల్చి చెప్తుంది. ఒక రకం ఉప్పు పొడిపొడిగా ధారాళంగా కిందికి జారుతుంది. మరో రకం ముప్పు ముద్దగా అలాగే ఉంటుంది.ఆమె మహాశ్చర్యం వలకబోస్తుంది. ఒక దశలో చూసే వ్యక్తి ఈ ప్రకటన పక్షపాతంతో కూడుకున్నదని, ఇతర కంపెనీల ఉప్పును విమర్శించరాదని భావిస్తాడు. అతడు మొదటి మోసాన్ని గ్రహించినా, రెండో మోసానికి మాత్రం ఉప్పు జరజరా పొడిగా జారిపోవాలనే మోసానికి మాత్రం ఇష్టపడకుండానే బలైపోతాడు. ప్రపంచ సుందరి పోటీలకు మన టీవీ చానల్స్, పత్రికలు ఇస్తున్న పటాటోపాన్ని చూడండి. ఈ పోటీల ప్రచారం ముఖ్యంగా మన దేశంలాంటి వర్ధమాన దేశాలపైన ఎక్కుపెట్టబడింది. అందం గురించి భారతీయ భావననే మార్చివేసే యత్నంగా మనం దాన్ని చూడవచ్చు.

సంస్కృతిలో ప్రపంచీకరణ తెచ్చిన పెను మార్పు ఏమిటంటే అది ఒకే విధమైన, ఏకరూపత కలిగిన సంస్కృతిని రోజు రోజుకి పెంపొందింపచేయటం. ఇది అంతర్జాతీయ పెట్టుబడిదారులకు విశ్వవ్యాప్తంగా మార్కెట్లను సంపాదించి పెట్టేందుకు, కొత్త కొత్త రుచులు, కొత్త కొత్త అభిరుచులు, విలువలను సృష్టిస్తుంది. ధనవంతుడు కావడం గొప్ప విజయంగా అది చెబుతుంది. ఏ విధంగానైనా సరే డబ్బు పోగు చేసుకోవటమే జీవితంలో విజయం పొందటానికి మార్గంగా భావించబడుతుంది. డబ్బు సంపాదన పోటీలో అవినీతి ప్రధానంగా రాజ్యమేలుతున్నది.

**4) నైతిక, మేధోపరమైన సంస్కరణలు :** ప్రపంచీకరణ యొక్క స్వభావం, ఆధిక్యత భావం. దీన్ని ఎదిరించి పోరాడాలి. మనలోనే ఒక భాగంగా ఉన్నటువంటి ఈ విలువలకు వ్యతిరేకంగా ఎలా సంఘర్షించగలం? ఈ సమస్యపై గ్రామ్ సీ మహాశయుడు సమాధానం ఇచ్చారు. మనం నైతిక, మేధోపరమైన సంస్కరణోద్యమాన్ని నిర్వహిస్తేనే, ఈ ఆధిక్యత భావాన్ని బలహీనపరచగలం. దీనికి వ్యతిరేకంగా కార్మికులు, మార్పునుకోరే శక్తులు తమ ఆధిక్యత భావాన్ని వ్యాపింప చేయాలి. గ్రామ్ సీ చెప్పిన నైతిక, మేధోపరమైన సంస్కరణలను మనం సాంస్కృతి ఉద్యమంగా చెప్పవచ్చు. విలువలకు సంబంధించిన అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ప్రత్యామ్నాయ విధానాలను చూపించటం సంస్కృతి కోద్యమం చేయాలి.

ఈ ఉద్యమానికి సంబంధించి గ్రామ్ సి గారి అభిప్రాయాలు ఈ విధంగా ఉన్నాయి. ప్రతి వ్యక్తి, ఒక రకంగా తత్వవేత్త లేదా మేధావి. ప్రతి వ్యక్తికి తనదైన ఒక సిద్ధాంతం, ప్రపంచదృష్టి ఉంటుంది. తనకు తెలియకుండానే ప్రతి వ్యక్తి ప్రపంచం గురించి అభిప్రాయాలు ఏర్పరచుకుంటాడు. దీనినే గ్రామ్ సి 'సామాన్య జ్ఞానం' అంటారు. ఈ సామాన్య జ్ఞానాన్ని అతడు వ్యక్తిగతంగానూ, సామూహికంగానూ సంపాదించిన అనుభవ జ్ఞానం. ఇదే సాధారణ సాంస్కృతికగా రూపొందుతున్నది. దీనిలో పాలకవర్గాల ఆలోచనలు కలిసి ఉంటాయి. కార్మికుల సామాన్య జ్ఞానం, పాలకవర్గాల ఆలోచనలు, భావజాలంతో సంఘర్షణకు దిగుతుంది. వారు తమ సొంత అనుభవంతో పోరాటం చేస్తారు. సామాన్య జ్ఞానంలోనే పరిమితులను సరి చేస్తూ కృషిచేస్తేనే, సామాన్య జ్ఞానాన్ని మంచి జ్ఞానంగా మార్చగలం. పాలక వర్గాల మరియు స్వార్థపర వర్గాల ఆలోచనలు, సామాన్య ప్రజల ఆలోచనలకు వ్యతిరేకమనే విషయాన్ని మనం విస్తృతంగా ప్రచారం చేయటం ద్వారా మాత్రమే ముందుకు సాగగలం. సామాన్య ప్రజల అనుభవాలతో జతకల్పటం ద్వారానే, ప్రజలలో అంతర్గతంగా ఉన్న చైతన్యాన్ని మంచి మార్పు కోసం బయటకు తీసుకురాగలం. కొత్త వారితో నిరంతరం చర్చలు జరుపుతూ, వారితో కలిసి పనిచేస్తూ మనం ప్రత్యామ్నాయ విధానాన్ని రూపొందించుకోగలం.

**5). ప్రపంచీకరణ వ్యతిరేక, సాంస్కృతిక ఉద్యమం :** పాలకవర్గాల ఆధిక్యత, ఆలోచనలకు ప్రపంచీకరణ ఒక సాధనంగా ఉన్నదని చూశాం. దీనిని ఎదుర్కోవటానికి సాంస్కృతి కోద్యమంలో కార్యకర్త యొక్క నిర్వచనమూ, రూపం మారింది. పరిధి విస్తృతమైనది. అతడు ప్రశ్నించవలసిన విషయాలు ఎక్కువయ్యాయి. మన సమాజంలో ఉన్నత వర్గాల జీవన విధానాలలో, వారి విలువలను ఈనాటి సాంస్కృతిక కార్యకర్త ప్రశ్నించవచ్చు. అవి పౌర సమాజంలోని అంశాలను ఎలా ప్రభావితం చేస్తున్నాయో ప్రజలకు వివరించవచ్చు. ప్రత్యామ్నాయాలను చూపించవచ్చు. సాంస్కృతిక కార్యకర్త పాలకవర్గాల పట్ల, పాలిత వర్గాల ప్రజలకు ఉన్న భ్రమలను తొలగించటానికి కృషి చేయాలి. రాజ్య పాలకులలో, సామాన్య ప్రజలలో ఉన్న మానసిక కోపాలను అతడు విమర్శిస్తాడు. 'నియంతృత్వంలో ప్రజల ప్రతిఘటన కార్యక్రమాలు నియంత్రించబడతాయి. ప్రజాస్వామ్యంలో వారి ఆలోచనలే అడ్డుకోబడతాయని' విద్యావేత్త సోమ్స్‌కి పేర్కొన్నారు. మన కార్యకర్తలు యధాతథవాదాన్ని సమర్థించే విలువలను, ఆలోచనలను ప్రశ్నించాలి. అయితే అదే సమయంలో సాంస్కృతిక సృజనాత్మకకు పరిమితులు ఉంటాయని గమనించాలి.

**6).ఆశావాదమా, నిరాశ వాదమా? :** మనం ఆశావాదంతో పనిచేస్తూ, నిరాశ వాదులను క్రమంగా మార్చే ప్రయత్నం చేస్తూ పోవాలి. సమాజంలో మంచి మార్పులు సాధించాలనుకున్న వారిని, దానికి వ్యతిరేకంగా పనిచేస్తున్న వారిని పరిశీలిస్తూ

జాగ్రత్తగా అంచనా వేయాలి. నిరాశా వాదానికి లోను కాకుండా ఈ పనులు చేయాలి. ప్రతికూల పరిస్థితులను పరిశీలిస్తూ, ప్రజలు వాటికి బందీలుగా కాకుండా జాగ్రత్తపడాలి. క్రమంగా పరిస్థితులను తమకు అనుకూలంగా మార్చుకోగలమనే ఆశాభావంతో పనిచేయాలి. 20వ శతాబ్దంలో సైన్సు సాంకేతిక రంగాలలో జరిగిన అద్భుతమైన అభివృద్ధి మన జీవితాలను అనూహ్యంగా, సంపూర్ణంగా మార్చివేసింది. కానీ ఈ శతాబ్ది చివరలో మత శాంధసత్వం ప్రపంచమంతా వ్యాపించింది. దీనిని ఎదుర్కోవటానికి మనం ఏమి చేయాలో ఆలోచించాలి. ❑

(డాక్టర్ సుందర రామన్ గారి పుస్తకము ఆధారంగా)

## వలస భారతదేశ చరిత్ర రచన.. విస్మరణకు గురైన ఉపశ్రేణులు

(29వ పేజీ తరువాయి)

13. 'ద్వంద్వం' గురించి మాట్లాడుతున్నాం కాబట్టి ఈ రెండు ఆవరణలూ వేటికవి గాలి కూడా చొరబడనంతగా మూసివేయబడ్డాయనీ రెండిటి మధ్య అసలు మాటలే లేవనీ అర్థం కాదు. స్వదేశీ శిష్టవర్గం లోని ఆధునిక శక్తులు, ముఖ్యంగా బూర్జువా వర్గం ఎప్పటికప్పుడు రెండిటినీ కలిపే ప్రయత్నం చేసింది. ఆ ప్రయత్నాలు సామ్రాజ్యవాద వ్యతిరేక లక్షణాలు అటూ ఇటూ గానైనా ఉన్న పోరాటాల సమయంలో ఫలించినపుడు అవి నిరంతరాయంగా సాగి అద్భుత ఫలితాలనిచ్చాయి. కానీ సామ్రాజ్యవాద వ్యతిరేకత బలంగా లేనపుడో లేక ఆ లక్ష్యాన్ని ఉద్యమ గమనంలో కోల్పోయి చట్టబద్ధ, రాజ్యాంగబద్ధ, రాజీ పోరాటంగా మారినపుడో అది చీలికలై తిరుగులేని తిరోగమనానికి దారి తీసింది. శిష్టవర్గ, ఉపశ్రేణీ రాజకీయాల కలయికలో శిష్టవర్గంచే సమీకరించబడిన సమూహాలపై రెండు సందర్భాలలోనూ తమ లక్ష్యసాధన కోసం ఆధిక్యవర్గాల నుంచి తెగదెంపులు చేసుకునే విస్ఫోటన సందర్భాలకు దారితీశాయి. ఇవి ఉన్నత వర్గాలు ప్రారంభించే ప్రజారాజకీయాల నమూనాను తేటతెల్లం చేశాయి.

14. ఏమైనా, ఉపశ్రేణి రాజకీయాలు ఇచ్చిన ఆరంభాలు జాతీయోద్యమాన్ని పూర్తిస్థాయి జాతి విముక్తి పోరాటంగా మార్చగలిగిన బలాన్ని ఇవ్వలేక పోయాయి. కార్మికవర్గం తన సామాజిక స్వరూపాన్నీ, పరిస్థితుల్నీ యదార్థంగా అంచనా వెయ్యడంలో కానీ, రైతాంగంతో బలమైన బంధాన్ని ఏర్పరుచుకోవడం లోకానీ తగినంత పరిణతి, చైతన్యమూ చూపలేకపోయింది. ఫలితంగా, శిష్టవర్గం సాధ్యం చెయ్యడం విఫలమైన లక్ష్యాన్ని అందుకుని తానుగా చేరుకోలేకపోయింది. పర్యవసానంగా ఈ దశలో గాఢమైన వలస వ్యతిరేక చైతన్యంతో భారీ లక్ష్యాలతో ప్రారంభమైన అనేక రైతు ఉద్యమాలతోపాటు ఇతర పోరాటాలు తమను స్థానిక స్థాయి నుంచి జాతీయస్థాయి ఉద్యమాలుగా మార్చగలిగిన నాయకత్వం కోసం ఎదురుచూసి పొందలేక పోయాయి. జరిగిన సందర్భాల్లో కూడా కార్మికులు, రైతులు, పట్టణ పెట్టీ బూర్జువా వర్గాలు ఆర్థిక తత్వంలో చిక్కుకు పోయాయి. ఎక్కడైనా దాన్ని దాటుకుని రాజకీయ ఉద్యమాలుగా పరిణామం చెందితే అక్కడ విప్లవాత్మక నాయకత్వం కొరవడి చీలికలు పేలికలయ్యాయి.

15. వలస పాలనకు వ్యతిరేకంగాఒక నిర్ణయాత్మక విజయాన్ని సాధించడానికి అటు బూర్జువా వర్గానికి లేదా ఇటు శ్రామిక వర్గానికి సరిపడిన శక్తిలేదని విశదపరచిన ఈ అధ్యయనం జాతి జాతిని నిర్మించడంలో జరిగిన చరిత్రాత్మక వైఫల్యాన్ని కళ్ల ముందు నిలిపింది. అంతే కాదు, బూర్జువా వర్గ ఆధిపత్యంలో 19వ శతాబ్దపు సంప్రదాయ ప్రజాస్వామిక విప్లవాన్ని కానీ, కర్షక కార్మిక ఆధిపత్యంలో 'నూతన ప్రజాస్వామ్యాన్ని' కానీ సాధించలేకపోయింది. ఈ అధ్యయన వైఫల్యమే వలస భారత దేశ చరిత్ర రచనలో కేంద్ర సమస్య. కలుపు మొక్కలతో మాకు చింత లేదు. వేయి పువ్వులు మాత్రం వికసించాల్సిందే. శిష్టవర్గం సైతం తమ వ్యతిరేక ఉదాహరణల ద్వారా చరిత్ర వ్యతిరేక రచనేదో చెప్పాల్సి ఉంటుంది. శిష్టవర్గం నిర్మించిన కృత్రిమ అచారిత్రక లక్షణాల భారత జాతీయవాదాన్ని తిరస్కరించే ప్రత్యామ్నాయ ఆలోచనా విధానాన్ని నిర్మించడం ద్వారా ఆ చరిత్ర రచనను పూర్వపక్షం చెయ్యాల్సి ఉంది. శిష్టవర్గ, ఉపశ్రేణీ రాజకీయాల సహ అస్తిత్వాన్నీ, వాటి మధ్య సంభాషణనీ గుర్తించాలి.

16. వలస భారతదేశ రాజకీయ చరిత్ర రచన పట్ల, దాని నుంచి బయటపడే మార్గం పట్ల మాకున్న నిబద్ధతలో మేం ఏకాకులం కాదని మాకు తెలుసు. మాలాగే ఎంతో మంది రచయితలు, అధ్యాపకులు, విద్యార్థులు ఆధునిక భారత చరిత్ర రచనలోని శిష్టత్వం పట్ల అందులోని వాస్తవాల అణచివేత పట్ల నిరసన కలిగి ఉన్నారు. వారందరూ మేం పైన ఈ అంశం మీద చెప్పిన విషయాల్ని యథాతథంగా అంగీకరించకపోవచ్చు. కానీ ఆ దిశలో అనేక ఇతర చరిత్ర రచనాత్మక దృక్పథాలూ ఆచరణలు వచ్చి మేం నిలబడ్డ చోటున విలీనమౌతాయనే నమ్మకం మాకుంది. అటువంటి సంలీనాన్ని ప్రోత్సహించడమే మా ఈ అభిప్రా యాల్ని బయట పెట్టడానికి ప్రధాన కారణం. అది సాధ్యపడు తుందనే దృష్టిని కలిగించడం, ఆ అచరణను దృశ్యమానం చెయ్యడం తప్ప మేం వేరేమీ కోరుకోవడం లేదు. చర్చల ద్వారా మా అభిప్రాయాలతో ఏకీభవించేవారి ద్వారానే కాదు, మా విమర్శకుల ద్వారా కూడా మేం నేర్చుకోవడానికి సిద్ధంగా ఉన్నాం. ❑

# మానవ లక్షణం



**మర్ల విజయకుమార్**
**అఖిల భారత అభ్యుదయ వేదిక జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు.**

**మనుషులలో స్వార్థచింతన, స్వలాభాన్ని మాత్రమే ఆశించటం నేడు పరిపాటి అయిపోతోంది. ఇటువంటి లక్షణాలను ప్రదర్శించేవారిని ఒకనాడు ప్రత్యేకంగా ఎత్తిచూపి, ఊరి వారంతా విమర్శించేవారు. నేటి తరంలో, ఈ లక్షణాలను బహిరంగంగా ప్రదర్శించటం సర్వసాధారణం అయిపోయింది. తల్లిదండ్రులను వృద్ధాప్యంలో వారి ఖర్మానికి వారిని వదిలి వేయటం, లేదా కొంత దయతలిచి, వారిని వృద్ధాశ్రమాలలో వదిలివేసి చేతులు దులుపుకోవటం ఏ మాత్రం తప్పుగా ఈతరం భావించటం లేదు.**


'మానవజాతి పుట్టుక నుంచి అతనిలో స్వార్థం, దౌర్జన్యం, దురాశ తదితర లక్షణాలు ఉన్నాయి. వీటి కారణంగానే ఆదిమ మానవుడు ప్రకృతిలోని ఇతర జంతువులతో పోరాడి తన ఉనికిని నిలబెట్టుకున్నాడు. జీవితావసరాల కోసం పోటీ పడటం, తన లాభం కోసం ఇతరులను మోసం చెయ్యటం మానవుని సహజ లక్షణమైంది. దీని మూలాన, పెట్టుబడిదారీ వ్యవస్థ మానవ సమాజానికి అతి పొందికైనది, సహజమైనది' అని పెట్టుబడిదారీ మేధావులలో ఎక్కువ మంది భావిస్తారు. మానవజాతి ఉద్భవించిన తొలినాటి నుంచి అతనిలో ఉన్న ఈ లక్షణాలను మార్చాలనుకోవటం ప్రకృతి విరుద్ధమనీ, పెట్టుబడి దారీ వ్యవస్థను వ్యతిరేకించటం, దానిని మార్చి దాని స్థానంలో సమ సమాజాన్ని స్థాపించటం అసాధ్యమని వీరి వాదన. చరిత్ర తెలిసిన వారికెవరికైనా ఇటువంటి వాదనల డొల్లతనం అర్థం అవుతుంది. అసలు పెట్టుబడిదారీ వ్యవస్థ ఉనికిలోకి వచ్చిందే 34 వందల సంవత్సరాల క్రితమైతే, ఈ పైన వివరించిన లక్షణాలకు నిన్నగాక మొన్న వచ్చిన ఈ పెట్టుబడిదారీ వ్యవస్థ ఎట్లా మూల కారణం కాగలదు? దాదాపు 20 లక్షల ఏళ్ళుగా కోతి నుండి మానవ పరిణామం జరిగి, నేటి మానవ జాతి అయిన హెమో సెపియన్స్ ఉనికిలోకి వచ్చి 5, 6 లక్షల సంవత్సరాలు అయినట్లుగా మనకు దొరికిన అవశేషాలను బట్టి అర్థం అవుతోంది. దట్టమైన అడవులలో చెట్లపై నివసిస్తూ, నాలుగు కాళ్ళపై సంచరించే కోతి మానవునిగా రూపాంతరం చెందుతున్న క్రమంలో వాతావరణ మార్పుల కారణంగా తూర్పు ఆఫ్రికాలో అడవులు అంతరించిపోయి, పచ్చిక మైదానాలు ఏర్పడటంతో, వాటికి నేలపై సంచరిస్తూ ఆహారం కోసం వేటాడవలసి వచ్చింది. ఐదు అడుగులు, ఆపైకి పెరిగే పచ్చగడ్డి పైనుండి చూసి వేటాడే జంతువులను గుర్తించవలసిన అవసరం కారణంగా ఈ తొలి మానవులు రెండు కాళ్ళ మీద నిలబడి సంచరించవలసిన అవసరం ఏర్పడింది. జంతువులను గుర్తించిన తరువాత, ఇతరులకు సంజ్ఞలు చేయాల్సిన అవసరం కారణంగా భాష రూపుదిద్దుకుంది. పెద్ద జంతువులను వేటాడాలంటే, మందలోని మానవులందరూ ఒకరికి ఒకరు సహకరించుకోవాల్సిన అవసరం సహజంగానే ఏర్పడింది.

ప్రకృతిలోని జీవులన్నీ ఏదో ఒక పర్యావరణానికి అలవాటుపడి తమ శరీర లక్షణాలను అందుకు అనుగుణంగా తరాలు గడిచిన కొద్దీ మార్చుకుంటాయి. కాని మానవుని శరీర నిర్మాణం ఏ ఒక్క పర్యావరణానికి సరిపడేది కాదు. ఎక్కువ వేడిమిని కాని, చలిని కాని అతను తట్టుకోలేడు. ఆ ఆత్మ రక్షణకు అతనికి ఏ విధమైన శారీరక నిర్మాణం జరగలేదు. ఆ కారణంగా, మిగతా జంతువుల వలే అతడు బయట ప్రకృతిలో బతకలేడు. అతనికి గుంపులుగా గుహలలో జీవిస్తూ జంతువుల నుంచి ప్రకృతి వైపరీత్యాల నుంచి తమను తాము కాపాడుకోవలసిన అవసరం ఏర్పడింది. వేటాడిన జంతువుల కోసం, తినటానికి పదునైన గోళ్ళు కాని, కోరలు గాని అతనికి లేవు. అందుచేత రాళ్ళను పదును చేసి, వాటితో ఆహారాన్ని కోయటం, ముక్కలు చేయటం అలవర్చుకున్నాడు. చలి నుండి రక్షణకు జంతు చర్మాన్ని కప్పుకోవటం నేర్చుకున్నాడు. వేటాడిన, లేదా ఏరుకొచ్చిన ఆహారాన్ని తమ మందలోని అందరూ తమ అవసరాన్ని బట్టి పంచుకోవటం వారి తొలి లక్షణం. ఎవరికీ స్వంతం అయిన వస్తువులు ఉండేవి కాదు. ఉన్నవాటిని అవసరార్థం వాడుకోవటం ఆ దశ లక్షణం.

దీనినే మార్క్స్ ఏంగెల్స్‌లు ఆదిమ కమ్యూనిస్టు వ్యవస్థగా నిర్వచించారు. మానవ జాతి ఉనికిలో 95 శాతం కాలం ఈ విధంగానే గడిచింది. ఎప్పుడైతే వ్యవసాయం ప్రారంభమై, తమ అవసరానికి మించి ఆహారోత్పత్తి చేయటం ప్రారంభమైందో

అప్పుడు పని విభజన కూడా ప్రారంభమైంది. పండిన పంటను తన అధీనంలో పెట్టుకుని మిగతా వారందరి చేత పని చేయించుకునే విధానం, బానిస వ్యవస్థ అప్పుడే, అంటే దాదాపు 12 వేల ఏళ్ళ క్రితం నుంచే ప్రారంభమైంది. సంపద కోసం యుద్ధాలు చేయటం, తోటి మానవులను సంహరించటం, అసూయ, ద్వేషం, హింస అప్పటి నుండే ప్రారంభమయ్యాయి. మరొక మాటలో చెప్పాలంటే దోపిడీ సమాజం ఆవిర్భావం కారణంగానే మానవునిలో ఈ దుర్లక్షణాలు పొడచూపాయి. ఈ దుర్లక్షణాలన్నీ దోపిడీ చేసే సంపన్న వర్గాలలోనే ఎక్కువగా మనకు కనిపిస్తాయి సామాన్య మానవునికి జీవన్మరణ పోరాటంలో దోపిడీకి, మోసానికి గురికావటం తప్ప మరొక గత్యంతరం లేదు. ఈ వ్యవస్థలో ఇందుకు రుజువు కోసం ఎక్కడికో వెళ్ళనవసరం లేదు. ఒక మనిషి పేదవారు నివసించే మురికిపేటలో కళ్ళు తిరిగి పడిపోతే చుట్టుపక్కల వారంతా అతనికి సహాయం చేసి, అతనికి సేద దీరుస్తారు. అదే ధనికులు నివసించే ప్రాంతంలో రోడ్డుపై ఎవరైనా పడిపోయినా పెద్ద పెద్ద కార్లలో తిరిగే ధనికులు కనీసం అతడి వైపు అయినా చూడరు. మిగతా జంతువులు పుట్టిన మరుక్షణం నుంచే నడవటం ప్రారంభిస్తాయి. కొద్ది వయసు వచ్చేసరికి తమంత తాముగా బతకటం నేర్చుకుంటాయి. వాటి జీవ లక్షణాలు స్వతహాగా, తల్లితండ్రుల నుండి వాటికి సంక్రమిస్తాయి. కాని, మానవుడు దాదాపు తన బాల్యం అంతా, సమాజంపైన ఆధారపడి బతకాలి. సమాజం నుండి భాష, విజ్ఞానం, నీతి నియమాలు మొదలైనవి నేర్చుకున్నాకే అతడు తనంత తానుగా జీవించగలుగుతాడు. ఆ కారణం చేతనే మార్క్స్ 'మానవుడు తన చుట్టూ ఉండే సామాజిక సంబంధాల సంకలనం' అని నిర్వచించారు. అతని ఆలోచనలు సామాజిక సంబంధాల కారణంగా ఏర్పడినవే. సమాజంతో సంబంధం లేని మనిషికి నైతిక విలువలతో, ఆలోచనలతో ఆఖరికి భాషతో అవసరం ఉండదు.

ప్రకృతితో పోరాడి, దానిని జయించి, తన అవసరాలకు అనుగుణంగా మలచుకోవటం మానవుని ప్రథమ లక్షణం. అందుకోసం ఆ అడవులను నరికి, పంట పొలాలుగా మార్చి, వాటికి నీరు పెట్టి కఠోర శ్రమను వెచ్చిస్తాడు. ఈ శ్రమయే మానవుని ఉనికికి పునాదిరాయి వంటిది. శ్రమ చేసే లక్షణం కారణంగానే, కోతి నుండి మానవుడు ఉద్భవించాడని ఫ్రెడరిక్ ఎంగెల్స్ వివరించారు. అనేక శాస్త్రీయ పరిశోధనల కారణంగా, శ్రమ కారణంగా, మానవుని శారీరక నిర్మాణంలో మార్పులు చోటు చేసుకున్నాయనీ, శ్రమ చేసే క్రమంలో, అతను ఏర్పరుచుకునే సామాజిక సంబంధాల కారణంగా, అతనిలో భాష, ఆలోచనలు, ఆ తరువాత లిపి, కళలు తదితరాలు పుట్టుకొచ్చాయని నిర్ధారణ అయింది. తత్కారణంగా అతని




మెదడు త్వరితంగా అభివృద్ధి చెంది, మిగతా జంతుజాలం నుండి మానవుని వేరు చేసింది. ప్రకృతిలోని చాలా జాతులు జంతువులు శ్రమిస్తాయి.

ఉదాహరణకు సాలె పురుగు అతిసుందరమైన గూడును అల్లుతుంది. పక్షి తుఫానును కూడా తట్టుకోగల గూడును కడ్తుంది. కాని ఇవన్నీ ఈ పనిని తమ జీవ లక్షణంగా తమ స్వంత అవసర నిమిత్తం చేస్తాయి. లక్షల ఏళ్ళు గడిచినా ఆ జాతి చేసే ఈ పనిలో మార్పు ఉండదు. కాని, మానవుడు. తన చుట్టూ ఉండే అవసరాలను గుర్తించి, తాను చేయబోయే పనిని ముందుగా అంచనా వేసుకుని, కావలసిన పనిముట్లను, వస్తువులను ఒకచోట చేర్చి ఒక పథకం ప్రకారం తన పనిని పూర్తి చేస్తారు. తన పనిలో ఇతర మానవులు ఇచ్చే సలహాలను పరిగణలోకి తీసుకుని, తన నిర్మాణ పద్ధతిలో మార్పులు చేసుకుంటాడు. తన కోసమే కాకుండా సమాజ అవసరాల కోసం కూడా అతను శ్రమిస్తాడు. అంటే అతని పని సామాజిక అవసరాల కోసం, సమాజం నుండి అలవడిన విజ్ఞానం కారణంగా చెయ్యగలిగినదే. తన అనుభవాలను తరువాతి తరాలకు నేర్పటం ద్వారా, అతను సామాజిక విజ్ఞానానికి తన వంతు కృషి చేస్తాడు. చీమలు, తేనెటీగలు మరికొన్ని ఇతర కీటకాలు తమ గుంపు కోసం శ్రమిస్తాయి. కాని, అవి ఆ శ్రమను తమ సహజమైన జీవ లక్షణంగా నిర్వహిస్తాయి. కాని, వాటికి మేధస్సుతోను, కార్యకారణ సంబంధమైన తార్కికమైన ఆలోచనలతోనూ సంబంధం లేదు. ఈ లక్షణం ఒక్క మానవజాతిలోనే ఉన్నది. ఈ శ్రమానుక్రమం ఒక్క మానవ జాతిలో మాత్రమే జరుగుతుంది అంటే. మానవుని స్వభావం అతని లక్షణాలు అతను సమాజం కోసంచేసే ఉత్పత్తికి సంబంధించి మాత్రమే ఏర్పడతాయి. ఈ లక్షణాన్నే మార్క్స్ జీవ లక్షణంగా నిర్వచించారు. (జర్మన్ భాషలో గుట్టుంగ్స్ వేసెన్' తెలుగులో జీవ సారాంశం అని చెప్పుకోవచ్చు. అయితే ఈ తత్వశాస్త్ర పదానికి ఇతర భాషలలో సమగ్రమైన అనువాదం

ఇప్పటికి లేదు). మానవ సమాజంలో మార్పులు జరగటం చరిత్రక్రమంలో మనం గమనించాము. ఉత్పత్తి సంబంధాలలో వచ్చే మార్పులు తత్కారణంగా ఉత్పత్తి శక్తుల దోపిడీ శక్తుల మధ్యన పొడచూపే వైరుధ్యాల కారణంగా సమాజంలో మార్పు చోటు చేసుకుంటుంది. అందుచేత మానవ లక్షణమనేది. ఆర్థిక, సామాజిక వ్యవస్థలలో వస్తున్న మార్పు కారణంగా మార్పు చెందుతుంటుంది. ఆకలి వేస్తే ఆహారం కోసం వెదుకులాడటం, ఆపత్సమయంలో జాగరూకత, శారీరక అవసరాలు తదితరాలు మానవుని జీవలక్షణాలు. ఇవి ప్రతి జీవిలోనూ కనిపిస్తాయి. కాని, మానవుని సామాజిక లక్షణాలు సమాజం ద్వారా సంక్రమించినవే. సమాజం మారుతూ ఉంటే ఈ లక్షణాలు కూడా మార్పు చెందుతాయి. మానవునికి స్వతహాగా ఉన్న ఈ జీవలక్షణం కారణంగా అతను సామాజిక శ్రమలో ఆనందాన్ని, సంపూర్ణతను పొందుతాడు. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఈ శ్రమ అతనికి గుదిబండగా మారి బతుకు తెరువుకోసం మరొకరి లాభం కోసం చెయ్యవలసిన తప్పనిసరి శిక్షగా దిగజారిపోతుంది. తత్కారణంగా అతను శ్రమలోని ఆనందానికి దూరం అవుతాడు. తద్వారా జీవితం నుంచి తన పరిసరాల నుండి, ఆఖరికి తోటి మానవుల నుండి వేరు పడ్డట్లు అతను భావిస్తాడు. దీనినే మార్క్స్ 'పరాయీనత' అని అభివర్ణించారు. ఒక్క దోపిడీ రహితమైన సోషలిస్టు సమాజంలోనే మానవుడు తన పరాయినతా లక్షణాన్ని వదులుకొని, తిరిగి తన జీవ లక్షణమైన సామాజిక శ్రమ ద్వారా ఆనందాన్ని పొందగలుగుతాడు.

20వ శతాబ్దారంభంలో కొందరు పెట్టుబడిదారి మేధావులు, యూజెనిక్స్ పేరున ఒక ఉన్నత సిద్ధాంతాన్ని లేవదీశారు. తెల్లజాతివారు మాత్రమే తెలివితేటలు కలిగిన వారనీ, సగం జంతువులైన ఆసియా, ఆఫ్రికా, దక్షిణ అమెరికా ప్రజలపై వారు పెత్తనం చెలాయించటం సహజమైనదేననీ వీరి వాదన. మానవుని తెలివితేటలు కొలవటానికి వారు ఐక్యు పేరున ఒక కొలబద్దను తయారుచేసి, ఒక్క తెల్లజాతివారికి మాత్రమే ఈ ఐక్యు ఎక్కువగా ఉంటుందని వీరు వాదించారు. అడవిలో బ్రతికే ఒక ఆదివాసి అత్యంత ఒడుపుగా ఒక కుందేలును పట్టుకోగలగటానికి, పట్టణాలలో నివసించే యువకులు, ఒక గణిత సమస్యను పరిష్కరించటంలోనూ, ఒకే స్థాయి ఐ.క్యు ఉండవచ్చనే నిజం ఈ జాత్యాహంకార మేధావులకు అర్థం కాలేదు. నల్లజాతి వారికి బతికే హక్కు లేదని వారి సంతానోత్పత్తిని అరికట్టి, లేదా వారందరినీ సంహరించాలనీ, ఈ భూమిపై జీవించే హక్కు ఒక్క తెల్ల జాతి వారికి మాత్రమే ఉండాలని వీరివాదన. ఈ సిద్ధాంతం ప్రభావంతోనే హిట్లరు జర్మనీలో, యూదు మతస్థులను కమ్యూనిస్టులను కాంసంట్రేషన్ క్యాంపులలో నిర్బంధించి, చిత్రహింసలకు గురిచేసి, లక్షలాది



మందిని పొట్టను పెట్టుకున్నాడు. హిట్లరు దుశ్చర్యల కారణంగా ఈ యూజెనిక్స్ సిద్ధాంతం కొంతకాలం పాటు మరుగున పడినా ఈ కాలంలో మళ్ళీ ఎవల్యూషనరీ బియాలజీ (పరిణామ జీవ సిద్ధాంతం) పేరున పునర్జన్మ ఎత్తింది. మానవుని లక్షణాలు అతని జన్యువులలో ఇమిడి ఉంటాయని, స్త్రీ పురుషుల మధ్యన వివిధ జాతుల మధ్యన తమ చుట్టూ ఉండే పరిస్థితులపట్ల వారి స్పందన, వారి జన్యువులపై ఆధారపడి ఉంటుందనీ వీరు వాదిస్తున్నారు. జన్యుపరంగా ఏర్పడిన మానవ లక్షణాలను మార్చాలనుకోవటం సాధ్యమయే పనికాదని ప్రస్తుత పెట్టుబడిదారీ వ్యవస్థతో రాజీపడి బ్రతకటం నేర్చుకోవాలనీ వీరి ప్రబోధన. మానవుల మధ్యన అంతరాలు జన్యుపరమైనవి అయినప్పుడు ద్వేషం, స్వార్థం, దోపిడీ దురాశ లేని సమ సమాజాన్ని నిర్మించాలని ఆశించే వారికి జన్యులోపం కారణంగా ఈ విధమైన ఆలోచనలు పుట్టుకొచ్చాయని వీరి వాదన. జన్యుపరంగా వారికి సంక్రమించిన ఉన్నత లక్షణాల కారణంగా ధనికులు సమాజాన్ని ఏలగలుగుతున్నారని జన్యువులలో తెలివితేటలు లేక, పేదవారు ఎప్పటికీ పేదవారుగానే మిగిలిపోతారనీ ఈ యూజెనిక్స్ సిద్ధాంత వాదన. అందం, తెలివితేటలు, విజ్ఞాన సంపద తెల్లజాతి ఉన్నత వర్గాలకే స్వంతమనీ, వారే ఈ ప్రపంచాన్ని ఏలడానికి అర్హులని వీరు ప్రచారం చేస్తారు. ఈ పరిస్థితి ప్రకృతి పరమైనది కావున, దీనిని మార్చటం అసాధ్యమని వీరు వాదిస్తారు. 'ఇది పూర్తిగా అశాస్త్రీయమైన వాదన. అందం, తెలివితేటలు, నైపుణ్యం ప్రపంచం నలుమూలలా, అన్ని ప్రాంతాల ప్రజలలోనూ మనం గమనించవచ్చును. మానవ జన్యు పరిశోధన జరిపే శాస్త్రజ్ఞులు, జన్యువులకూ, మానవ స్వభావానికి ఏ విధమైన సంబంధం లేదనీ, మానవుని లక్షణాలు సామాజిక పరమైనవేననీ నిర్ధారించారు.

ఇది సరిగా మార్క్సిస్టు దృక్పథానికి బలం చేకూరుస్తోంది. సమాజ పరిస్థితులకు అనుగుణంగా మానవ విలువలు, లక్షణాలు మారుతుంటాయి. భూస్వామ్య సంబంధాలు ఉన్న సమాజంలో గ్రామీణ జీవనం, పరస్పర బంధాలు, కుటుంబ


**పెట్టుబడిదారీ వ్యవస్థలో మానవుడు పని బ్రతకటానికి తప్పనిసరి అయిన ఒక గుదిబండగా, ఒక శిక్షగా మారి, తను చేసే శ్రమ నుండి, తద్వారా సమాజం నుండి పరాయీనతను అనుభవిస్తాడు. సోషలిజం నిర్మాణంలో తిరిగి మానవునికి, ప్రకృతికి ఉన్న జీవ సంబంధాన్ని పునరుద్దరించి, శ్రమ దోపిడీని అరికట్టటంతో, ఈ లక్ష్యం సాకారమవుతుంది. అంటే, శ్రమ శక్తి దోపిడిని మొదటగా అంతం చేయవలసి ఉన్నది. చే గువేరా ఈ అంశాన్నే వివరిస్తూ, 'భౌతిక సంపద అభివృద్ధి మాత్రమే లక్ష్యంగా పెట్టుకుంటే, మనం దిక్కుతోచని స్థితికి దిగజారిపోతాము. పెట్టుబడిదారీ వ్యవస్థ నుండి వారసత్వంగా సంక్రమించిన దోపిడీ ఆర్థిక సంబంధాలను పట్టుకుని వేళ్ళాడితే, సోషలిజం ఒక కలగానే మిగిలిపోతుంది.**

విలువలు పెట్టుబడిదారీ వ్యవస్థ ఏర్పడేసరికి మారుతుండటం మనలో చాలా మంది మన జీవిత కాలంలోనే చూశాం. ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నం అయ్యాయి. ఇంటిలో పెద్దల పట్ల ఉండే గౌరవ, వినయ విధేయతలు రానురాను మాయం అయిపోతు న్నాయి. తల్లితండ్రులను వారి వృద్ధాప్యంలో దగ్గర పెట్టుకుని ప్రేమతో చూసుకోవాలనే సామాజిక నిబంధన నేడు కనుమరుగు అయిపోతోంది. మనుషులలో స్వార్ధచింతన, స్వలాభాన్ని మాత్రమే ఆశించటం నేడు పరిపాటి అయిపోతోంది. ఇటువంటి లక్షణాలను ప్రదర్శించేవారిని ఒకనాడు ప్రత్యేకంగా ఎత్తిచూపి, ఊరి వారంతా విమర్శించేవారు. నేటి తరంలో, ఈ లక్షణాలను బహిరంగంగా ప్రదర్శించటం సర్వసాధారణం అయిపోయింది. తల్లిదండ్రులను వృద్ధాప్యంలో వారి ఖర్మానికి వారిని వదిలి వేయటం, లేదా కొంత దయతలిచి, వారిని వృద్ధాశ్రమాలలో వదిలివేసి చేతులు దులుపుకోవటం ఏ మాత్రం తప్పుగా ఈతరం భావించటం లేదు. కంప్యూటర్లు, ఐ పేడ్ లు హెచ్‌డీ టీవీల, స్మార్ట్ ఫోన్ల నేటి ప్రపంచంలో తోటి మనిషిని పలకరించటంగాని, కనీసం పక్కన ఉన్న మనిషి ఉనికిని గుర్తించటం కాని జరగటంలేదు. పెద్దలు అడిగిన ప్రశ్నను విన్నా, విననట్లుగా ప్రవర్తించటం పిల్లలకు అలవాటయిపోయింది. ఇవన్ని మారుతున్న ఆర్థిక వ్యవస్థతో, మానవ లక్షణాలలో, విలువలలో వస్తున్న మార్పు. నేటి సమా జంలో మానవ సంబంధాలు ఆర్థికపరమైన సంబంధాలుగా దిగజారిపోతున్నాయి. పెట్టుబడిదారీ వర్గానికి ఈ మార్పు చాలా అవసరం. ప్రజలంతా శ్రమశక్తిని అమ్ముకుని బ్రతికే కూలీలు గానూ, పెట్టుబడిదారుడు మార్కెట్లోకి అమ్మకానికి పెట్టిన వస్తువు లను గుడ్డిగా కొనుగోలు చేసే యంత్రాలుగానూ మార్చివేయటం పెట్టుబడిదారీ వ్యవస్థకు అత్యవసరం. ప్రజలలో చైతన్యపూరి తమైన ఆలోచనలు తలెత్తకుండా విద్యా, పాలన, న్యాయ వ్యవ స్థలను, ప్రచార సాధనాలను వాడుకోవటం ఈ వ్యవస్థ మను గడకు వారికి అత్యవసరం. అందుచేత పెట్టుబడిదారీ మేధావు లు వాదిస్తున్నట్లు కాక, మానవ లక్షణం అనేది ఆర్థిక, సామజిక పరిస్థితులకు అనుగుణంగా మార్పు చెందుతుంటుంది. దోపిడీ రహిత సమాజమే మానవునికి అత్యంత సహజమైన సమాజం దోపిడీ రహిత సమ సమాజంలో మానవునికి స్వార్థం దురాశ, ఈర్ష్య వంటి నేటి దుర్గుణాలతో పని ఉండదు. తత్కారణంగా ఈ దుర్లక్షణాలు సోషలిస్టు వ్యవస్థలో అంతరింపచేయవచ్చును.

1844లో "ఎకనామిక్ అండ్ పొలిటికల్ మాన్యుస్క్రిప్ట్' గ్రంథంలో మార్క్స్ "సర్వతోముఖ సుసంపన్నమైన మానవ అభివృద్ధి సోషలిజం యొక్క గమ్యంగా ఉండాలని చెపుతూ, తన సామాజిక శ్రమ ద్వారా జీవితాన్ని సాఫల్యం చేసుకోగలిగిన స్థాయికి మానవులందరూ ఎదుగుతారని, జీవితంలోని అన్ని అంశాలలోనూ సంపూర్ణమయిన ఆనందాన్ని తన సామాజిక కృషి ద్వారా పొందగలుగుతారనీ, వివరించారు. మార్క్స్ రచన లలో సొంతం మానవునికి, ప్రకృతికి ఉన్న గతితార్కిక సంబం ధం ద్యోదకమవుతుంది. ప్రకృతి ప్రసాదించిన వనరులను ఉపయోగించి, తన శ్రమ శక్తిని వెచ్చించి, అతడు తన అవసరాలకు కావలసిన వస్తువులను ఉత్పత్తి చేసుకుంటాడు. పెట్టుబడిదారీ వ్యవస్థలో మానవుడు పని బ్రతకటానికి తప్పనిసరి అయిన ఒక గుదిబండగా, ఒక శిక్షగా మారి, తను చేసే శ్రమ నుండి, తద్వారా సమాజం నుండి పరాయీనతను అనుభవిస్తాడు. సోషలిజం నిర్మాణంలో తిరిగి మానవునికి, ప్రకృతికి ఉన్న జీవ సంబంధాన్ని పునరుద్దరించి, శ్రమ దోపిడీని అరికట్టటంతో, ఈ లక్ష్యం సాకారమవుతుంది. అంటే, శ్రమ శక్తి దోపిడిని మొదటగా అంతం చేయవలసి ఉన్నది.

చే గువేరా ఈ అంశాన్నే వివరిస్తూ, 'భౌతిక సంపద అభివృద్ధి మాత్రమే లక్ష్యంగా పెట్టుకుంటే, మనం దిక్కుతోచని స్థితికి దిగజారిపోతా ము. పెట్టుబడిదారీ వ్యవస్థ నుండి వారసత్వంగా సంక్రమించిన దోపిడీ ఆర్థిక సంబంధాలను పట్టుకుని వేళ్ళాడితే, సోషలిజం ఒక కలగానే మిగిలిపోతుంది. సంపద అంటే ఏమిటి? అన్న ప్రశ్నను లేవనెత్తి, మార్క్స్ గ్రుండ్రిస్సే గ్రంథంలో ఈ విధంగా వివరణ ఇచ్చారు 'మానవుల భౌతిక, సామాజిక, తాత్విక అవసరాలను సమర్ధవంతంగా పరిపుష్టం చేయటమే. అటువంటి సర్వతో ముఖాభివృద్ధికి అన్ని అడ్డంకులనూ తొలగించవలసి ఉన్నది. అట్లానే పెట్టుబడి గ్రంథంలో పెట్టుబడిదారీ వ్యవస్థలో శ్రామికులు పెట్టుబడి అవస రాలను తీర్చటం కోసం మాత్రమే తమ శ్రమను వెచ్చిస్తారు. దానికి బదులుగా, "తనకు, తన చుట్టూ ఉండే సమాజం యొక్క అవసరాలను తీర్చటం కోసం మానవుల శ్రమ వెచ్చింపబడాలి. ఇది పాత వ్యవస్థకు పూర్తి వ్యతిరేకమైన భావన. నిజమైన సంపద ఈ సర్వతోముఖ అభివృద్ధి మాత్రమే. ❑

# దండి తర్వాత అంతటి యాత్ర!



**వకుళాభరణం రామకృష్ణ**
విశ్రాంత ఆచార్యులు, హెచ్‌సీయూ

రైతు రక్షణ యాత్ర 1937 జూలై 3న ఉత్తరాంధ్రలోని ఇచ్ఛాపురం నుంచి ఆరంభమైంది. అక్కడి నుంచి రైతు గీతాలు ఆలాపిస్తూ , గౌతు లచ్చన్న తదితరులు వెంట రాగా ముందుకు సాగింది. గాంధీజీ నిర్వహించిన దండియాత్రను మినహాయిస్తే, ఇంతటి భారీ ఎత్తున జరిగిన ఘటన మరొకటి లేదని అంటారు! జాతీయోద్యమం ప్రజా ఉద్యమంగా రూపుదిద్దుకొంది. ఆ క్రమంలో ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన రెండు, మూడు ఉద్యమాల్లో.. పల్నాడు పుల్లరి సత్యాగ్రహం, చీరాల-పేరాల ప్రతిఘటనోద్యమం, పెదనందిపాడు రైతు ఉద్యమం చెప్పుకోదగ్గవి. 1930 దశకంలో జరిగిన చరిత్రాత్మక రైతు రక్షణ యాత్ర గణనీయమైనది. 9 నెలలపాటు కోస్తాంధ్ర ఉత్తర దిక్కు నుంచి మద్రాసు వరకు సాగిన ఈ యాత్ర (జూలై 1937-మార్చి 1938) చరిత్రాత్మకమైనది. ఈ యాత్ర పూర్వ రంగంగా 1936లో అఖిల భారత కిసాన్ సభ ఏర్పడింది. ఆంధ్రదేశంలో నీటి తీరువా పన్ను హెచ్చింపు, శిస్తు రెమిషన్, రీ సెటిల్‌మెంట్ తదితర రైతు సమస్యలపై జిల్లాల వారీ సభలు, సమావేశాలు, జమీందారీ వ్యతిరేక ఉద్యమాలు ఊపందుకున్నాయి. ఆంధ్ర రాష్ట్ర రైతు సంఘం 1937లో ఏర్పడి, ఆచార్య ఎన్.జి.రంగాను అధ్యక్షుడిగా ఎన్నుకొంది. ఆ తర్వాత కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి అధ్యక్షుడు. చలసాని వాసుదేవరావు కార్యదర్శి. అప్పటి నుంచి విస్పష్టమైన రైతాంగ పోరాటాలు మొదలయ్యాయి. గ్రామాల్లో రైతు సంఘాలు, భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు, జిల్లాలవారీ రైతు యాత్రలు జరిగాయి. ఆచార్య రంగా అభిప్రాయంలో ఈ యాత్రలు మద్రాసు రాష్ట్రంలో అనేక జిల్లాల్లో వార్షిక యాత్రలుగా ప్రసిద్ధికెక్కాయి. ప్రముఖ జాతీయ నాయకులు న్యాపతి సుబ్బారావు పంతులు, దండు నారాయణరాజు, మాగంటి బాపినీడు, ఓరుగంటి వెంకట సుబ్బయ్య, పుల్లెల శ్యామసుందరరావు, కల్లూరి సుబ్బారావు ప్రభృతులు ఈ యాత్రలో పాల్గొన్న ముఖ్యుల్లో కొందరు.

**రైతు రక్షణ యాత్ర**

ఆంధ్రదేశంలో పెల్లుబికిన రైతాంగ చైతన్యాన్ని ఒక నిర్దుష్ట మార్గంలో పెట్టేందుకు, కోస్తా ప్రాంతంలోని రైతుల్ని ఉద్యమ బాట పట్టించేందుకు ఆంధ్ర రైతు రక్షణ యాత్ర తోడ్పడింది. జమీందారీ వ్యవస్థను రద్దు వంటి రైతాంగ సమస్యలపై దృష్టి మరలింది. కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి(కాంగ్రెస్) నాయకుడిగా, చలసాని వాసుదేవరావు (కమ్యూనిస్టు పార్టీ) ఉప నాయకుడిగా వ్యవహరించారు. రైతు రక్షణ యాత్ర 1937 జూలై 3న ఉత్తరాంధ్రలోని ఇచ్ఛాపురం నుండి ఆరంభమైంది. అక్కడి నుంచి రైతు గీతాలు ఆలాపిస్తూ, గౌతు లచ్చన్న తదితరులు వెంట రాగా ముందుకు సాగింది.

**రైతుల 'మాగ్నా కార్టా'**

ఆంధ్రప్రదేశ్‌లో రైతు యాత్ర 7 జిల్లాలు, 130 రోజులు పర్యటించింది. అప్పట్లోనే 25 వేల మంది సంతకాలు సేకరించింది. ఎనిమిది వందల దరఖాస్తులు, మూడు వందల విజ్ఞాపన పత్రాలు, అరవై ఫిర్కా స్థాయి సభలు, 800ల గ్రామస్థాయి సభలు నిర్వహించి మద్రాసుకు చేరింది. గాంధీజీ నిర్వహించిన దండి యాత్రను మినహాయిస్తే, ఇంతటి భారీ ఎత్తున జరిగిన ఘటన మరొకటి లేదని పరిశీలకుల అభిప్రాయం. 1937 జూలైలో మొదలైన యాత్ర 1938 మార్చి అంతానికి మద్రాసు చేరింది. ప్రభుత్వానికి రైతు నేతలు సుదీర్ఘ సమగ్ర విజ్ఞాపన అందజేశారు. దీన్ని ఆంధ్ర దేశపు రైతుల సుదీర్ఘ, సమగ్ర దర్పణంగా భావించవచ్చు. రైతుల డిమాండ్‌లతో కూడిన 'మాగ్నాకార్టా' ఇది. "భూమిశిస్తు విధానం, ప్రకృతి వైపరీత్యాలు రైతులకు కృంగదీస్తున్నాయి. ఉద్యోగుల అవినీతి, లంచగొండితనం, పోలీసుల దౌర్జన్యం, జమీందారీ, ఇనాందారీ, మొఖాసా గ్రామాల్లో రైతుల స్థితిగతులు నరకప్రాయం. జమీందారుల పెత్తనం హద్దులు మీరింది. ప్రజలు అనారోగ్యం, అవిద్య, అజ్ఞానాలతో తల్లడిల్లిపోతున్నారు. ప్రజల భాషలో పాలన జరగాలి. వీటి నివారణకు చర్యలు చేపట్టాలి' అంటూ సాగింది. 1937 ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచి మంత్రివర్గం ఏర్పాటు చేసింది. ప్రజల కడగండ్లు గట్టెక్కుతాయని ఆశించారు. రుణ విమోచన చట్టం, మద్యపాన నిషేధం జరిగి ప్రజల్లో ఆశలు మొలకెత్తాయి. రైతుల్లో అపూర్వ సంచలనం, ఆశాభావం తొణికిసలాడింది. జిల్లా రైతు సభలు విజయవంతమయ్యాయి. టంగుటూరి ప్రకాశం పంతులు (రెవిన్యూ మంత్రి) ఆధ్వర్యంలో జమీందారీ విచారణ కమిటీ ఏర్పడి, అంతిమంగా జమీందారీ విధానం రద్దుకు ఈ యాత్ర నాంది పలికింది. 1948లో జమీందారి విధానం రద్దయింది. నేడు దేశంలో రైతాంగం అనేకానేక సమస్యలను ఎదుర్కొంటోంది. దిగుబడులు పెరిగినా, కనీస ధర లేకపోవడం, ప్రభుత్వాలు కొనడానికి ముందుకు రాకపోవడం, వ్యవసాయ ఖర్చులు విపరీతంగా పెరిగిపోవడం, ఇలాంటివి మరెన్నో. ఇటీవలి కాలంలో సాగిన రైతు వ్యతిరేక చట్టాల నిరసన మహోద్యమం (హర్యానా, పంజాబ్‌లలో) నేటి రైతాంగ స్థితి గతులకు అద్దం పడుతున్నది. ❑

# ఆకార్ పటేల్ - హైందవరాజ్యం



పుస్తక సమీక్ష :
ఎన్.వేణుగోపాల్

**ఆకార్ పటేల్ చేసిన సూత్రీకరణలన్నిటితో ఎవరైనా ఏకీభవించవచ్చు, విభేదించవచ్చు. కాని ఆధునిక భారత చరిత్రలో ఆధిపత్య, అధిక సంఖ్యాక మతతత్వం పెరుగుదల గురించి అన్వేషించడానికి, విశ్లేషించడానికి జరిగిన ఒక లోతైన, విస్తారమైన ప్రయత్నంగా ఈ పుస్తకాన్ని సగౌరవంగా ఆహ్వానించవలసి ఉంది. తీవ్రంగా అధ్యయనం చేసి, చర్చించి, ఈ అవగాహనలను మరింత పరిపుష్టం చేసి, విస్తృతంగా ప్రచారం చేయవలసి ఉంది.**

"మత నిరపేక్ష రాజ్యం" స్థితి నుంచి "అధిక సంఖ్యాక మత రాజ్యం" స్థితికి, "లౌకిక రాజ్యం" అనే రాజ్యాంగబద్ధ ఆదర్శం నుంచి నగ్నమైన హైందవ రాజ్యం (అంటే నిజానికి బ్రాహ్మణ్య, వర్ణాశ్రమ ధర్మ రాజ్యం) అనే వక్రీకరణకు మన దేశం ఎలా దిగజారిందనేది ఆలోచనాపరులందరినీ కలవరపరుస్తున్న ప్రశ్న. మరీ ముఖ్యంగా సంఘ పరివారానికి దేశ రాజకీయాలలో నానాటికీ పెరిగిపోయిన ఆధిపత్యం, చివరికి అది నరేంద్ర మోడీ, అమిత్ షాల వ్యక్తిగత, హింసాత్మక ఆధిపత్య రూపంలో వ్యక్తీకరణ పొందడం లోతుగా చారిత్రక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయార్థిక విశ్లేషణ చేయవలసిన అంశాలు. ఆ బృహత్తరమైన విశ్లేషణలో కొన్ని కోణాలు వదిలేసినప్పటికీ, మన హైందవ రాజ్యం విస్తరణకు ఉన్న కొన్ని ముఖ్యమైన కోణాలను విస్తారమైన సమాచారంతో కలిపి విశ్లేషించిన ఆకార్ పటేల్ రచన 'మన హైందవ రాజ్యం' దేశ పరిణామాల గురించి తీవ్రంగా ఆలోచిస్తున్న, ఆందోళన పడుతున్న వారందరూ తప్పనిసరిగా చదవవలసిన పుస్తకం.

పాత్రికేయుడు, పత్రికా రచయిత, అనువాదకుడు, గుజరాత్ మారణకాండ మీద పుస్తక సహరచయిత ఆకార్ పటేల్ సంఘ్ పరివార్ విష విద్వేష రాజకీయాలను నిరంతరం ప్రశ్నిస్తున్న విమర్శకుడిగా తెలుగు పాఠకులకు కూడా పరిచయమే. ఆ విమర్శ వల్ల విపరీతంగా నిందలకు, ట్రోలింగ్‌కు, ప్రభుత్వ సంస్థల నుంచి వేధింపులకు గురికావడం కూడా చాలా మందికి తెలిసిందే. ఆయన రాసిన Our Hindu Rashtra: What It Is. How We Got Here గత డిసెంబర్‌లో వెస్ట్ లాండ్ ప్రచురణగా వెలువడింది. ఇది అత్యవసరంగా తెలుగులోకి రావలసిన పుస్తకమే గాని, మామూలుగా తెలుగు ప్రచురణ రంగ ప్రమాణాలతో పోలిస్తే ఇంగ్లిష్‌లో వెలువడిన తొమ్మిది నెలల్లోనే తెలుగులోకి వచ్చిన పుస్తకాలు తక్కువే. కాని ఈ పుస్తకం చదవగానే డా. చెలికాని స్టాలిన్ గారు ఇది వెంటనే తెలుగు పాఠకులకు అందుబాటులోకి రావాలనుకున్నారు. తెలుగు అనువాదానికి ఎ.గాంధీ గారిని సంపాదకుడిగా ఎంచుకుని, పద్నాలుగు అధ్యాయాల పుస్తకాన్ని పదకొండు మంది అనువాదకులతో తెలుగు చేయించి డా.చెలికాని రామారావు మెమోరియల్ కమిటీ తరఫున సెప్టెంబర్ కల్లా ప్రచురించారు. తెలుగు పుస్తకానికి ఖరీదు కూడా పెట్టకుండా చదివే వారందరికీ, ఎవరు చదవడం అవసరమని తాను అనుకుంటున్నారో వారందరికీ అందజేస్తున్నారు.

ఈ పుస్తక రచనకు ఆకార్ పటేల్ ఎంచుకున్న నిర్మాణం విశిష్టమైనది. దేశ విభజన గురించి ఒక పరిచయ వ్యాసం తర్వాత, ఆయన నేరుగా భారత రాజకీయ చరిత్రలోకి, అది హైందవ రాజ్యంగా ఎలా మారుతూ వచ్చిందనే వివరాలలోకి వెళ్లలేదు. ఆ విషయాలలోకి వెళ్లే ముందు, రెండు అధ్యాయాలు దాదాపు యాభై పేజీలు, మొత్తం పుస్తకంలో ఆరో వంతు పాకిస్తాన్ రాజకీయ చరిత్రను వివరించారు. ఇది ఒక అద్భుతమైన ఎత్తుగడ. మామూలుగా పాకిస్తాన్ మతరాజ్యమనీ, భారతదేశం మతాతీత రాజ్యమనీ ఒక అపోహ, తప్పుడు అవగాహన మన విద్యావంతులందరిలోనూ సాధారణ లోక జ్ఞానం స్థాయిలో ఉంది, ఉంటుంది. కనుక ఆయన మొదట ఒక "మతరాజ్యపు" ఏడు దశాబ్దాల ప్రయాణాన్ని మన కళ్ల ముందు పరిచి, ఆ తర్వాత రెండు వందల యాభై పేజీలలో ఆ మత రాజ్యపు పరిణామాలూ, మన "మతాతీత రాజ్యపు" పరిణామాలూ ఎంతగా సరిసమానంగా, సమాంతరంగా సాగుతూ వచ్చాయో వివరించి మన "లౌకికత్వం" ఎంత డొల్ల సరుకో చూపారు.

ముందుగా పరిచయంలో "పొరుగున ఉన్న దేశాలకంటే మన దేశంలో అధిక సంఖ్యాకుల ఆధిపత్యం అనేది భిన్నంగా జరిగింది. కాని, పర్యవసానంలో మాత్రం తేడా లేదు" అనే అవగాహనను అందించడానికి చాలా వివరాలు, గణాంకాలు, చారిత్రక, సామాజిక ఘటనలు, వ్యక్తుల జీవిత పరిణామాలు ఎన్నో ప్రదర్శించారు. ఇది ప్రధానంగా హైందవ రాజ్యం గురించి చర్చించే పుస్తకం గనుక హిందుత్వను అనేక కోణాల నుంచి వివరించి, హిందుత్వ అనేది ఎలా భారతీయ జనతా పార్టీలో విడదీయరాని అంతర్భాగమో చూపారు. "అదొక నిశ్చిత భావజాలం. ఇంకా సరిగ్గా చెప్పాలంటే అదొక నిశ్చిత దురభిమానం. అది అల్ప సంఖ్యాకులకూ ముఖ్యంగా ముస్లింలకూ వ్యతిరేకమైన నిశ్చితమైన దురభిప్రాయం. బీజేపీ మార్చుకోని విషయం ఒకటే ఉంది. అది మైనారిటీల వ్యతిరేకతపై ఆధారపడిన ఎజెండా. హిందూత్వ హృదయ పీఠాన్ని అలంకరించింది అదే" అన్నారు.

పరిచయం తర్వాత మొదటి అధ్యాయం 'ఆవేశరహితంగా దేశ విభజన గురించి'. దేశ విభజన భావనలు, ద్విజాతి సిద్ధాంతం, మతాన్ని రాజకీయాలను కలపగూడదని జిన్నా తొలి రోజుల్లో చేసిన వాదనలు, లాలా లజపతిరాయ్, ఆ తర్వాతి కాంగ్రెస్ నాయకుల వాదనలు వంటి ఇరవయ్యో శతాబ్ది తొలి అర్ధభాగం చరిత్రనంతా సింహావలోకనం చేసి చరిత్రకారుడు కేకే అజీజ్ చూపిన ఒక కఠోర వాస్తవాన్ని ఉటంకించారు: 1858–1940 కాలంలో ముస్లింలకు ఒక వేరే దేశం ఉండాలని వచ్చిన మొత్తం 56 ప్రతిపాదనల్లో 34 ప్రతిపాదనలు ముస్లిమేతరులు చేసినవే. చివరికి దేశ విభజన ప్రతిపాదన తీవ్రాతితీవ్రంగా చర్చకు వచ్చిన 1931–40 కాలంలో వచ్చిన మొత్తం 33 ప్రతిపాదనల్లో 18 ప్రతిపాదనలు ముస్లిమేతరులవే. అంటే మామూలుగా జరుగుతున్నట్టుగా దేశ విభజన నెపం పూర్తిగా ముస్లింల మీదికి నెట్టివేయడానికి వీలులేదు. అందులో ఇతరుల పాత్ర, ప్రధానంగా ఆధిపత్య రాజకీయాల పాత్ర ఉంది. ఈ చారిత్రక వివరణ ఆధారంగా "ఒక వ్యక్తి ఆకస్మిక అభిమతం వల్ల గాని, ఒక పార్టీ బలహీనత వల్ల గాని, భారతమాతను విభజించి పాకిస్తాన్ ను ఏర్పాటు చేసుకోవాలని ముస్లింలు కోరుకోవడం వల్లగానీ జరిగింది కాదు. ప్రపంచంలోని అతి పెద్ద మత మైనారిటీకి రాజకీయ హక్కులు కల్పిస్తూ అధికారాన్ని పంచుకునే యంత్రాంగాన్ని నెలకొల్పుకోలేని కాంగ్రెస్ నాయకత్వంలోని భారతీయ హిందువుల వైఫల్యమే దేశ విభజన ఘట్టం చాటింది" అని నిర్ధారించారు.

ఆ తర్వాత రెండు అధ్యాయాలు జిన్నా కట్టిన ఇల్లు, ఇంటిని తగులబెట్టుకున్నారు, పాకిస్తాన్ ఎంచుకున్న మతరాజ్యం ఆ దేశపు రాజకీయ, సామాజిక వ్యవస్థలలో ఎటువంటి కల్లోలాన్ని సృష్టించిందో, ప్రజా జీవితాన్ని ఎలా అల్లకల్లోలం చేసిందో వివరాలు ఇచ్చారు.

ఈ పునాది మీద భారత రాజకీయాల పరిణామ క్రమాన్ని అధ్యయనం చేయడం ఆసక్తికరంగా ఉంటుంది. సంస్కృతి, మతం, జాతీయత, హిందుత్వ వంటి భావనల పట్ల సంఘ్ పరివార్ ఆది గురువులైన దీన్ దయాళ్ ఉపాధ్యాయ, ఎంఎస్ గోల్వాల్కర్, వినాయక్ సావర్కర్‌ల ఆలోచనలనూ, కార్యాచరణలనూ వివరంగా చూపుతూ ఎంతగా 'హిందుత్వపు గందరగోళ మంత్రాలు' రానున్న హైందవ మత రాజ్యానికి మార్గాన్ని సుగమం చేశాయో చూపారు. ఈ కాలంలోని జన సంఘ్ నుంచి 1970ల జనతా పార్టీ ప్రయోగం తర్వాత రూపొందిన భారతీయ జనతా పార్టీ వరకూ జరిగిన పరిణామాన్ని 'అప్పుడొచ్చాడు అద్వానీ' అధ్యాయంలో వివరించారు. ఈ స్థూల వివరణ తర్వాత బుజ్జగింపు సిద్ధాంతం, మత విధేయత, ముస్లింలను ఘెట్టోలకు, వెలివాడలకు పరిమితం చేయడానికి జరిగిన ప్రయత్నాలు, న్యాయవ్యవస్థ, ముఖ్యంగా సుప్రీంకోర్టు హిందుత్వవాదులకు లొంగిపోయి, తప్పుడు తీర్పులు ఇవ్వడం, బాబ్రీమసీదు వివాదం, ట్రిపుల్ తలాక్, కశ్మీర్, గోరక్షణ కపట రాజకీయాలు వంటి సంఘ పరివారపు, హిందుత్వపు ప్రధాన అంశాలన్నిటినీ ఒక్కొక్క అధ్యాయంలో విశ్లేషించారు. చివరికి, ఎలా ఎదుర్కోవాలి అని కొన్ని సూచనలు చేశారు. పౌర సమాజ సమీకరణ, ప్రతిఘటన మాత్రమే ఈ హిందుత్వ విస్తరణను అడ్డుకోగలదని ఆశాభావంతో ముగించారు.

ఆకార్ పటేల్ చేసిన సూత్రీకరణలన్నిటితో ఎవరైనా ఏకీభవించవచ్చు, విభేదించవచ్చు. కాని ఆధునిక భారత చరిత్రలో ఆధిపత్య, అధిక సంఖ్యాక మతతత్వం పెరుగుదల గురించి అన్వేషించడానికి, విశ్లేషించడానికి జరిగిన ఒక లోతైన, విస్తారమైన ప్రయత్నంగా ఈ పుస్తకాన్ని సగౌరవంగా ఆహ్వానించవలసి ఉంది. తీవ్రంగా అధ్యయనం చేసి, చర్చించి, ఈ అవగాహనలను మరింత పరిపుష్టం చేసి, విస్తృతంగా ప్రచారం చేయవలసి ఉంది. ఈ పుస్తకంలోని అవగాహనలతో, చరిత్ర వివరణతో, విశ్లేషణలతో నాకు భిన్నాభిప్రాయాలు లేవని కాదు.

మొట్టమొదట మతతత్వం గురించి చర్చించిన ఈ పుస్తకం లౌకిక వాదాన్ని నిర్వచించడంలో స్పష్టంగా లేదు. ఫ్రెంచి విప్లవం నాటి నుంచి యూరప్ ఆలోచనా ధోరణిలో వికసించిన లౌకికవాదం మతానికి రాజకీయాలతో, విద్యతో, పాలనతో, మొత్తంగా విశాల సామాజిక జీవనంతో సంబంధం ఉండగూడదని, ఆ సంబంధం (మిగతా 42లో)

# ‘సంవేదన’ శీలి, ఆ ‘సవ్యసాచి!’



మందలపర్తి కిషోర్
**సీనియర్ పాత్రికేయుడు**

**పుస్తక సమీక్షలంటే రచయితల భుజకీర్తులు సవరించి, ఆయా రచనల అమ్మకాలకు ఉపయోగపడే వాణిజ్య ప్రకటనలు కావనీ - రచనలోని తప్పొతాలూ ఎగరబోసి, గట్టిగింజల్ని మాత్రమే పాఠకుడి కందించి, అతగాడి విలువయిన సమయాన్ని ఆదా చేసే ప్రక్రియ అనీ రుజువు చేసినవాడు రా.రా. ‘మహానుభావుడు చలం’ శీర్షికతో సృజన వెలువరించిన ‘చలం ప్రత్యేక సంచిక’ను రా.రా. 1968 జులై ‘సంవేదన’లో సుదీర్ఘంగా - 24 పేజీల మేరకు - సమీక్షించారు. అందులో, కొత్త తరం విమర్శకులు చలాన్ని అంచనా వెయ్యడానికి ప్రయత్నించినందుకు హర్షం ప్రకటిస్తూనే, వారి అకడమిక్ విమర్శ పద్ధతిని ఘాటుగానే విమర్శించారు.**

తెలుగు కాల్పనిక సాహిత్యానికి చలం–కుటుంబరావు, కవిత్వానికి శ్రీశ్రీ–తిలక్ ఉమ్మడిగా చేసినంత సేవ, విమర్శ రంగానికి రాచమల్లు రామచంద్రారెడ్డి ఒక్కరే చేశారు. కథానిక, విమర్శ, పత్రికారచన, అనువాదం, బాలసాహిత్యం తదితర రంగాల్లో రా.రా. ఎన్నదగిన కృషి చేశారు. కుహనా సాహిత్య విమర్శ ప్రమాణాలను అక్షర ప్రపంచంలోంచి తరిమికొట్టడమే కాకుండా, సమకాలీన సమాజంలోని వైరుధ్యాలను పొట్టవిప్పి చూపించారు. “సాహిత్యం ఒక స్వతంత్ర సామాజిక శక్తి. అది ఏ రాజకీయాలకూ పరిచారిక కాకూడదు” అని ఎలుగెత్తి చాటిన రా.రా., సాహిత్యంలో అంటరానితనం పాటించే ఛాందసుడూ కాదు, మడిగట్టుకున్న శ్రోత్రియుడూ కాదు. అభ్యుదయ సాహిత్య పత్రిక అంటే ఎలా వుండాలో ‘సంవేదన’ ద్వారా చూపించి, తెలుగునాట మార్క్సిస్ట్ సాహిత్య విమర్శకు కనీస ప్రమాణాలు నెలకొల్పినవాడు. రాజకీయ విధానాల విషయంలో వాదోపవాదాలూ, చర్చోపచర్చలూ చేసే పత్రికలున్నట్టే, సాహిత్య సిద్ధాంతాలను కాచివడబోసే సాహిత్య పత్రికలు సైతం ఉండాలని భావించిన రా.రా., కొందరు మిత్రులతో కలిసి, 1968 ఏప్రిల్‌లో ‘సంవేదన’ను త్రైమాసిక పత్రికగా మొదలుపెట్టారు. ‘సంవేదన’లో అచ్చయిన రా.రా. సాహిత్య వ్యాసాలు ‘సారస్వత వివేచన’ పేర గ్రంథంగా వెలువడ్డాయి. ఉత్తమ సాహిత్య విమర్శ ప్రమాణాలను నెలకొల్పిన అతి కొన్ని పుస్తకాల్లో ఇది ఒకటి. ఈ పుస్తకం ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ పురస్కారాన్ని పొందింది. దాదాపు పాతికేళ్ళపాటు అనువాద రంగంలో కృషి చేసిన రా.రా. రచన ‘అనువాద సమస్యలు’ కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారాన్ని పొందింది. ‘సందేశం’ పత్రికలో రా.రా. రాసిన సుదీర్ఘ వ్యాసం ‘వ్యక్తి స్వాతంత్ర్యం – సమాజ శ్రేయస్సు’ స్వతంత్ర గ్రంథంగా వెలువడింది. ‘వీచిక’, ‘అభ్యుదయ’ తదితర పత్రికల్లో శిల్ప ప్రాముఖ్యం గురించీ, విశ్వనాథ సత్యనారాయణ సాహిత్య తత్వం గురించీ వ్యాసాలు వెలువరించారు రా.రా. కడప జిల్లాకు పరిమితమైన పత్రికగా మొదలైన ‘సవ్యసాచి’ సంపాదకుడిగా రా.రా.ను జర్నలిజం ముగ్గులోకి దింపింది గజ్జెల మల్లారెడ్డే. ఆ పత్రికలో ప్రధానంగా రాజకీయ, సామాజిక సమస్యలపై రాసిన రచనలే వచ్చేవి.



రా.రా.

అభ్యుదయ రచయితల సంఘం నిద్రాణావస్థలో ఉన్న ఆ రోజుల్లో ‘సవ్యసాచి’తో మొదలయిన కదలిక, ‘సంవేదన’తో అత్యున్నత ప్రమాణాన్ని అందుకుంది. దానికీ, దీనికీ కూడా రా.రా.యే సంపాదకుడు కావడం యాదృచ్ఛికం కాదు! ముఖ్యంగా, ‘సంవేదన’ ఆంధ్రప్రదేశమంతటా ఓ చైతన్య తరంగాన్ని ప్రసరింపచేసింది. ‘సంవేదన’లో పుట్టపర్తి, కొడవటిగంటి, కె.వి.రమణారెడ్డి, ఎస్.వి.ఎస్.రావు, గజ్జెల మల్లారెడ్డి, సొదుం జయరాం, శ్రీపతి, ఆర్వియార్, వరవరరావు, నవీన్, వి.సి.మౌళి, చేకూరి రామారావు, మిరియాల రామకృష్ణ,

గొల్లపూడి మారుతీరావు, డాక్టర్ తంగిరాల (సుబ్బారావు) తది తరుల రచనలు కనిపిస్తాయి. వాళ్ళందరూ ఆనాటి సాహిత్యా కాశంలో తళతళమెరిసే తారలు. 'చుక్కలు–చీకటి', 'నీతి గాను గు' లాంటి చక్కని కథలు రాసిన రా.రా.కు కథానిక ప్రక్రియ మీద పట్టే కాకుండా, ప్రత్యేకమైన అభిమానం కూడా ఉందని పిస్తుంది. సొదుం జయరాం కథానిక 'వాడిన మల్లెలు'పై 'సంవే దన'లో చేసిన ప్రయోగం, తర్వాతి రోజుల్లో వర్క్‌షాప్స్ లాంటి ప్రయత్నాలకు స్ఫూర్తినిచ్చింది. జయరాంతో పాటు మరో ముగ్గు రు (రా.రా.తో సహా!) అదే కథను తిరగరాసి, అన్నింటినీ కొడవగంటి కుటుంబరావు చేత విశ్లేషింపచేశారు. కుటుంబ రావు ఆ కథానికలపై చేసిన విశ్లేషణ కొత్త రచయితలకు బాల శిక్షలాంటిది! పుస్తక సమీక్షలంటే రచయితల భుజకీర్తులు సవ రించి, ఆయా రచనల అమ్మకాలకు ఉపయోగపడే వాణిజ్య ప్రక టనలు కావనీ – రచనలోని తప్పొతాలూ ఎగరబోసి, గట్టిగిం జల్ని మాత్రమే పాఠకుడి కందించి, అతగాడి విలువయిన సమ యాన్ని ఆదా చేసే ప్రక్రియ అనీ రుజువు చేసినవాడు రా.రా. 'మహాను భావుడు చలం' శీర్షికతో సృజన వెలువరించిన 'చలం ప్రత్యేక సంచిక'ను రా.రా. 1968 జులై 'సంవేదన'లో సుదీ ర్ఘంగా – 24 పేజీల మేరకు – సమీక్షించారు. అందులో, కొత్త తరం విమర్శకులు చలాన్ని అంచనా వెయ్యడానికి ప్రయత్నిం చినందుకు హర్షం ప్రకటిస్తూనే, వారి అకడమిక్ విమర్శ పద్ధతి ని ఘాటుగానే విమర్శించారు. సాహిత్య పత్రిక పాఠకులపట్ల రా.రా. ఆశలూ అంచనాలూ చాలా పెచ్చు స్థాయిలో వుండేవి. అందుకే 'సంవేదన' సంచికలు ఆ స్థాయిలో వుండేవి! ముందే చెప్పినట్లు రాచమల్లు రామచంద్రారెడ్డి తన సృజనాత్మక శక్తినంతటినీ, విమర్శ రంగానికే ధారపోసినప్పటికీ, మన సాహిత్యవిమర్శ రంగం ఇప్పటికీ సంస్కారపరంగా దీనావస్థలోనే కొనసాగుతోంది. వ్యక్తిగత సంబంధాల ప్రభావపరిధిలోనే విమ ర్శ రంగం గింగిరాలు తిరుగుతోంది. కులం, మతం, ప్రాంతం, రాజకీయాల ప్రాతిపదికగా రచయితలకూ–విమర్శకులకూ మధ్య 'క్విడ్ ప్రోకో' లావాదేవీలు కొనసాగుతూనే ఉన్నాయి. అసహనం ప్రాతిపదికగా రచయితలపై దుమ్మెత్తిపోయడానికి, మన విమర్శకులు తెగబడుతూనే ఉన్నారు. రచయిత యోగ్యత, దక్షత, ప్రతిభా పాటవాలపై తీర్పులు చెప్పడానికి పూనుకునే విమర్శకులకు అవసరమయిన ఆత్మవిమర్శ దృష్టి కొరవడుతూనే వుంది. ఒక్క మాటలో చెప్తే, మన విమర్శరంగంలో నిర్మమ త్వంతో నిర్మితమయిన ప్రమాణాలు ఇప్పటికీ రూపుదిద్దుకో నేలేదు. ఇందుకేనా రా.రా.లాంటి ప్రతిభావంతులు విమర్శ రం గానికి తమ సృజనాత్మక శక్తిని ధారపోసింది? కేంద్ర సాహిత్య అకాడమీ–యోగివేమన విశ్వవిద్యాలయం–బ్రౌన్ గ్రంథాలయాల ఉమ్మడి నిర్వహణలో, ఈ నెల 24న కడపలో జరిగే రా.రా. శతజయంతి ఉత్సవాల్లోనైనా, ఈ ప్రశ్న ప్రధానంగా ముందుకొస్తే బావుండును! ❑

# ఈ 'హైందవ రాజ్యం'లోకి ఎట్లా చేరాం?

(40వ పేజీ తరువాయి)

వ్యక్తిగత స్థాయికి మాత్రమే పరిమితం కావాలని నిర్దేశించింది. కాని ఆధునిక భారత రాజకీయ నాయకులందరూ ఆ మత రాహిత్యాన్ని, మతాతీత స్థితిని, సర్వమత సమభావం అని తలకిందులుగా నిర్వచించారు. అన్ని మతాలకూ సమాన దూరం అంటూ అధిక సంఖ్యాక మతానికి దాసోహం అన్నారు. ఆ తప్పుడు నిర్వచనపు విష ఫలితాలను ఇవాళ భారత సమాజం అనుభవిస్తున్నది. ఈ దిశగా పుస్తకం ఆలోచించలేదు.

రెండు, హిందుత్వ రాజకీయాల విస్తరణకు ఉన్న మత కోణాన్ని చాలా వివరంగా అనేక వైపుల నుంచి చర్చించారు గాని, అంతకన్న ముఖ్యమైన రాజకీయార్థిక, సామాజిక, సాంస్కృతిక కోణాల చర్చ వైపు పోలేదు. అలా చర్చిస్తే ఈ మతతత్వానికి, హిందుత్వకు ఉన్న వర్గ పునాది కూడా బైటపడి ఉండేది. "హిందుత్వకు కావలసింది ఫాసిజం కాదు, కాపిటలిజం కాదు, సోషలిజం కాదు" అనే అమాయక వ్యాఖ్యతో హిందుత్వకు ఉన్న ఆధిపత్య కుల, ఆధిపత్య మత, భూస్వామ్య, సామ్రాజ్యవాద, దళారీ పెట్టుబడిదారీ అనుకూల దృక్పథాన్ని వెలికి తేలేకపోయారు.

మూడు, హిందుత్వ విస్తరణలో సంఘ్ పరివార్ పాత్ర చాల చర్చకు వచ్చింది గాని, ఆ సమయంలోనే చర్చించవలసిన కాంగ్రెస్ పాత్ర, పార్లమెంటరీ రాజకీయాల పాత్ర అంతగా చర్చకు రాలేదు. వచ్చిన దగ్గర కూడా లోతుకు పోకుండా భారతీయ జనతా పార్టీ తప్ప మిగిలిన పార్టీలలో హిందుత్వ తక్కువ అన్నట్టుగానో లేదన్నట్టుగానో వ్యాఖ్యలున్నాయి. అది వాస్తవం కాదు.

ఇక తెలుగు పుస్తకంలో అనువాద సమస్యలు చాలా ఉన్నాయి. వేరు వేరు అనువాదకులు వేరు వేరు అధ్యాయాలు అనువదిం చినందువల్ల ప్రమాణాల మధ్య, భాషా వినియోగం మధ్య, శైలి మధ్య కొట్టవచ్చినట్టు కనబడే భేదాలున్నాయి. కొందరి అనువా దాలు మరింత బాగా ఉండే అవకాశం ఉండింది. కొన్నిచోట్ల తప్పు అనువాదాలు, పదాలూ, వాక్యాలూ తప్పిపోవడం, మూలంలో లేని పదాల ప్రయోగాలు, అన్వయం కుదరని వాక్య నిర్మాణాలు, 'మరియు' వంటి అనవసర ప్రయోగాలు, మూలంలోని ఉటంకింపుల చిహ్నాలు లేకపోవడం వంటి లోపాలు వచ్చాయి. ఈ లోపాలు ఉన్నప్పటికీ ఇవాళ్టి పరిస్థితుల్లో అత్యవసరమైన, అందరూ చదవవలసిన పుస్తకం ఇది. ❑




కారణం దొరికింది..!

నిజం తెలిసింది..!








రెండు వైపులా పదునే


కార్టూన్స్ : సతీష్ ఆచార్య

**RNI Title Code : APTEL 16175 - DAARI DEEPAM (Telugu Monthly)**

Vol : 1 - Issue No : 2 November 2022

## కొత్త పుస్తకాలు స్వీకారం










**if undeliverd please return to:**

**B.Ramesh Chandra Babu**

**34-15-1,**
**Doddipatal Vaari Thota Veedhi,**
**Tanuku - 534 211**
**West Godavari, Ap**
**Phone No : 93971 14495**

Printed Matter - Book Post

To :

**Printer, Publisher and Owner Bhupatiraju Ramesh Chandrababu, Published from 34-15-1, Doddipatla Vaari Thota Veedhi, Tanuku - 534 211, AP. Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, 520 004. Editor : DVVS Varma.**